మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 2 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 297 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

28 ఏళ్ల నడక..31 వేల మైళ్ల సాహసం..



2

తొలి 'బుల్లెట్ రైలు' మేకింగ్.. ఫస్ట్‌లుక్



2

ఆ ముగ్గురికి నిద్ర కరువు







మోడీని గద్దె దించేవరకు విశ్రమించం

20 కోట్ల ఓట్లు తొలగించేందుకు కుట్ర

పేదలు, దళితులు, ఆదివాసీలు, మహిళలపై కక్ష పెంచుకున్న ప్రధానమంత్రి

కాంగ్రెస్ శ్రేణులను ఢిల్లీకి రాకుండా అడ్డుకోలేకపోయారు: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 1, (మనం బ్యూరో): కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని, దళితులు, గిరిజనులు, మహిళల ఓట్ల తొలగించాలని భావించారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీకి 400 సీట్లు దాటితే రాజ్యాంగం

...మిగతా 2లో

జ్ఞానేశ్ తప్పించుకోలేరు..

ఆయనపై చర్యలు తప్పవు

రాంలీలా మైదానం బహిరంగ సభలో రాహుల్ గాంధీ

2



నేడు హైదరాబాద్‌కు అమిత్ షా

'లోక్‌తంత్రా బచావో – అరాచకత్ హటావో' బీజేపీ మహా పాదయాత్ర

2



పోటాపోటీ ర్యాలీలతో దద్దరిల్లిన ఢిల్లీ

ఢిల్లీ, నవంబర్ 1:

అధికార ప్రతిపక్షాల పోటాపోటీ ర్యాలీలతో పండుగ సీజన్‌లో ఆదివారం ఢిల్లీ వీధులు దద్దరిల్లాయి. ఓ పక్క ఇండియా కూటమి పార్టీలు రాంలీలా మైదానంలో భారీ సంఖ్యలో కార్యకర్తలతో 'ఓట్ బచావో, దేశ్ బచావో' పేరిట ర్యాలీ చేపట్టాయి. మరోవైపు '1984 సిక్కుల ఊచకోత'కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ శ్రేణులు కౌంటర్ ర్యాలీని నిర్వహించాయి. ఈ ఆందోళనకు

...మిగతా 2లో

ప్రధాని కావాలంటే.. ఆ పని చేయండి

రాహుల్‌గాంధీపై అమిత్ షా

ఢిల్లీ, నవంబర్ 1: ప్రధాని కావాలనుకుంటే జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉండిపోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. సిక్కుల ఊచకోత జరిగిన రోజే రాంలీలా మైదానంలో

...మిగతా 2లో

మాజీ మంత్రి హరీశ్‌రావుపై మరో కేసు

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

సిద్దిపేట వన్‌టౌన్‌కు కేసు బదిలీ

హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి: తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పేరు మరోసారి

...మిగతా 2లో

సీఈసీకి మోడీ అండ

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

గద్దె దించుతాం: అఖిలేష్‌యాదవ్

బెంగాల్ బాధిత రాష్ట్రం: మమతా బెనర్జీ







ఢిల్లీ, నవంబర్ 1: కేంద్రంతో పాటు అనేక రాష్ట్రాల్లో ప్రజాతీర్పును చోరీ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈడీ వంటి సంస్థలతో విపక్షాలను భయపెట్టేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, అయినప్పటికీ తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ.. పౌరులను విభజించి, వారి ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకూ పోరాడతామన్నారు. ఆయన్ను కాపాడేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని, ఈ దేశ యువత, మహిళలు వారిని వదిలిపెట్టరని అన్నారు.

గద్దె దించుతాం-అఖిలేష్

ఉత్తర ప్రదేశ్ ద్వారా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వారిని గద్దె దించుతామని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. యూపీ ఓటర్లు వారికి తగిన వీడ్కోలు పలుకుతారన్నారు. రాంలీలా మైదానం నూతన చరిత్ర లిఖించనుందని, మార్పు ఎప్పుడైనా రావచ్చని తెలిపారు.

ప్రతి లారీ దెబ్బకు తదుపరి తరం ప్రతీకారం తీర్చుకుంటుందని, కాషాయ పార్టీ తనను తాను కాపాడుకోలేదని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో యూపీలోనే కాకుండా కేంద్రంలోనూ బీజేపీ ఓటమి చవిచూడక తప్పదన్నారు.

బెంగాల్ బాధిత రాష్ట్రం - దీదీ

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు బెంగాల్ బాధిత రాష్ట్రమని తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ అన్నారు. మోసాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని, పోరాటం చేస్తామని అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని తిరిగి తెస్తామని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. బాధ్యతల నుంచి సీఈసీ ఎప్పుడు వైదొలగుతారోనని ఎదురుచూస్తున్నామని అన్నారు.



ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, నవంబర్ 1, (మనం బ్యూరో): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో అక్రమాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' నిరసన సభలో పాల్గొనడానికి రాష్ట్రం నుంచి వేలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. పీసీసీ పార్టీ వ్యయంతో 70, ముఖ్య నేతలు తమ సొంత ఖర్చుతో మరో 30 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. మంత్రులు, ముఖ్య నాయకులు కలిపి

...మిగతా 2లో



తెలంగాణకు మురాసు ముప్పు

నేటి నుంచి 5 వరకు రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 1 (మనం ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడిన మురాసు తుపాను ప్రభావం తెలంగాణపై పడనుంది. అయితే, రానున్న మూడు, నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారంనాడు వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా నవంబర్ 3న ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యంత

...మిగతా 2లో

మీ అణుశక్తి నిమిషాల్లో ఖతం

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, నవంబర్ 1: ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తమపై ఏ విధంగా, ఏ స్థాయి దాడికి పాల్పడినా అందుకు దీటైన సమాధానం ఇవ్వాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తన సేనలకు పిలుపునిచ్చారు. ఆయన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇప్పటికే ఆ దేశ అణు సామర్థ్యాన్ని చాలా వరకు ధ్వంసం చేశాం. ఇంకా మరో రెండు టార్గెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మేం తలచుకుంటే 10 నిమిషాల్లో ఆ అణు శక్తిని పూర్తిగా అంతం చేయగలం. మా లక్ష్యాలలో పికాక్స్ పర్వతం కూడా ఉంది. అయితే టెహ్రాన్తో చర్చలు జరుగుతున్నాయి. కానీ, ఆ దేశ నాయకులను నేను ఎప్పటికీ నమ్మలేను. మేం ఎప్పుడు దాడులు చేయబోతున్నాం

...మిగతా 2లో



భారతీయుల మిస్సింగ్

ఢిల్లీ, నవంబర్ 1: నేపాల్ పర్యటనకు వెళ్లిన ఆరుగురు భారతీయులు అదృశ్యమయ్యారు. డోల్పో బుద్ధ రూరల్ మున్సిపాలిటీలోని 4, 8 వార్డుల నుంచి

...మిగతా 2లో



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

– ఎడిటర్

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఆపరేషన్ 2.0

టెల్‌అవీవ్, నవంబర్ 1: ఇరాన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి ఇజ్రాయెల్ సీక్రెట్ ఆపరేషన్ చేపట్టింది. 2024లో హెజ్బొల్లా దళాల పేజర్లలో పేలుడు పదార్థాలు పెట్టి, వాటిని పేల్చినట్లే (ఆపరేషన్ గ్రిమ్ బీపర్).. ఇరాన్ విషయంలోనూ ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొసాద్ మాజీ గ్లోబల్ ఆపరేషన్స్ డిప్యూటీ హెడ్ ఒడెడ్ ఐలామ్‌ను ఉటంకిస్తూ.. అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. వాటి ప్రకారం.. ఇజ్రాయెల్-అమెరికా మరోసారి ఇరాన్‌పై దాడులు ప్రారంభిస్తే.. టెహ్రాన్‌కు చెందిన కీలక నేతలను లక్ష్యం చేసుకునే అవకాశం ఉంది. 'ఆపరేషన్ గ్రిమ్ బీపర్' తరహాలో వారివద్ద

...మిగతా 2లో



నిరసనలు, దోపిడీలు.. పోలీసులపైకి బాంబులు

హింసాత్మకంగా జర్మనీ



బెర్లిన్, నవంబర్ 1: పెరుగుతున్న జీవన వ్యయాలు, విద్యాలయాల్లో సౌకర్యాల లేమి, తప్పనిసరిగా సైనిక సేవల్లో పాల్గొనాలనే నిబంధనలకు వ్యతిరేకంగా జర్మనీలో నిరసనలు కొనసాగుతున్నాయి. 'జెన్ జీ రెగెల్ట్' అనే ప్రచార బృందం ఈ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ప్రజలకు ఆర్థిక భద్రత, మెరుగైన ప్రజా సేవలు అందించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిచ్ సహా 34 ప్రధాన నగరాల వీధుల్లోకి దాదాపు పదివేల మంది నిరసనకారులు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. వారిని అడ్డుకోవడానికి యత్నించిన భద్రతా బలగాలపై అల్లరిమూకలు పెట్రోల్ బాంబులు విసరడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఆందోళనలను అదునుగా చేసుకొని కొందరు ముసుగులు ధరించిన దుండగులు ఫ్రాంక్‌ఫర్ట్‌లోని పలు దుకాణాలలో చొరబడి సామాన్లు, ఇతర లగ్జరీ వస్తువులను దోచుకున్నారు. ఆందోళనకారులు పలు దుకాణాల కిటికీలు, వాహనాల అద్దాలు పగలగొట్టి.. బారికేడ్లకు నిప్పు పెట్టడంతో హింసాత్మక వాతావరణం నెలకొందని పోలీసులు పేర్కొన్నారు. వారిని అడ్డుకున్న సిబ్బందిపై మద్యం సీసాలు, పెట్రోల్ బాంబులు విసిరారని తెలిపారు. జాతి వ్యతిరేక శక్తులు ఆందోళనకారుల్లో

...మిగతా 2లో

నిద్రకు కరువైనా ఆ ముగ్గురు





ఢిల్లీ, నవంబర్ 1: ప్రధాని మోడీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాత్రుళ్లు నిద్రపోలేకపోతున్నారని.. వాళ్లు ఈ దేశానికి ఆత్మలాంటి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన రాహుల్ గాంధీ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పించుకోలేరని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

''ఇది ఏ ఒక్క నేత, పార్టీ గళం కాదు. దేశ యువత, మహిళలు, రైతులు, కార్మికుల స్వరం. మతం కన్నా ప్రతి భారతీయుడి గళమే నాకు ముఖ్యం. రాజ్యాంగాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను అమోదించం. ఎన్నో ఏళ్లుగా దేశంలో ఓటు చోరీ జరుగుతోంది. దీని ద్వారానే 2024 లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్ర ఎన్నికల్లో గెలుస్తున్నారు. దేశ వ్యవస్థ మొత్తం కేవలం ఇద్దరు, ముగ్గురు చేతుల్లోనే ఉండటాన్ని కోరుకోవడం లేదు. దీన్ని ఆమోదించే ప్రసక్తే లేదు.

దేశాన్ని గాడిలో పెట్టాలంటే మొట్టమొదటగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించడమే. ఆయన జైలుకు వెళ్లక తప్పదు'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

మోడీ ఎక్కడికీ వెళ్లడం లేదని హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందిస్తూ.. తప్పించుకోవాలని ప్రయత్నించినా అది సాధ్యం కాదన్నారు. పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు ఆదాయం లేవని.. కేవలం కొందరు వ్యాపారవేత్తలు లాభపడితే చాలు అన్నట్లుగా మోడీ పాలన ఉందని ఆక్షేపించారు. టెలికాం, పోర్టులు, బ్యాంకులు అన్నింటినీ ఓ వ్యక్తి చేతిలోనే పెట్టారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమిత్ షా కలిసి దేశాన్ని అమ్మేస్తున్నారని మండిపడ్డారు.

28 ఏళ్ల నడక..31 వేల మైళ్ల సాహసం..

● చరిత్ర సృష్టించిన కార్ల్ బుష్బీ

లండన్, నవంబర్ 1: జత బూట్లు, నడవాలన్న పట్టుదల ఉంటే చాలు భూగోళాన్నే చుట్టేయొచ్చని నిరూపించారు బ్రిటీష్ సాహసికుడు కార్ల్ బుష్బీ. కాలినడకన 28 ఏళ్ల ప్రయాణం చేశారు. మధ్యలో సవాళ్లు, జైలు శిక్షలు, వీసా కష్టాలు, మృత్యుభయాలు.. ఆయన్ను లక్ష్యాన్ని చేరుకోకుండా ఆపలేకపోయాయి. 'నవంబర్ 1, 1998లో దక్షిణ అమెరికాలోని చిలీ దేశం నుంచి ప్రారంభమైన ఆయన యాత్ర సుమారు మూడు దశాబ్దాలపాటు నాలుగు ఖండాలు, 29 దేశాల గుండా 31 వేల మైళ్లు సాగింది. ఆయన చేసిన ఈ అసాధారణ ప్రయాణం అందరినీ అబ్బురపరుస్తోంది. నవంబర్ 2, 2026 నాటికి ఇంగ్లాండ్‌లోని తన సొంతూరు హల్ నగరానికి చేరుకొని యాత్రను పూర్తి చేయనున్నారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఆపరేషన్ 2.0

(మొదటి పేజీ తరువాయి)

ఉండే పేజర్లు, బీపర్లు, వాకీ టాకీలు వంటి కమ్యూనికేషన్ పరికరాలను పేల్చేయవచ్చని సమాచారం. ఇప్పటికే ఇలాంటి పేలుడు పదార్థాలు కలిగిన పరికరాలను ఇరాన్కు చేరవేసినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎందుకంటే? ఇరాన్ నేతలను లక్ష్యం చేసుకోవడానికి ఇజ్రాయెల్ కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. ఇజ్రాయెల్ చేస్తున్న ఈ ప్రయత్నాలు భూతల దాడుల కంటే మరింత వినాశకరంగా ఉండే ప్రమాదం కూడా ఉంది.

కాగా గతంలో టెహ్రాన్ అణు శుద్ధి కార్యక్రమానికి అవసరమైన సెంట్రీఫ్యూజుల్లో ఇజ్రాయెల్ పేలుడు పదార్థాలను అమర్చి, సరఫరా చేసినట్లు ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి మహమ్మద్ జావెద్ జారిఫ్ ఇటీవల స్వయంగా వెల్లడించారు. వాటివల్లే 2020లో నతాంజ్ అణు విద్యుత్‌కేంద్రంలో పేలుడు సంభవించిందన్నారు.

టార్గెట్ లిస్ట్‌లో నలుగురు నేతలు..

ప్రస్తుతం ఇరాన్‌లో ముఖ్య నేతలుగా ఉన్న ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియన్, సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ గాలిబఫ్‌లు కేవలం నామమాత్రపు నాయకులేనని ఇజ్రాయెల్ భావిస్తోంది. దాని ప్రకారం వారి వెనుక ఉండి నడిపించే వారు వేరు. దేశానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు కూడా వారే తీసుకుంటారు. మొజ్తబాతో పాటు బయటకు కనిపించేవారంతా ఆ రహస్య అధికారుల సూచనలనే పాటిస్తారు. వారు ఎవరంటే?

ఐఆర్జీసీ కమాండర్–ఇన్–చీఫ్ అహ్మద్ వాహిది..బసిజ్ దళాల కమాండర్ హుస్సేన్ తాయెబ్

ఇరాన్ సైన్యాధిపతి అలీ అబ్దుల్లాహి..సుప్రీం నేషనల్ సెక్యూరిటీ సెక్రటరీ మొహ్సెన్ రెజాయిలున్నారు.

ఈ ఏడాది జనవరిలో ఇరాన్‌లో ఆందోళనలు జరిగినప్పుడు 75,000 మంది నిరసనకారులను దారుణంగా ఊతకోత కోయడం వెనుక వీరి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో అమెరికాతో ఒప్పందానికి ఇరాన్ ప్రభుత్వ నేతలు సిద్ధంగా ఉన్నప్పటికీ.. ఈ నలుగురే దానిని అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. అమెరికాతో మొదట ఒప్పందం కుదిరిన సమయంలో హర్మూజ్‌ను తిరిగి తెరుస్తున్నట్లు అరాగ్చి ప్రకటించినప్పటికీ.. ఐఆర్జీసీ దళాలు జలసంధిని మళ్లీ మూసేశాయి. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ వీరిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఈ నలుగురు నేతలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ.. కోవర్ట్ ఆపరేషన్ల ద్వారా వారిని హతమార్చాలని ఇజ్రాయెల్ ప్లాన్ అని తెలుస్తోంది.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

1500 మంది వరకు విమానాల్లో వెళ్లడానికి సొంత ఏర్పాట్లు చేసుకున్నారు. కాంగ్రెస్ నేతల్లో కొందరు శనివారం రాత్రి నాటికే ఢిల్లీకి చేరుకునేందుకు ఏర్పాట్లు చేసుకోగా మరికొందరు నేతలు ఆదివారం ఉదయం చేరుకున్నారు. కాగా, విమానాలు, సొంత బస్సుల్లో వెళ్లలేని నేతలు, కార్యకర్తలు దాదాపు 1500కి పైగా రైళ్ల ద్వారా ముందుగానే రిజర్వేషన్ చేసుకుని ఢిల్లీకి చేరుకున్నారు. మరికొందరు నేతలు సొంతంగా కార్లు ఏర్పాటు చేసుకుని నేరుగా తమ అనుచరులతో కలిసి ఢిల్లీకి వెళ్లినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో నిర్వహించిన నిరసనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల ముందుగానే ఢిల్లీకి చేరుకున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం అడ్లూరి లక్ష్మణ్, దామోదర రాజనర్సింహ్మ తదితరులు శనివారమే ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీకి వెళ్లిన వారికి వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించడానికి పీసీసీ ప్రత్యేకంగా కమిటీలను సైతం ఏర్పాటు చేయడం విశేషం.

పోటాపోటీ ర్యాలీలతో దద్దరిల్లిన ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి నాయకత్వం వహించారు. నాడు సిక్కులపై దాడులు పూర్తిగా కుట్రపూరితంగా జరిగిన ఊచకోత అని పేర్కొన్నారు. నాటి అల్లర్ల వేళ తన తల్లిదండ్రులను హిందూ స్నేహితులు ఎలా కాపాడారో వివరించారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాష్ట్ర బీజేపీ నాయకులు హర్ష్ మల్హోత్రా, ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

రాంలీలా మైదానంలో కూటమి నేతలు

మరోవైపు ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసం నుంచి రాంలీలా మైదానానికి చేరుకొంది. వీరిలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తేజస్వీ యాదవ్ ఉన్నారు.

మోడీని గద్దె దించేవరకు విశ్రమించం

(మొదటి పేజీ తరువాయి)



ద్వారా వచ్చిన ఓటు హక్కును తొలగిస్తారని ప్రజలు ఆ సంఖ్యను ఇవ్వకపోవడంతో పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలపై కక్ష పెంచుకున్న ప్రధానమంత్రి ఓటు హక్కు తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటు బచావో... దేశ్ బచావో పేరుతో ఢిల్లీ రాంలీలా మైదాన్లో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ భారతదేశంలోని ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించారని, కానీ ఆ ఓటు హక్కును తొలగించేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, 20 కోట్ల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతం ఓట్లు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రయోగాత్మకంగా ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ ఇప్పటికే బీహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్లో అధికారంలోకి వచ్చిందని, ఢిల్లీలోనూ మరోసారి అలానే అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతున్నారని సీఎం అన్నారు. సభకు తెలంగాణ నుంచి 15 వేల మంది వచ్చేలా పీసీసీ ఆధ్వర్యంలో రైళ్లు ఏర్పాటు చేస్తే, ఆఖరి నిమిషం వరకు నమ్మించి చివర్లో రైళ్లు రద్దు చేసి కార్యకర్తలు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైళ్లు ఇవ్వకపోయినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా ఢిల్లీ వచ్చారని, నరేంద్ర మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లు కార్యకర్తల సంకల్పాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు. తెలంగాణ బలం ముందు, తెలంగాణ గళం ముందు మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ తలవంచక తప్పలేదని సీఎం అన్నారు. నాడు రావణుడిని ఓడించేందుకు రాముడికి వానర సేన తోడ్పడినట్లు, నేడు నరేంద్ర మోదీని ఓడించేందుకు కాంగ్రెస్ వానర సైన్యం పోరాడుతుందని, ఇందులో విజయం సాధించే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాంలీలా మైదానంలో కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకునే దీక్షతో నరేంద్ర మోదీ గద్దె కూలక తప్పదని, వాళ్లు గుజరాత్ వెళ్లక తప్పదని హెచ్చరించారు. రాంలీలా మైదాన్ లో ఇండియా కూటమి నేతలు ఇచ్చే సందేశాన్ని ప్రతి గ్రామానికి, ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సీఎం సూచించారు. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నేతలు ఫరూఖ్ అబ్దుల్లా, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ, తేజస్వీ యాదవ్, మెహబూబా ముఫ్తీ, సంజయ్ రౌత్ లతో కలిసి ఓపెన్ టాప్ జీపులో రాంలీలా మైదాన్‌కు తరలివెళ్లారు.



భారతీయుల మిస్సింగ్

(మొదటి పేజీ తరువాయి)

నేపాల్లోని అత్యంత లోతైన సరస్సు షే-ఫోక్సుండో వైపు ట్రెక్కింగ్‌కు బయల్దేరిన ఇద్దరు మహిళలు, నలుగురు పురుషుల జాడ గల్లంతైందని అధికారులు వెల్లడించారు. తుపాను కారణంగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు, హిమపాతం కురుస్తున్నాయని స్థానిక గైడ్లు పేర్కొన్నారు. వారు వెళ్తున్న ప్రాంతంలో భారీగా మంచు కురుస్తుండటంతో వెళ్లొద్దని హెచ్చరించామని.. అయినా వారు వినిపించుకోలేదని తెలిపారు. పర్యాటకులు మంచులో ఎక్కడైనా చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయితే వారు ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయం తెలియాల్సి ఉంది. 4, 8 వార్డుల మధ్య ఉన్న పర్వత కనుమల్లో మొబైల్ ఫోన్ కమ్యూనికేషన్ అందుబాటులో లేకపోవడంతో పర్యాటకుల ఆచూకీ గుర్తించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. వారి కోసం నేపాల్ సైన్యం గాలింపు చర్యలు చేపట్టిందని.. సహాయక చర్యల కోసం హెలికాప్టర్‌ను రంగంలోకి దించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని పర్యాటకులకు విజ్ఞప్తి చేశారు.

హింసాత్మకంగా జర్మనీ

(మొదటి పేజీ తరువాయి)

కలిసి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని జర్మనీ ఫెడరల్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నిరసనలను అణచివేయాలని..లేదంటే పరిస్థితులు మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని యువతను హెచ్చరించింది. దోపిడీలు, దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించింది.



మీ అణుశక్తి నిమిషాల్లో ఖతం

(మొదటి పేజీ తరువాయి)

అని ప్రతిఒక్కరూ తెలివి తక్కువగా అడుగుతున్నారు. నేడు దాడులు చేయాలని అనుకుంటే.. అందరికీ చెప్పి చేస్తానా?' అని ట్రంప్ ప్రశ్నించారు.

ఇరాన్‌లోని కుహ్-ఎ కోలాంగ్ గాజ్ లా పర్వతాన్ని స్థానికంగా పికాక్స్ పర్వతంఅని పిలుస్తారు. ఇది జాగ్రాస్ పర్వత శ్రేణిలో.. నతాంజ్ అణు కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరాన్ తన అణు కార్యక్రమానికి అవసరమైన సెంట్రిఫ్యూజ్లను ఇక్కడికి తరలించి ఉండొచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు గతంలో అంచనా వేశాయి. ఈ కేంద్రంలో ఇప్పటికీ అణు కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అమెరికా నమ్ముతోంది. ఈ నేపథ్యంలోనే పికాక్స్ పర్వతాన్ని లక్ష్యం చేసుకుంటామని ట్రంప్ కొంత కాలంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ స్థావరంపై అగ్రరాజ్యం దాడులు చేస్తే.. పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతాయని ఇరాన్ హెచ్చరిస్తోంది.

మాజీ మంత్రి హరీశ్‌రావుపై

మరో కేసు

(మొదటి పేజీ తరువాయి)

వార్తల్లోకి వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనతో పాటు భార్య ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని చక్రధర్ గౌడ్ చేసిన ఫిర్యాదుతో ఈ వివాదం మొదలైంది. గతంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు తాజాగా సిద్దిపేట వన్‌టౌన్‌కు బదిలీ నేపథ్యంలో... హరీశ్‌రావుపై సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదైంది. పాత ఎఫ్ఐఆర్‌లో లేని మరో ఆరు సెక్షన్లను అదనంగా చేర్చడం ఈ వ్యవహారంలో ఇప్పుడు తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. హరీశ్‌రావును ఏ1గా, మాజీ డీసీపీ రాధాకిషన్ రావును ఏ2గా పేర్కొనడంతో పాటు ఐపీసీ, ఐటీ చట్టాలకు సంబంధించిన ఆరు అదనపు సెక్షన్లను చేర్చినట్లు తెలుస్తోంది. ఈ కేసు వెనుక ఉన్నది సిద్దిపేటకు చెందిన గాదగోని చక్రధర్‌గౌడ్.. తనతో పాటు కుటుంబ సభ్యుల ఫోన్లపైనా నిఘా పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో క్రైమ్ నంబర్ 1205/2024 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో ఈ కేసులో హరీశ్‌రావు ఏ1గా..మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఏ2గా ఉండగా.. ఈ కేసు న్యాయపరమైన పరిణామాలను సైతం ఎదుర్కొన్నారు. అయితే, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. తాజాగా క్రైమ్ నంబర్ 496/2026తో పోలీసులు కొత్తగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

నేడు హైదరాబాద్‌కు అమిత్ షా

హైదరాబాద్,నవంబర్01(మనం న్యూస్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో నేడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటించనున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై తెలంగాణ బీజేపీ చేపట్టిన 'లోక్‌తంత్రా బచావో - అరాచకత్ హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని తరిమికొడదాం) నినాదంతో సాగే మహా పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం 2:15 నుండి 3:30 గంటల వరకు ఐటీసీ కాకతీయ హోటల్లో ప్రముఖులతో సమావేశమవుతారు.

సాయంత్రం 4:00 గంటలకు నిజాం కాలేజ్ ఎదురుగా ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నుంచి మహా పాదయాత్ర ప్రారంభం కానుంది. సాయంత్రం 5:00 నుండి 5:30 గంటల వరకు మొజాంజాహీ మార్కెట్ జంక్షన్‌లో జరిగే బహిరంగ సభనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. యాత్ర సాగే మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు అమలు చేయనుండటంతో.. బేగంపేట, చార్మినార్, మొజాంజాహీ మార్కెట్, నిజాం కాలేజ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలకు అనుగుణంగా సహకరించాలని అధికారులు నగర వాసులకు విజ్ఞప్తి చేశారు.

ప్రధాని కావాలంటే..ఆ పని చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సభ నిర్వహించడం బాధితుల పుండుమీద కారం చల్లినట్లేనని వ్యాఖ్యానించారు. చండీగఢ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ఈమేరకు ప్రసంగించారు. అబద్ధాలు చెప్పడం, అరాచకాన్ని వ్యాప్తి చేయడం, పార్లమెంటును పనిచేయనివ్వకపోవడం.. ఇదే ప్రతిపక్షాల నిజ స్వరూపమని మండిపడ్డారు.''1984 నవంబరు 1న వేలాది మంది సిక్కులను ఊచకోత కోశారు. ఒక రాజకీయ పార్టీ రెచ్చగొట్టిన ఈ తరహా అల్లర్లను భారత్ ఎన్నడూ చూడలేదు. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం.. 1984నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లలో పాల్గొన్న వారందరి కేసులను తిరిగి తెరిచింది. అల్లర్లలో మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇచ్చింది. అదే సమయంలో నాటి హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలను జైలులో పెట్టింది'' అని అమిత్ షా తెలిపారు.విపక్షాల 'చలో ఢిల్లీ' సభను మూర్ఖపు నాటకంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ''ఢిల్లీలో అరాచకాన్ని సృష్టించి.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టడం, పండగ సీజన్లో దుకాణదారులు, వ్యాపారులకు నష్టం కలిగించడం, దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం వంటివి ఈ ర్యాలీ లక్ష్యాలు'' అని విమర్శించారు. భారత్ ఒక బలమైన ప్రజాస్వామ్య దేశమని, ఇది అల్లర్ల రాజకీయాలతో కాకుండా.. రాజ్యాంగం, ప్రజల తీర్పుతో నడుస్తుందన్నారు.

తెలంగాణకు మురాసు ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కుర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. నేడు, రేపు తెలంగాణలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరిలో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఖమ్మం, నల్గొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.రేపు, ఎల్లుండి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.ఇక రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలి

● పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 30, (మనం బ్యూరో): అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ర్యాలీకి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీకి తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్యకర్తలందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించే వరకూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం ఆగదని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.




రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంలో మేమంతా సైనికులమే: జగ్గారెడ్డి



జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంలో మేమంతా సైనికులమేననీ, వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి.. అందుకు మేమంతా కష్టపడతామని స్పష్టం చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన బహిరంగ సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జగ్గారెడ్డి భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఆయన ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ 'ఓట్ల చోరీ'కి పాల్పడిందని ఆరోపించారు.

ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం ఆయన సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్కు తోడుగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుకు కదులుతున్నారని అన్నారు.జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు. దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే ఇందిరమ్మ పాలన మళ్లీ రావాలనీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఆ కల నెరవేరుతుందన్నారు. బీజేపీ చేస్తున్న ఓట్ చోరీకి వ్యతిరేకంగా, దేశ ప్రజల హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని ఈ సందర్భంగా జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.



భారత్‌తొలి 'బుల్లెట్ రైలు' మేకింగ్.. ఫస్ట్‌లుక్

ఢిల్లీ, నవంబర్ 1: భారత్లో మొట్టమొదటగా ముంబయి-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలును వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రైలును స్వదేశీ సాంకేతికతతో స్థానికంగానే అభివృద్ధి చేస్తుండటం విశేషం. ఇందుకు సంబంధించిన పనులు కర్ణాటకలోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ కేంద్రంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. అధునాతన ఇంజినీరింగ్ వ్యవస్థ, స్వదేశీ నైపుణ్యంతో భారత్లోని పరిస్థితులకు అనుగుణంగా బుల్లెట్ రైలును రూపొందిస్తున్నారు.

ఈ కేంద్రాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పరిశీలించి, పనులను పర్యవేక్షించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ బుల్లెట్ రైలును రూపొందించామని, అత్యంత కఠినమైన స్వేజ్ టెస్టు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది ముంబయి-అహ్మదాబాద్ మధ్య తొలి రైలు ప్రారంభం కానుందన్నారు.

‘ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్’

భిన్నత్వంలో ఏకత్వమే అసలైన బలం

రాష్ట్రాల స్థాపన దినోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, నవంబర్ 01(మనం న్యూస్)ః భారతదేశంలోని భాషా, సాంస్కృతిక, ప్రాంతీయ వైవిధ్యాలు జాతీయ ఐక్యతకు బలమైన పునాదులని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల స్థాపన దినోత్సవాలను ఒకే వేదికపై నిర్వహించడం ‘ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్’ స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోజరగడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం లోక్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, హర్యానా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ దీవులు, చండీగఢ్, ఢిల్లీ, లక్షద్వీప్, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ దంపతులు శివ ప్రతాప్ శుక్లా, తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. భారతదేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అందించిన సేవలు చిరస్మరణీయమని గవర్నర్ అన్నారు. అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని, నేడు వివిధ రాష్ట్రాల స్థాపన దినోత్సవాలను జరుపుకోవడం ద్వారా దేశ ఐక్యతకు నిదర్శనమని ఆయన తెలిపారు.భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడినా.. అన్ని రాష్ట్రాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని,ప్రతి రాష్ట్రానికీ ప్రత్యేక చరిత్ర, భాష లు సాంస్కృతిక సంగమం దేశ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని గవర్నర్ స్పష్టంచేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన ‘సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్’ స్ఫూర్తితో వికసిత భారత్ దిశగా ముందుకు సాగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఆత్మనిర్భరత, సమ్మిళిత అభివృద్ధి, మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని గవర్నర్ సూచించారు. సమాజంలోని ప్రతి వర్గం, ప్రతి ప్రాంతం దేశ ప్రగతిలో భాగస్వామ్యమైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని గవర్నర్ వెల్లడించారు. హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,ప్రకృతి పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి సమష్టి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ...వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలు సమష్టిగా దేశ అభివృద్ధికి కృషి చేస్తూ దేశాన్ని సమున్నతంగా నిలపాలన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్ , హోం శాఖ కార్యదర్శి శిఖా గోయల్, తెలంగాణ జూ పార్కుల సంచాలకులు డాక్టర్ సునీల్ ఎస్. హీరేమత్, సంయుక్త కార్యదర్శి కొమండూరు శశి కిరణ్, సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రపంచ విపణిలో తెలంగాణ ఉత్పత్తులు



ఎఫ్టీఏలతో సరికొత్త ఎగుమతుల దిశగా ముందడుగు

నేడు హైదరాబాద్‌లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై అవగాహన కార్యక్రమం

హైదరాబాద్,నవంబర్01(మనం న్యూస్): వ్యవసాయం మొదలుకొని అత్యున్నత సాంకేతికతతో కూడిన ఎలక్ట్రానిక్స్, ఔషధ రంగాల వరకు రాష్ట్ర ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో సరికొత్త అడుగులు పడుతున్నాయి. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్టీఏ) ఫలాలను క్షేత్రస్థాయికి చేరవేస్తూ, స్థానిక పారిశ్రామికవేత్తలు,సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఉత్పత్తులను ప్రపంచ విపణికి విస్తరించే బృహత్ లక్ష్యంతో నేడుహైదరాబాద్‌లోని టీ-హబ్ వేదికగా రాష్ట్రస్థాయి మెగా అవగాహన సదస్సు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభంకానుంది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సదస్సును ప్రారంభించి, ఎఫ్‌టీఏల ప్రాధాన్యతను వివరిస్తూ కీలక ప్రసంగం చేయనున్నారు. ఒప్పందాలకు సంబంధించిన ప్రత్యేక దృశ్యమాలికను ఆవిష్కరించి,కేంద్ర వాణిజ్య శాఖ సహకారంతో జరుగుతున్న ఈ సదస్సులో అంతర్జాతీయ వాణిజ్య నిపుణులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పెద్దఎత్తున పాలుపంచుకోనున్నారు. తెలంగాణ మట్టి వాసనలను ప్రపంచానికి చాటే పసుపు పంట ఎగుమతుల విస్తరణ నుంచి అత్యాధునిక పారిశ్రామిక వస్తువుల వరకు ప్రతి రంగానికి విదేశీ మార్కెట్లలో లభిస్తున్న రాయితీలు, నిబంధనలపై స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. ఉత్పత్తుల మూల దేశ నిర్ధారణ నిబంధనలు, డీజీఎఫ్‌టీ ఆధ్వర్యంలోని ట్రేడ్ కనెక్ట్ ఈ-ప్లాట్‌ఫామ్ పనితీరును నిపుణులు వివరించనున్నారు. వ్యవసాయం, రత్నాలు-ఆభరణాలు, రసాయనాలు-ఔషధాలు, ఇంజినీరింగ్-ఎలక్ట్రానిక్స్, వస్త్ర రంగాలు ప్రధానంగా ఐదు ప్రత్యేక చర్చా వేదికల్లో ఎగుమతుల పెంపునకు భవిష్యత్ ప్రణాళికలను ఈ సదస్సులో రూపొందించనున్నారు. గడచిన కాలంలో ఎఫ్‌టీఏల ద్వారా లబ్ధి పొందిన స్థానిక ఎగుమతిదారులు తమ అనుభవాలను పంచుకుంటూ తోటి పారిశ్రామిక వర్గాల్లో ఉత్సాహాన్ని నింపనున్నారు.

‘ఓట్ ఫర్ నోట్ చోర్’

- **ఢిల్లీ ‘ఓట్ చోరీ’పై నిరసనపై రాహుల్, రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శ**



హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ‘ఓట్ల చోరీ’ ఆరోపణలపై నవంబర్ 1న ఢిల్లీలో ‘ఇండియా’ కూటమి తలపెట్టిన నిరసనను ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారంనాడు కేటీఆర్ స్పందించారు. ‘ఓటుకు నోటు దొంగ’తో కలిసి ‘ఎమ్మెల్యేల దొంగ’ ఢిల్లీలో ‘ఓట్ల చోర్’కి వ్యతిరేకంగా నిరసన చేయడం కాంగ్రెస్‌కే చెల్లిక’ అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించిన రాహుల్ గాంధీ, ఇప్పుడు ‘ఓటుకు నోటు’ కేసులో నిందితుడైన రేవంత్ రెడ్డితో కలిసి దేశంలో ఓట్ల దొంగతనం గురించి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇక ఫైనల్‌గా ‘భారత ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి’ అంటూ తన సెటిరికల్ పోస్ట్‌తో కేటీఆర్ మరోసారి తనదైన శైలిలో రేవంత్, రాహుల్‌ను ఎండగట్టారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు

రైతు కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటది

ఏడాది ఆగితే కేసీఆరే సీఎం: కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి : తెలంగాణలో ఈ దుష్ట రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటుగా కేటీఆర్ విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం అందక, యూరియా కొరత, విద్యుత్ సమస్యలు, పంటల కొనుగోళ్లలో ఇబ్బందులతో అప్పుల భారం పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు మండలంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నలుగురు రైతుల కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పార్టీ తరపున రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఒక్క తలమడుగు మండలంలోనే నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. లక్ష్మణ్ వ్యవసాయ పొలంలో ఉరేసుకుని చనిపోగా.. గుర్రాల ప్రతాప్‌రెడ్డి, పశుల హాసన్న, ధన్నూరు గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెయ్యికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. వీరిలో అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే వందకు పైగా ఘటనలు జరగడం బాధాకరమన్నారు.

రైతు కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. అయినప్పటికీ.. బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా నిలవాలని కేసీఆర్ ఆదేశించారని కేటీఆర్ తెలిపారు. అందులో భాగంగానే బాధిత నాలుగు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందించినట్లు చెప్పారు. అయితే ఈ సాయం సరిపోదని, రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. మరో ఏడాది ధైర్యంగా ఉండాలని, ఆ తర్వాత కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని, రైతులకు మళ్లీ భరోసా కల్పిస్తారని వ్యాఖ్యానించారు. రైతు కుటుంబాలు మనోధైర్యం కోల్పోవద్దని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వారికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.



గవర్నర్ అశోక్ గజపతిరాజుతో తెలంగాణ బృందం భేటీ

హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి: గోవా రాష్ట్ర గవర్నర్ హెచ్.ఈ పుసపాటి అశోక్ గజపతి రాజును తెలుగు ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ‘మనం ఫౌండేషన్’ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.ఎస్. కుమార్ నేతృత్వంలో రాంబాబు, జి. లక్ష్మణ్ గౌడ్, శేషగిరి రావు, జి. పూర్ణ చంద్రరావు, రాహుల్, మాధ శ్రీకాంత్ గౌడ్ తదితరులు గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోవా రాష్ట్ర చరిత్ర, సాంస్కృతిక వైభవం, వారసత్వ సంపద గురించి గవర్నర్ వారికి వివరించారు. రాష్ట్రంలోని పోర్టులు, చర్చిలు, మసీదులు, దేవాలయాల ప్రత్యేకతలను ఆసక్తికరంగా తెలియజేశారు. తెలుగు వారిని కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గవర్నర్ అశోక్ గజపతిరాజు పేర్కొనడం.. తమకు ఆనందాన్ని, గర్వాన్ని కలిగించిందని ప్రతినిధులు తెలిపారు.

ఆసియా క్రీడల్లో సేవలకు అంతర్జాతీయ టెక్నికల్ గోల్ మెడల్

భారత్, తెలంగాణకు అంకితం ః పెరిక సురేశ్



హైదరాబాద్, నవంబర్ 01(మనం బ్యూరో): జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన 20వ ఆసియా క్రీడలు-2026లో అందించిన సేవలకు గాను అంతర్జాతీయ టెక్నికల్ గోల్ మెడల్ అందుకోవడం గర్వంగా ఉందని అవార్డు గ్రహీత పెరిక సురేష్ పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును భారతదేశానికి, తన ప్రియమైన తెలంగాణకు అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు. భారత క్రీడారంగానికి మరింత అంకితభావంతో సేవలందించేందుకు ఈ పురస్కారం స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రుల ప్రోత్సాహం, అభినందనలు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. దేశ క్రీడారంగానికి సేవలందించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

సర్కార్ ధరల కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలే?

హైదరాబాద్‌లో పలు చోట్ల తనిఖీలు.. కేసులు

హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి : తెలంగాణలో సన్న బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. కొంత మంది మిల్లర్లు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి, అక్రమ నిల్వల ద్వారా ధరలను పెంచుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. వినియోగదారులపై అదనపు భారం పడకుండా వివిధ రకాల సన్న బియ్యంపై గరిష్ఠ చిల్లర ధరలను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు ఇటీవల రెండు రోజుల క్రితం రైస్ మిల్లర్లు, వ్యాపారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ధరలను ఖరారు చేశారు. తాజా నిర్ణయం ప్రకారం.. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలోకు గరిష్ఠంగా రూ.66, తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్ రకం రూ.74, అలాగే హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలను రూ.79 మించి విక్రయించకూడదు. ప్రభుత్వం నిర్ణయించిన ఈ ధరల పట్టికను ప్రతి దుకాణంలోనూ వినియోగదారులకు కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



ఇటీవల మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం కిలో రూ.75 నుంచి రూ.95 వరకు విక్రయిస్తున్న నేపథ్యంలో, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు.

ఎన్నికల ప్రతి దశలోనూ అత్యంత అప్రమత్తం

- **పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**
- **రిసెప్షన్ సెంటర్లో పాటు కౌంటింగ్ హాల్లో ఏర్పాట్ల తనిఖీ**

విజయవాడ,నవంబర్,1,(మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలోని ప్రతి దశలోనూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని.. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లతో పటిష్ట సమన్వయంతో పనిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఆదివారం విజయవాడ నగరపాలక సంస్థతో పాటు కొండపల్లి, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మున్సిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, పోలింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా పోలింగ్ అనంతరం కీలకపాత్ర పోషించే రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ, భద్రపరిచే విధానం, స్ట్రాంగ్ రూమ్ల భద్రత, ఓట్ల లెక్కింపు కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అవసరమైన మౌలిక ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని, పోలింగ్ అనంతర ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

తెలంగాణలో ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాల్సిందే


వీరిపై జనగణనకు ముందే ఓ నిర్ణయం తీసుకోండి

సీఎం రేవంత్‌కు మాజీ ఎంపీ కవిత బహిరంగ లేఖ



హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి : రాష్ట్రంలో ఓబీసీల కులగణన, ఆదివాసీల మతాన్ని జనగణనలో ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరుతూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాబోయే డిసెంబరు మాసంలో ఇంటింటి జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో అసెంబ్లీ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓబీసీల జనాభాను ప్రత్యేకంగా లెక్కించడం, ఆదివాసీల ప్రత్యేక మత, సాంస్కృతిక గుర్తింపును జనగణనలో ప్రతిబింబించడం సామాజిక న్యాయానికి కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ రెండు అంశాలపై అసెంబ్లీ, శాసనమండలిలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఓబీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రయోజనాలు అందడం లేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల జనాభా ఎంత ఉందన్న అంశంపై కచ్చితమైన, సమగ్ర చట్టబద్ధ గణాంకాలు లేకపోవడం వల్ల విధానాల రూపకల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, ఇతర అవకాశాల్లో న్యాయమైన వాటా కల్పించాలంటే ముందుగా జనాభా వివరాలు స్పష్టంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఓబీసీల ఆందోళనను అన్ని రాజకీయ పార్టీలు పరిగణనలోకి తీసుకుని వారికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రస్తుతం జనగణనలో కుల వివరాలను నమోదు చేసే అంశం ఉన్నప్పటికీ, ఓబీసీలను ప్రత్యేకంగా గుర్తించి వారి జనాభాను నమోదు చేసేందుకు తగిన ఏర్పాట్లు లేవని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఓబీసీ వర్గాలకు చెందిన ప్రజల జనాభా వివరాలు సమగ్రంగా ప్రతిబింబించకపోవచ్చని పేర్కొన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల జనాభాను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నట్లుగానే ఓబీసీల జనాభాను కూడా స్పష్టంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించి, శాసనమండలిలోనూ చర్చించి తీర్మానం చేయాలని సూచించారు. అనంతరం ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపి, జనగణనలో అవసరమైన మార్పులు తీసుకొచ్చేలా ప్రయత్నించాలని కోరారు.



ఆదివాసీల ప్రత్యేక జీవన విధానం, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన ఆచారాలకు జనగణనలో తగిన గుర్తింపు కల్పించాలని కవిత మరో కీలక డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన జనగణనల్లో ఆదివాసీల మత విశ్వాసాలను ప్రత్యేకంగా నమోదు చేసే అవకాశం ఉండేదని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత జనగణనలో ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేసే అవకాశం లేకుండా చేశారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి, ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దేశ మూలవాసులైన ఆదివాసీల జీవన విధానం ప్రత్యేకమైనదని కవిత వివరించారు. ప్రకృతిని, అడవులను తమ ఆరాధనా సంప్రదాయాల్లో భాగంగా భావించడం వారి సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. అలాంటి ప్రత్యేక మత విశ్వాసాలు, సాంస్కృతిక గుర్తింపులు జనగణనలో ప్రతిబింబించేలా ప్రత్యేక నమోదు విధానం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరుతూ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ముఖ్యమంత్రిని కోరారు.

బొటానికల్ గార్డెన్లో అటవీ అభివృద్ధి సంస్థ ప్రత్యేక కార్యక్రమాలు

- **రాత్రి వేళల్లో వన్యప్రాణుల పరిశీలన..**
- **తెల్లవారుజామున పక్షుల సందడి**

హైదరాబాద్, నవంబర్ 01(మనం బ్యూరో): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర పరిధిలోనే ప్రకృతిని విభిన్న సమయాల్లో పరిశీలించే అవకాశాన్ని కల్పిస్తూ తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలోని పర్యావరణ పర్యాటక విభాగం 'డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్' హైదరాబాద్లోని బొటానికల్ గార్డెన్లో వారాంతంలో రెండు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. అక్టోబర్ 31న రాత్రి నాక్టర్నల్ వాక్, నవంబర్ 1న తెల్లవారుజామున బర్డ్ వాక్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా పగటిపూట సాధారణంగా కనిపించే ప్రకృతి పరిసరాలను రాత్రి, ఉదయం వేళల్లో పరిశీలించే అవకాశం కల్పించారు. శనివారం రాత్రి నిర్వహించిన నాక్టర్నల్ వాక్‌లో భాగంగా చీకటి పడిన తర్వాత ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులు, రాత్రివేళల్లో సంచరించే జీవుల కదలికలు, వాటి శబ్దాలపై అవగాహన కల్పించారు. సాధారణంగా పగటిపూట మన దృష్టికి రాని ప్రకృతిలోని మరో కోణాన్ని ఈ కార్యక్రమం ద్వారా పరిచయం చేశారు. ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన బర్డ్ వాక్లో బొటానికల్ గార్డెన్లోని పక్షి జాతులను పరిశీలించే అవకాశం కల్పించారు. వివిధ పక్షుల ప్రత్యేకతలు, వాటి ప్రవర్తన, సహజ ఆవాసాల గురించి పాల్గొన్నవారికి వివరించారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్కు చెందిన నేచురలిస్ట్ బృందం మార్గదర్శకత్వం వహించింది. బొటానికల్ గార్డెన్లోని జీవవైవిధ్యం, రాత్రిపూట చురుకుగా ఉండే వన్యప్రాణులు, వివిధ పక్షి జాతుల గురించి వివరించి, ప్రకృతిని నిశితంగా పరిశీలించేలా పాల్గొన్నవారికి అవగాహన కల్పించింది. పకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు, వన్యప్రాణులు, జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని టీజీఎఫ్‌డీసీ పేర్కొంది. నగరాల్లో అందుబాటులో ఉన్న పచ్చని ప్రదేశాలను ప్రకృతి విద్య, పర్యావరణ అవగాహన కార్యక్రమాలకు వేదికలుగా వినియోగించుకునే అవకాశాన్ని కూడా ఈ కార్యక్రమాలు చాటిచెప్పాయి.



రెక్కలు తెగిన పక్షి!

దూరంగా... మైదానాలను ప్రేమిస్తూ
అడవి ఎర్ర సముద్రమయ్యేది
ఆయుధాలు కోల్పోయాక
మనిషి నమ్మకం కాలి బూడిదయింది!

ఇప్పుడు...అడవులే కాదు
విస్తరించిన నగరాలన్నీ చంబల్ లోయలే
మనిషి ఇప్పుడు దిగమింగుతున్న దుఃఖం!

మారిన కాలంలో ప్రజాసేవ అందమైన ముసుగు
విధ్వంసమే దాని పునాది
నేల నేలంతా చింకి చాపై
హిరణ్యాక్షుల చంకల్లో ఒదుగుతున్నది!

అర్థం కాని విషయం ఒక్కటే
ఉన్నప్పుడు పట్టెడన్నం
పోయాక ఆరడుగుల నేల
వేల కోట్ల ఆస్తులు శవాలను తగలెయ్యడానికా?!

విజ్ఞత లేక.. అందరం కలిసి ఉందాం
ఉన్నది ఏదో కలిసే తిందామంటే
కుదరదనే వారి తకరారేమిటో
కుట్ర బయట పెట్టాల్సి ఉంది!

భయాలు ప్రజాస్వామ్యంలో
ప్రజలకే ఎందుకు ఉండాలి
అడుగు తీసి అడుగు వేసే ప్రతిసారి
పాలకుల నెత్తి మీద బాధ్యత
అంకుశమై మెరవాలి!
ఎరుపు లేదు మెరుపు లేదు
అడవి ఇప్పుడు రెక్కలు తెగిన పక్షి
మైదానాలు చొచ్చుకు వస్తున్నా
ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం
గత వైభవ చిహ్నమయిపోయింది!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

తెలుగు బృహత్సంహితలు... సాక్షి వ్యాసాలు



పానుగంటి లక్ష్మీ నరసింహారావు ప్రతిభ అనన్యం. ప్రజ్ఞ బహుముఖీనం, నాటకకర్తగా, వ్యాసరచయితగా ఆయన పేరు సుస్థిరం. ప్రక్రియ ఏదైనా ఆయన రచనలకు హాస్యం ఆలంబనం. పదాలు గుప్పించడంలోను, ఒకమాటకు పది మాటలు వాడి వ్యంగ్యాన్ని, వర్ణనను, హాస్యాన్ని రంగరించడంలోను ఆయనకు ఆయనే సాటి. సాక్షి వ్యాసాల శైలి వరద గోదావరిలాగా ఝరీవేగంతో పరుగులెత్తేది. కొందరు ఆయనను 'ఆంధ్ర అడిసన్' అంటారు. మరికొందరు ఆయనను 'ఆంధ్ర షేక్స్పియర్' అంటారు. గ్రాంథిక భాషలో సామాజిక రుగ్మతలను ఎండగడుతూ ఆయన రాసిన సాక్షి వ్యాసాలు తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఆయన రాసిన నాటకాలు కూడా ఆనాటి సాహితీ అభిమానుల ఆదరణను పొందాయి. 'పాను గంటి సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి.. ఎంచేతనంటే వాటిలో పేను లాంటి భావానికాయన ఏనుగంటి రూపాన్నియ్యడం నేనుగంటి' అని శ్రీశ్రీ కొనియాడిన మేటి సాహితీ శిఖరం పానుగంటి.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు నవంబరు 2, 1865వ తేదీన రాజమహేంద్రవరం తాలూకా సీతానగరంలో రత్నమాంబ, వెంకట రమణయ్య దంపతులకు జన్మించారు.1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటర్, 1888లో బి.ఎ. పరీక్షలలో ఉత్తీర్ణులైన తరువాత పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఉపాధాయయ వృత్తి ఆరంభం నుండే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుడిగా తన సంపాదన చాలక పోవడంతో తొలుత లక్ష్మీనరసాపురం సంస్థానంలో దివానుగా చేరారు. ఆ తర్వాత ఉర్లాం, అనెగొంది, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో కూడా పనిచేశారు. లక్ష్మీ పురం జమిందారిణి రావు చెల్లయమ్మ గారి దివానుగా చేరారు. ఆరు సంవత్సరాల తర్వాత అభిప్రాయ భేదాల మూలంగా ఉద్యోగం మానేశారు. తరువాత ఉర్లాము సంస్థానంలోను, బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలోను దివానుగా కొంత కాలం పనిచేశారు. పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహదూరు పానుగంటి రచనల గురించి వినగా, రాజాకు మైనారిటీ తీరగా రాజ్యాధికారం చేపట్టిన తర్వాత పంతులు గారిని 1915-16 మధ్య 'నాటక కవి'గా తమ ఆస్థానంలో నియమించారు. ఆయన కోరికపై అనేక నాటకాలు వ్రాసారు. వాటన్నింటిని మహా రాజే అచ్చు వేయించారు. పానుగంటి వారి రచనలల్లో ప్రముఖ మైనవి సాక్షి వ్యాసాలు సువర్ణముఖి, ఆంధ్రపత్రికలలో 1913 నుండి 1933 మధ్యకాలంలో ప్రచురించ బడ్డాయి. వ్యాసాలన్నీ అచ్చమైన గ్రాంథిక భాషలో ఉన్నా, వ్యవహారానికి దగ్గరగా ఉండే శైలితో రాయడం రచయిత ప్రత్యేకత. వ్యంగాత్మకంగా సామాజిక రుగ్మతలను ఎండ గట్టడం ఈ వ్యాసాల ప్రధాన ఉద్దేశం. 1711 - 12 లో స్పెక్టేటర్ అనే ఆంగ్ల పత్రికలో జోసెఫ్ అడ్డిసన్, రిచర్డ్ స్టీల్ వ్రాసిన స్పెక్టేటర్ పేపర్స్ వ్యాసాలతో ప్రేరణ పొందిన పాను గంటి ఈ వ్యాసాలను రాశారంటారు. ఈ వ్యాసాలలో కాలా చార్యుడు, జంఘాలశాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి అనే పాత్రల ద్వారా సామాజిక విషయాలపై చర్చలను పెడతారు రచయిత. వారి సంభాషణల ద్వారా పాఠకుడికి అందాల్సిన సందేశాన్ని అందిస్తారు. 'సాక్షి వ్యాసాలు' పుస్తకంగా వచ్చాక, అనతికాలం లోనే పానుగంటి వారి పేరు ఆంధ్రదేశంలో మారు మ్రోగి పోయింది. ఆ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి. సాక్షి వ్యాసాల రాసిన తర్వాత పిఠాపురం జమీందరు ప్రేరణతో ఇంకా అనేక రచనలు చేశారు పానుగంటి. సారంగ ధర చరిత్ర, వృద్ధవివాహము, రాధాకృష్ణ, నర్మదా పురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణ రాఘవము, కంఠా భరణము, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర, బుద్ధ బోధసుధ, వీరమతి, పూర్ణిమ అందులో ప్రముఖమైనవి. ఆయన రాసిన నాటకాలే పానుగంటి వారి అభినవ కాళిదాసు బిరుదును పొందేలా చేశాయి. తన రచనల వలన తొలినాళ్లలో ఆయన విశేషంగా ధనమార్జించినా, అవసాన దశలో పేదరికానికి, ఋణ బాధకు గురవడం గమనార్హం. సంస్థానం అందించే గౌరవ వేతనంపైనే ఆయన ఆధారపడాల్సి వచ్చింది. 'నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును' అని తన చివరిదశలో ఆ మహా రచయిత వాపోయాడంటేనే అతని పరిస్థితి అప్పుడు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత అనారోగ్యం కూడా అతన్ని బాగా కుంగదీసింది. తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేసిన సాక్షి వ్యాసాలను ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం అంతా యింతా కాదు. 'జంఘాలశాసి' అనే పాత్ర ముఖతః పానుగంటి వారు సమకాలిక సాంఘిక దురాచారాల మీద, మూఢ విశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు అని నండూరి రామమోహనరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృదుమధురనవార్ధభాసుర వచన రచనా విశారదులైన మహాకవి ఆధునిక కాలమున ఎవరు అని ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము 'పానుగంటి లక్ష్మీనరసింహా రావు'గారని నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్యప్రేమికులుండరని, నాటకములలో కన్యాశుల్కము ఎట్టిదో గద్య రచనములలో సాక్షి అటువంటిదని మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహితీ లోకాన్ని విడిచి తిరిగి రాని లోకాలకు పానుగంటి వారు వెళ్లినా, సాక్షి వ్యాసాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా ఉండి పోయాయి. ఇప్పటికీ తెలుగు విద్యార్థుల పాఠ్యాంశాలలో ఈ వ్యాసాలను ప్రచురించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమే. సుమారు ఇరవై సంవత్సరాలు ఆయన జీవితం సుఖంగా జరిగింది. ఆ రోజుల్లో దివాణం తరువాత వ్యయానికి వీరి గృహమే అనేవారు. ఆధునిక శ్రీనాధునిగా జీవించారు. ఉద్యోగాల వలన, రచనల వలన విశేషంగా డబ్బు గడించినా దానిని నిలువ చేయడంలో శ్రద్ధ కనపరచ లేదు. ఆధునిక శ్రీనాధుని వలెనే అనుభవించి నన్నాళ్ళూ బాగా అనుభవించి, తుది రోజులలో పేదరికానికి ఋణ బాధకు లోనయ్యారు. మహారాజా వారు బాగా పోషించినా, పంతులుగారికి తుదిదశలో వైషమ్యాలేర్పడి, తమదగ్గర ఏనాడో చేసిన ఋణం కొరకు వారికి ఇచ్చే నూట పదహారు రూపాయల గౌరవ వేతనంలో కొంతభాగం తగ్గించ డానికి ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధాప్యంలో ఆయన అటు ఇటు తిరిగి సంపాదించ లేకపోయారు. చేతికి అందివచ్చిన కుమారులు ఉన్నా వారిని ఉద్యోగాలకు పంపలేక పోయారు. పానుగంటి కవి శేఖరుని దుస్థితి గురించి ఆయన వ్రాసిన లేఖను ఆంధ్రపత్రికలో యర్రవల్లి లక్ష్మీనారాయణ ప్రచురించాడు. 'నాకెవరును దాన, దర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును'. 1933 నుండి శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యం చెడి పోయింది. 1935 లో పిఠాపురంలో ఉత్సవాలు నిర్వహించి పురజనులు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. తెలుగు సాహిత్యానికి అనేక అమూల్యాభరణాలు అందించిన నరసింహా రావును పాఠక లోకం 'కవిశేఖరుడ'నీ, 'అభినవ కాళి దాసు' అనీ బిరుదులతో అభినందించింది.

నవంబర్ 2.. పానుగంటి జయంతి

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

మేధోనిలయం నలంద





దమ్మ యాత్ర .. 8



రాజ్‌గిర్ నుంచి బుద్ధుడి ప్రయాణాన్ని క్రమ బద్ధీకరించడం సాధ్యం కాదు. ఎందుకంటే ఆయన తన బోధనలు చేస్తూ పలు చోట్లకు పలుమార్లు సంచరిస్తూ వెళ్ళాడు. ఆ విధంగా నలందాకు కూడా చాలాసార్లు వెళ్ళాడు. రాజ్‌గిర్ నుంచి నలంద పదిహేను కిలోమీటర్ల దూరం. అది ప్రపంచంలోనే మొట్టమొదటి రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయం. బుద్ధుడి కాలంలో ఇది ఒక చిన్న పల్లెటూరు మాత్రమే. బుద్ధుడు రాజ్‌గిర్‌లో చాలా కాలం ఉన్నప్పుడు అనేకసార్లు నలందాకు వచ్చి వెళ్ళేవాడు. అప్పుడే అది ఆయనకు ఇష్టమైన విహార స్థలం.

బుద్ధుడు నిర్వాణం పొందిన దాదాపు ఏడు వందల యేళ్ళ తర్వాత నలందా విశ్వవిద్యాలయం స్థాపించ బడింది. అంటే నలందా చరిత్ర క్రీ.శ 5,6 శతాబ్దాల నాటిది. అది దట్టమైన మామిడి తోటలనీడలో,నీలి,ముదురు ఎరుపురంగు తామర కొలనులతో ప్రశాంతమైన వాతావర ణంలో ఉండేది. పండితులు, సన్యాసులు మేధోపరమైన అన్వేషణ,చర్చలు చేయడానికి అనువైన ప్రదేశం అది. ప్రస్తుతం ఇరవై మూడు ఎకరాలలోనే ఉంది. కానీ ఈ విశ్వవిద్యాలయం ప్రాచీన కాలంలో చాలా పెద్దది. దీనిని కుమార గుప్తుడు స్థాపించాడు. (క్రీ.శ 413-455) మహారాజు హర్ష వర్ధనుడు (క్రీ శ 606-647), తూర్పు భారత దేశపు పాల వంశపు రాజులు (క్రీ.శ 8-12 శతాబ్దం) ఈ విద్యాకేంద్రానికి తమ పోషణను కొనసాగించారు. సుమారు పన్నెండో శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ దండయాత్రలో ఇది భారీగా నష్టపోయింది. చక్కని దారులతో, అంద మైన ప్రవేశ ద్వారాలతో సందర్శకులకు స్వాగతం పలికేది. క్యాంపస్‌లో అనేక సమాంతర దీర్ఘ చతు రస్ర భవనాలు ఉండేవి. వాటిలో అనేక చైత్యాలు, స్తూపాలు, విహారాలు ఉండేవి.

అక్కడ నివసించే వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు సుల భంగా తిరగడానికి వీలుగా భవనాల మెట్లు పెద్దగా ఉండేవి.నాగార్జునుడు, ఆర్యదేవుడు, వసుబంధు, ధర్మపాలుడు మొదలైన వాళ్ళు ఆచార్యులుగా ఉన్నారు. భారతీయ విద్యార్థులతో పాటు విదేశీ విద్యార్థులు కూడా ఇక్కడ చదువుకునే వారు. వారిలో ప్రఖ్యాత చైనా యాత్రికుడు యువాన్ త్సాంగ్ ఒకరు. ఆయన తన యాత్రా కథనాలలో నలందా విశ్వవిద్యాలయాన్ని చాలా గొప్పగా వర్ణించాడు. ఇక్కడ వేదాంతం, వ్యాకరణం, తర్కం, ఖగోళ శాస్త్రం, మెటా ఫిజిక్స్, వైద్యం వంటి విషయాలతోపాటు బౌద్ధ ధర్మ శాస్త్రాన్ని బోధించే వారు. ఈ రకంగా ప్రపంచంలోనే గొప్ప విద్యా కేంద్రంగా ఉండేది. భారతదేశ సాంస్కృతిక, మేధో వారసత్వానికి నిదర్శనంగా ఇప్పటికీ నిలబడి ఉంది. ఇక్కడ సజనాత్మకత, ఆధ్యాత్మికత, జ్ఞానం కలిసి వర్ధిల్లాయి.

1915-37, 1974-82లలో భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) జరిపిన తవ్వకాలలో ఒక చదరపు కిలోమీటరు కంటే ఎక్కువ విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఆరు ఎర్ర రాతి ఇటుక దేవాలయాలు, పదకొండు మఠాల అవశేషాలను విస్తృతంగా బయటపడ్డాయి. అక్కడున్న మ్యాప్ చూస్తే, ఆ రోజుల్లోనే యూనివర్సిటీని ఎంత పద్ధతిగా ప్లాన్ చేసారో అర్థమవుతుంది. దాదాపు ముప్పై మీటర్ల వెడల్పు దారి ఉత్తర, దక్షిణ దిశలలో సాగుతుంది. దానికి పశ్చిమ దిశలో ప్రార్థన చేసే దేవాలయాల వరుస, తూర్పుదిశలో విద్యార్థులు ఉండే హాస్టల్స్ (మఠాలు) ఉన్నాయి. సైట్ నెంబర్ 6,8,9లలో వంటకోసం , లోహ విగ్రహాలు తయారు చేయడం కోసం కొలిమిలు, ఓవన్ల లాంటివి ఉన్నాయి. దీనిని బట్టి ఆరోజుల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ క్లాసులు కూడా జరిగేవని తెలుస్తోంది. మఠాల లోపల గదుల పరిమాణం, అమరిక దాదాపు అన్నీ ఒకేలాగా ఉన్నాయి. ఎర్రరాతి ఇటుక శిథిలాలు. వీటిలో అత్యంత అందమైన నిర్మాణం సారి పుత్రుడి స్తూపం. ఇతడు బుద్ధుడి ముఖ్య శిష్యుడు. నలందాలోనే పుట్టి, పెరిగి, నిర్వాణం పొందాడు.అందుకే ఆయన గౌరవార్థం నలందాలో మొదటి మఠం కట్టారని చరిత్ర కారులు చెపుతారు. అక్కడున్న శిథిలాల్లో టెంపుల్ నెంబర్ మూడు సారిపుత్రుని స్తూపం. నలందాలో ఉన్న పెద్ద స్తూపం ఇదే.

అక్కడున్న పురావస్తు శాఖవారు ఏర్పాటు చేసిన బోర్డులోని సమాచారం ప్రకారం.. దీని ఎత్తు వంద అడుగులు. నిర్మాణం ఏడు దశలలో జరిగింది. ప్రతిసారి పాతదానిని కప్పేస్తూ కొత్త పొరలాగా పెద్దది చేస్తూ పోయారు. అందుకే దీనిని " Seven successive accumulations "అని అంటారు. మొదటి నాలుగుదశలు చిన్నవి. మట్టిలో కూరుకుపోయాయి. ఇప్పుడు కనిపించేవి 5,6,7 దశల నిర్మాణం. ఉత్తరం వైపున్న మూడు వేరు వేరు మెట్లు ఈ మూడు దశలకు చెందినవే.. క్రీ.శ ఆరో శతాబ్దంలో గుప్తులు నిర్మించిన దశ అత్యంత ముఖ్యమైంది. బయటి గోడల గూళ్ళలో బుద్ధుడు, బోధిసత్వుల అందమైన విగ్రహాలున్నాయి. అవి గుప్తకళకు ఉదాహరణ. నాలుగు మూలల్లో శిల్పకళతో కూడిన అందమైన టవర్లు ఉండేవి. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి.

నలందాలోని మిగిలిన దేవాలయాలన్ని తూర్పుముఖంగా ఉంటే, ఇది ఒక్కటే ఉత్తర ముఖంగా ఉంది. పైన గర్భగుడిలో ఒకప్పుడు బుద్ధుడి భారీ విగ్రహం ఉండేది. ఇప్పుడు లేదు. పీఠం మాత్రమే ఉంది. చుట్టూ వందలాది మొక్కు బడి స్తూపాలు భక్తులు కట్టారు. వాటిలో కొన్నిటిపై బౌద్ధ ధర్మసూత్రాలు చెక్కబడి ఉన్నాయి.

ఒకటోనెంబర్ మఠంలో రాతి, లోహ విగ్రహాలు, శాసనాలు, మట్టి పూసలు మొదలైనవి ఎక్కువగా దొరికాయి. దీని నిర్మాణం తొమ్మిది దశలలో జరిగింది. దీనిని పాలవంశపు మూడో రాజైన దేవపాలుని పాలన లో (క్రీ శ 810 - 850) సుమిత్రా రాజు నిర్మించాడని శాసనాల వల్ల తెలుస్తోంది. దాని పునర్నిర్మాణం నలందా క్షీణదశ వరకు కొనసాగింది. ఇందులో అనేక గదులున్నాయి. వాటిలో కొన్నింటిలో సన్యాసుల కోసం పడక వేదికలున్నాయి. కొన్ని గదులలో పుస్తకాలు ఉంచేవారు, మరి కొన్ని గదులలో విలువైన వస్తువులు ఉంచేవారు. నలందా అగ్నిప్రమాదంలో ధ్వంసమైన సాక్ష్యాలు ఆ గదులలో ఇప్పటికీ ఉన్నాయి. ఏ మఠంలోకి పర్యాటకులు వెళ్ళడానికి అనుమతి లేదు. బయటినుంచే చూడాలి. అక్కడ భారత ప్రభుత్వ సర్వే (ఏఎస్ఐ) వాళ్ళు ఏర్పాటు చేసిన బోర్డులలోని సమాచారం మేరకు ఈ వివరాలు ప్రస్తావించాను.

ప్రస్తుతం ఉన్న ప్రాచీన నలందా విశ్వ విద్యాలయం ప్రాంగణం అంతా తిరిగి చూడడానికి నాకు దాదాపు రెండు గంటలు పట్టింది. అక్కడ తిరుగుతుంటే ఆ విశ్వవిద్యాలయంలో నేను కూడా ఎప్పుడో ఒకప్పుడు అక్కడ చదువుకొని ఉండి ఉంటాననే ఆలోచన నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఎర్రరాతి శిథిలాలతో, పచ్చని చెట్లతో, చిరు జల్లులతో వాతావరణం అంతా ప్రశాంతంగా ఉంది. బయటకు రాగానే ఎదురుగుండా మ్యూజియం ఉందని తెలిసి, నేను ఒక్కదానినే వెళ్ళాను. భారత పురావస్తు సర్వే (అఖిఐ) జరిపిన తవ్వకాలలో లభించిన ఆనాటి విగ్రహాలు, రాగి పలకలు, రాతి, ఇటుక, శాసనాలు, మట్టికుండలు మొదలైన వాటిని అక్కడ భద్రపరిచారు. పది నిమిషాల నిడివి గల సినిమా కూడా ప్రదర్శిస్తారని తెలిసింది. కానీ నేను ఒక్కదానినే వెళ్ళడం వల్ల ఆసక్తి ఉన్నాకూడా సనిమా చూడలేదు. అక్కడికి దగ్గరలోనే రెండో నంబర్ స్తూపం ఉందని మ్యూజియంలో నాకు తెలిసింది. కానీ సమయాభావం వల్ల మేం అక్కడికి కూడా వెళ్ళలేకపోయాం.

- గిరిజ పైడిమర్రి
9949443414

' కూలని కంచెలు'

నెత్తి మీద టోపీతో నొసలు మీది బొట్టుతో
హిందూ , ముస్లింలుగా కనపడ్డ ఇద్దరిని
నెత్తిన టోపీ, నొసలు మీది బొట్టు తీసేసి
ఫోటువా తీత్తే ఇద్దరూ మనుషులుగనే వచ్చిండ్లు
మతమేది రాలే అండ్ల
సచ్చిపోయిన
మా సారయ్య తాత బొందను
సాయబ్ తాత కబర్ తవ్వి సూశిన
భూమిలో ఇద్దరి బొక్కలు మాత్రమే మిగిలినవి
మతమేది కనపల్లే వాళ్ళ సమాధులల్ల
ఎద్దు తునకల కోసం
మా తాత దగ్గరికి వచ్చి
ఇద్దరు కాయిసుగా కాల్చుకుతున్న
కమ్మటి వాసన జ్ఞాపకం
గుండె గది నిండా పరుసుకుంది
ఆటలాడేటప్పుడు
'అన్నా అన్నా' అంటూ
మా ఎనకాలే తిరిగేటి అన్ను గాడు
పని మీద ఊరికి పోతే
' తమ్ముడా ' అని ప్రేమగా పిలిసి
ఇంటికి పట్టుకపోయి బువ్వ పెట్టిన అన్వర్ అన్న
పాషా, రమ్యు, ఇస్మాయిల్ గాడు
అందరం గూడి గోళీలాట ఆడింది
భూలచ్చిమి కాడి చింత చెట్టుకిందే!
బడికి పోతే ముద్దుగున్నానని
ఒళ్లే కూసోబెట్టుకుని పాఠం
చెప్పిన షాజియా టీచర్
రోగమచ్చిందని దవాఖానకు పోతే
మందుగోలిలిచ్చి ప్రేమగా
నెత్తిదువ్వే పాషా డాక్టర్
బాబీ రవ్వన్న మా తోడబుట్టిన అన్నలెక్కంటూ
ఇంట్ల మనిషిలెక్కనే కలేతిరిగిన
బబ్బులు , పాషా బాబాయిలు
బాపు, చాచా, భాయ్ , సాలె ,
అమ్మి, దీదీ, అంటూ
ప్రేమగా పిలుసుకున్న మనుషులనే
ఇప్పుడు ప్రమాదకారులుగా
ఎందుకు చూపెడుతున్నారు?!
గండ శిలలతో పేర్చిన గోడలనైనా
పారో పలుగో వాడి పెకిలించవచ్చు
కాదంటే మందుపాతర పెట్టి పేల్చనూవచ్చు
కానీ...కనపడని ఈ కంచెలను కూల్చే
మందేదో కానత్తలేదు...!!

- దిలీప్.వి

సాహితీ జగత్తులో బలంగా యువత ముద్ర



యువ కలలకు కొత్త రెక్కలు వస్తున్నాయి. సాహితీ ప్రయాణానికి కొత్త దారులు తెరుచుకుంటున్నాయి. సాహిత్యం సమాజానికి దిక్సూచి. యువతరం ఆలోచనలకు అక్షరరూపమిచ్చి, భావవ్యక్తీకరణకు వేదిక కల్పించి, సామాజిక చైతన్యానికి బాటలు వేయాలనే లక్ష్యంతో నిర్వహించిన తెలంగాణ సాహితి రాష్ట్రస్థాయి యూత్ లిటరరీ ఫెస్ట్ యువ సాహితీ ప్రపంచంలో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. అక్టోబర్ 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు నాగార్జునసాగర్‌లో బుద్ధవనంలో జరిగిన ఈ సాహిత్య సంబరం యువ రచయితల సృజనశక్తికి అద్దం పట్టింది.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 120 మంది యువ రచయితలు ఈ వేడుకలో పాల్గొన్నారు.భిన్న ప్రాంతాలు, భిన్నఅనుభవాలు, ప్రత్యేకమైన ఆలోచనలు ఉన్న యువ కలాలు ఒకే వేదికపై కలుసుకోవడం సాహిత్య ఐక్యతకు చిహ్నంగా నిలిచింది. పరస్పర పరిచయాలు, సాహిత్య చర్చలు, భావాల పంచు కోవడం ద్వారా యువ రచయితల మధ్య సృజనాత్మక స్నేహం పెరిగిందని చెప్పుకోవాలి.

నేటి సమాజంలో యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, మారుతున్న జీవన విలువలు, సామాజిక అసమానతలు, మానవ సంబంధాల సంక్లిష్టతలు సాహిత్యానికి ముఖ్యమైన ఇతివృత్తాలు. వీటిని యువ రచయితలు తమదైన దృష్టితో అక్షరాలుగా మార్చాల్సిన అవసరం ఈ సాహితీ వేదిక స్పష్టంగా తెలిపింది. రచన అనేది కేవలం భావాలను చెప్పడం మాత్రమే కాదు. సమాజాన్ని గమనించడం, మనిషి అంతరంగాన్ని తెలియజేయడం, అన్యాయాలను ప్రశ్నించడం, మార్పు కోసం ఆలోచనలకు ఊతమివ్వడం కూడా అని ఈ కార్యక్రమం గుర్తుచేసింది. యువ రచయితల్లో దాగిన సృజనాత్మకతను బయటపెట్టడం, వారి రచనా నైపుణ్యాలను మెరుగుపర్చడం, సాహిత్యంపై వారికి ఎక్కువ బాధ్యతతో కూడిన అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలకు ఈ ఫెస్ట్ సహాయపడింది.

ఈ సాహిత్య వేడుకలో నాగార్జునసాగర్ జల విహారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాగర్ కొండపైకి స్టీమర్‌లో ప్రయాణిస్తూ నిర్వహించిన యువ కవుల సమ్మేళనం ప్రకృతి సౌందర్యానికి కవిత్వ పరిమళాన్ని కలిపింది. ఒకవైపు సాగర్ జలరాశి ఉంది. మరోవైపు కొండల అందాలు కనిపించాయి. వాటి మధ్య యువ కవుల కవితా గళాలు వినిపించాయి. ఆ వాతావరణం మొత్తం అక్షరాల పండుగను గుర్తు చేసింది.సమ్మేళన ప్రాంతం ప్రసిద్ధ పర్యాటక కేంద్రం కావటంతో ప్రకృతి దృశ్యాలతో యువ రచయితలు మమేకమై



ఫోటోలు దిగటం సాహిత్య కార్యక్రమానికి కొత్త ఉత్సాహం ఇచ్చింది. సాహిత్యం పుస్తకాల పుటల్లో మాత్రమే కాదు, ప్రకృతిలో కూడా బతుకుతుందని ఈ కవిసమ్మేళనం చూపింది.ప్రతీ అక్షరం సామాన్యుడి పక్షం వహించింది. ఆ ప్రయాణం యువ కవులకు మధురమైన జ్ఞాపకంగా, సృజనకు ప్రేరణగా..సాహితీ పెద్దలకు ఊరటగా మిగిలింది.

తెలంగాణ సాహిత్యానికి పోరాటాల చరిత్ర, ప్రజా ఉద్యమాల నేపథ్యం, సామాజిక స్పృహ చాలా ఉన్నాయి. ఆ వారసత్వాన్ని తీసుకుంటూనే, సమకాలీన సమస్యలను కొత్తకోణాల్లో చూపించాల్సిన బాధ్యత నేటి యువ రచయితలపై ఉంది. కాలంతో పాటు మారుతున్న సాహిత్య ప్రక్రియలను అర్థం చేసుకుంటూ, కొత్త భావ ప్రకటన మార్గాలను వెతుకుతూ, మానవీయ విలువలను తమ రచనల్లో చూపించాల్సిన అవసరం ఉందని భావించింది.

యువతరం కలం కేవలం సౌందర్యాన్ని వర్ణించడానికే కాక సమాజంలోని చీకటి కోణాలను వెలుగులోకి తీసుకురావాలి. అణగారిన గొంతులకు అక్షరబలాన్ని ఇవ్వాలి. మానవత్వాన్ని నిలబెట్టాలి. ప్రశ్నించే తత్వాన్ని పెంచాలి. ఇలాంటి సృజనాత్మక బాధ్యతల వైపు యువ రచయితలను ప్రోత్సహించడంలో యూత్ లిటరరీ ఫెస్ట్ వంటి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని, యువ రచయితలు సైతం సామాన్యుడి బతుకు మెతుకును స్పృశించటం అభినందనీయమని ఫెస్ట్ పరిశీలకులగా వ్యవహరించిన పెద్దలుద్ఘాటించారు.

నాగార్జునసాగర్ బుద్ధవనం వేదికగా రెండు రోజులపాటు జరిగిన ఈ సాహితీ సంబరం యువ రచయితలకు పరిచయాల వేదికగా మాత్రమే కాకుండా, ఆలోచనలను విస్తరించేందుకు, సృజనాత్మక అనుభవాలను మార్పిడి చేసుకు నేందుకు, భవిష్యత్ సాహిత్య ప్రయాణానికి ప్రేరణగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువ ప్రతిభలను ఒకచోట కలిపి, వారి ప్రతిభకు గుర్తింపు ఇవ్వాలని తెలంగాణ సాహితి చేసిన ఈ ప్రయత్నం ప్రశంసనీయంగా నిలిచింది. కొత్త రచయితలకు అవకాశాలు పెరగాలి. వారి రచనలకు ప్రోత్సాహం కలగాలి. ఇది సమాజ మార్పుకు సహాయపడాలని అభిలషించారు. ఆ బాటలోనే తెలంగాణ సాహితీ అడుగులు వేస్తుందని నిర్వాహకులు హామీ ఇచ్చారు. ఈ సాహిత్య సంరంభం లో సాహితీ పెద్దలు బెల్లి యాదయ్య, కె.ఆనందాచారి, పరిశీలకులు ఆర్.సీతారాం, బీవీఎస్.స్వామీ, సలీమా, గోవర్ధన్, శ్రీరాములు, తగుళ్ళ గోపాల్, మోహన కృష్ణ ప్రసంగించగా...వివిధ సెషన్స్‌గా సాగిన సాహిత్య సభలకు అధ్యక్షులుగా యువ రచయితలు ప్రవీణ్‌రెడ్డి, పేర్లరాము, సాయివంశీ,సయ్యద్ ముజాహిద్ అలీ, హాథీ రామ్,బండారు శంకర్, వేణు మూల సమన్వయంగా తేజ,మహేష్, సాయికిరణ్, మల్లెల రాము ఉన్నారు.ఈ కార్యక్రమంలో ప్రారంభ సభతో పాటు కవితా కేఫ్.. చర్చ, కథా వైబ్స్.. చర్చ, పాటల హోరు, కవిసమయం నాలుగు సెషన్స్‌గా సాగింది. గాయకులు వేముల ఆనంద్ ఆధ్వర్యంలో పాటల హోరు సెషన్ యువతలో ఒక ఊపు తెచ్చింది. సభను పంచుకున్న యువరచయితలకు సంస్థ దశాబ్ది సంచికను అందించింది. సభలో జరిగిన శ్రీశ్రీ మార్గం కవితా సంపుటి ఆవిష్కరణలో సంస్థ బాధ్యులు కటుకోర్ఝుల రమేష్, తాతోలు దుర్గాచారి పాల్గొన్నారు.

మొత్తంగా, తెలంగాణ సాహితి యూత్ లిటరరీ ఫెస్ట్ యువ కలలకు రెక్కలు తీసుకొచ్చిన సృజనోత్సవం. సాగర్ అలల సాక్షిగా కవిత్వం పరవళ్లు తొక్కింది. బుద్ధవనం వేదికగా భావాల వెల్లువ సాగింది. యువతరం అక్షరాల్లో భవిష్యత్తు సాహిత్యపు కొత్త వెలుగులు కనిపించాయి. ఈ వేడుక చాటిన సందేశం ఒక్కటే. యువత కలం బలపడితేనే సాహిత్యం కొత్త దారిలోకి వెళ్తుంది. సాహిత్యం సమాజంతో కలిసిపోతేనే చైతన్యానికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి.

-డా.కటుకోర్ఝుల రమేష్
9949083327

తుఫాన్ నష్టాలపై కేంద్రానికి నివేదిక సమర్పిస్తాం

- జిల్లాలో విస్తృతంగా పర్యటించిన కేంద్ర బృందం
- తుఫాన్ నష్టాన్ని పరిశీలించిన బృంద సభ్యులు



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ, ఆక్వా, విద్యుత్, ఉద్యాన పంటలు ను ఆదివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, కేంద్ర బృందం, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించి, రైతలతో మాట్లాడారు. పంట నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయడంతో పాటు, ఉపగ్రహ చిత్రాలు, రిమోట్ సెన్సింగ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నట్లు బృందం తెలిపింది. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లాలో హైదరాబాద్కు చెందిన రెఖారాణి కొల్లు, జలవనరుల మంత్రిత్వ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్, సిడబ్ల్యూసి తో కలిసి నలుగురు సభ్యులతో అంతర్ మంత్రిత్వ శాఖల సమన్వయ కేంద్ర బృందం ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించింది. కేంద్ర జల సంఘం (సి డబ్ల్యూసి) సూపరింటెండింగ్ ఇంజనీర్, కృష్ణా మరియు కోఆర్డ్ సర్కిల్, కేజీబీవో హైదరాబాద్కు చెందిన రెఖారాణి కొల్లు, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.ఎస్.పి శర్మ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ అలోక్ జవహర్, కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఎస్.కె రాకేష్ కుమార్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. వీరితోపాటు ఏపీ సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి కేంద్ర బృందం వెంట వున్నారు. క్షేత్ర స్థాయి పర్యటన లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వ్యవసాయ, ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి తోటలకు సంభవించిన నష్టాలు, ఆక్వా, తీర ప్రాంత గ్రామాలు, నివాస గృహాలు, మత్స్యకార బోట్లు, విద్యుత్ స్తంభాలు, వైర్ల ధ్వంసం వంటి వివరాలను కేంద్ర ప్రతినిధులకు సమగ్రంగా వివరించారు. ఆచంట నియోజకవర్గం, పెనుగొండ మండలం, వడలి గ్రామంలో ఈదురు గాలులు, భారీ వర్షాలకు నేలకొరిగిన వరిచేలను, ధ్వంసమైన అరటి పంటలను కేంద్ర బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది.

కేంద్ర బృందం ప్రతినిధులు నేరుగా రైతులతో సంభాషించి కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రతినిధులు రైతులతో మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టటం జరిగిందని, కేంద్రానికి వాస్తవాలను నివేదిస్తామన్నారు. పాలకొల్లు పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో తుఫాను ఈదురు గాలులకు విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు పరిశీలించారు. తుఫాను ప్రభావం పై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. విద్యుత్ పునరుద్ధరణకరణకు 2000 మంది సిబ్బంది ఆర్మీ సెలవు నిర్మిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం నుంచి అదనపు సిబ్బంది రప్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కేంద్ర బృందానికి వివరించారు. యలమంచిలో విద్యుత్ సబ్ స్టేషన్ లో విద్యుత్ సామాగ్రి, సిబ్బంది నిర్వహిస్తున్న విద్యుత్ పునరుద్దారీకరణ పనులను కేంద్ర బృందం పరిశీలించింది. యలమంచిలి మండలం, ఆర్య పేట లో తుఫాన్ తాకిడికి విరిగిపడిన రావి చెట్టు మహా వృక్షాన్ని, ధ్వంసమైన భవనాన్ని తనిఖీ చేసి బాధితులు దొంగ శ్రీనివాస్, పిల్లి వెంకటేశ్వరరావు, పద్మ లను కేంద్ర బృందం పరామర్శించింది. పాలకొల్లు - నరసాపురం మార్గంలో రహదారి వెంట తుఫాను తాకిడికి పడివున్న వృక్షాలను స్వయంగా పరిశీలించారు.పాలకొల్లు మండలం, దిగమర్రు గ్రామం, చెంచినాడ రోడ్డు లో దెబ్బతిన్న రొయ్యల చెరువులను, ఏరియేటర్లు, ఫీడ్ షెడ్డు లను పరిశీలించి ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు నరసాపురం సెంటర్ లో ధ్వంసమైన విద్యుత్ టవర్ ను పరిశీలించారు. నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పై విరిగిపడిన వృక్షాన్ని, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. నరసాపురం మండలం, బియ్యపుతిప్ప లో తుఫాను వలన ధ్వంసమైన మత్స్య కారుల బోట్ల ను పరిశీలించి, మత్స్యకారులతో మాట్లాడారు. నరసాపురం మండలం, రామన్నపాలెం లో నీటమునిగిన పంట పొలాలు, కొబ్బరి చెట్లు పరిశీలించి రైతులను పంట నష్టం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొగల్తూరు మండలం, కేపీ పాలెం నార్త్, మెట్రేవ్ గ్రామంలో తుఫాను బాధితుకు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించి, బాధితులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.



తెదేపాను ఆశీర్వదించండి

గుడిబండ, నవంబర్ 1(మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. రాష్ట్ర విద్యాశాఖ ఐటీ శాఖ ల మంత్రి నారా లోకేష్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వంఅభివృద్ధి నీగతంలో ఎన్నడు లేని విధంగా శరవేగంగా చేయడం జరిగిందని. ఈ అభివృద్ధి అన్ని రంగాల్లోనూ మరింత శరవేగంగా జరగాలంటే తెలుగుదేశం. జనసేన. బిజెపి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని తద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని శ్రీ సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు. మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్ రాజు. మాజీ శాసన మండలి సభ్యులు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి లుపేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని శంకర గల్లు .రాళ్లపల్లి .జంబులబండ .కరికెర. కుమ్మర నాగేపల్లి. గుడిబండ. తదితర గ్రామపంచాయతీ కేంద్రాల్లో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ గతంలో వైఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోనివైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలుకేవలం రాజకీయ లబ్ధి కోసం సాధ్యం కానీ హామీలను ప్రజలకు ఇచ్చి ఐదేళ్లలో లక్షలాదిమంది నిరుపేద ప్రజలను మోసం చేసిందని. మళ్లీ ఇప్పుడుస్థానిక సంస్థలఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మరొక్కసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని వారు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు .ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ఐటీ శాఖ . విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి అన్ని వర్గాల ప్రజలకు అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పథకాలు అందించడం జరిగిందని. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలు .అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే కూటమి ప్రభుత్వం బలపరిచినఅభ్యర్థుల కు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తద్వారా భవిష్యత్తులో మరింత అభివృద్ధిని చేసేందుకు కూటమి ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

ఐదు రోజులుగా అంధకారంలో కోనసీమ జిల్లా లోని గ్రామాలు

- తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మళ్లీ తుఫాను ఉందనే సమాచారం తో ఆందోళన లో ప్రజలు
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పై సమాచార లోపం

అమలాపురం నవంబర్ 1 మనం ప్రతినిధి : ఆర్నాబ్ తుఫాన్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రజలకు తీవ్ర నష్టాలను కలగజేసింది. ముఖ్యంగా విద్యుత్ సరఫరా విషయంలో గ్రామస్థాయిలో మారు మూలు ప్రాంతాలకు నేటికీ కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో సాధారణ స్థితులు నెలకొనలేదు. తెలంగాణ రాష్ట్రం నుండి, రాష్ట్రంలోని అనేక జిల్లాల నుండి విద్యుత్ శాఖ అధికారులు, విద్యుత్ పునరుద్ధరణ పనులు చేసే యంత్రాలు సిబ్బంది వచ్చినప్పటికీ తుఫాను వెళ్లి ఐదు రోజులు గడిచిన ఆదివారం సాయంత్రానికి కూడా జిల్లా కేంద్రం అమలాపురం, మండల కేంద్రాల్లో తప్ప గ్రామాలలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. దీనితో కొన్నిచోట్ల విద్యుత్ సబ్స్టేషన్లను ప్రజలు ముట్టడిస్తున్నారు. విద్యుత్ సరఫరా అన్ని గ్రామాలకు ఇచ్చేస్తామని చెబుతున్న మాటలకూ చేస్తున్న పనులకు పొంతన ఉండటం లేదు. రాజకీయ నాయకులు, అధికారులు ఎన్నికల విధులలో ఉండటం తో ప్రజల కష్టాలను పట్టించుకునే నాయకుడే కరువైయ్యారు. ఇతర ప్రాంతాల నుండి సిబ్బంది వచ్చినప్పటికీ వారు పనులు చేయాలంటే స్థానిక లైన్ మెన్ లేదా విద్యుత్ శాఖ అధికారిక సిబ్బంది లేనిదే పనులు చేసే పరిస్థితులు లేకపోవడం కూడా పెద్ద సమస్య గా ఉంది. దీనితో కొన్ని చోట్ల సిబ్బంది పనులు చేసే పరిస్థితులు ఉండటం లేదు. అధికారులు కూడా ప్రతి రోజు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పై ఏ విధమైన సమాచారం విడుదల చేయడం లేదు. ఎంతమంది సిబ్బంది వచ్చారు ఎన్ని మండలాలకు, ఎన్ని గ్రామాలకుఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారనే అంశాలు పై ఎటువంటి సమాచారం కూడా ఇవ్వకపోవడం తో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పై ప్రజలలో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను వేగవంతం చేసి గ్రామీణ మారుమూల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు రాష్ట్రానికి ముంచుకు తుఫాను గండం పొంచి ఉండడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

ప్రజాస్వామ్యానికి ఆదర్శంగా కలెక్టర్ ఓటు!

- సామాన్య ఓటరులా క్యూ లైన్లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ఎన్నికల అధికారి
- పుట్టపర్తి 27వ వార్డులో ఓటు వేసిన కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్
- ప్రజలకు కలెక్టర్ పిలుపు

పుట్టపర్తి, నవంబర్ 1: మనం న్యూస్: ఎన్నికల విధుల్లో జిల్లా ఎన్నికల అధికారిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్.. ఓటరు బాధ్యతను సైతం అంతే ప్రాధాన్యతతో నిర్వర్తించారు. అధికార హోదాను పక్కనపెట్టి సామాన్య ఓటరులా క్యూ లైన్లో నిలబడి తన వంతు కోసం వేచి చూసి ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం పుట్టపర్తి మున్సిపాలిటీలోని 27వ వార్డులో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన సాధారణ ఓటరులా క్యూలో నిలబడి, తన వంతు వచ్చిన తర్వాత ఓటు వేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు దానిని బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో కొనసాగుతోందని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.





పిడుగుపాటుతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం

తాడేపల్లిగూడెం నవంబర్ 1(మనం న్యూస్): తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం బోడపాడు గ్రామానికి చెందిన పాల రాంబాబు తుపాను ప్రభావంతో సంభవించిన పిడుగుపాటుకు గురై మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ విషాదకర ఘటన గురించి తెలుసుకున్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా నిలుస్తూ రూ.1,00,000 (లక్ష రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు.ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధకారంలో బండారు లంక గ్రామం

అమలాపురం నవంబర్ 1 మనం ప్రతినిధి: అమలాపురం మండలం బండారులంక గ్రామం లో ఆర్నబ్ తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి మొదలుకొని బుధవారం,గురువారం, శుక్రవారం,శనివారం,ఆదివారం రాత్రి వరకూ 5 రోజులుగా బండారు లంక గ్రామం లో విద్యుత్ సరఫరా లేదని అమలాపురం మాజీ ఎంపీపీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు బండారు లంక గ్రామం చేనేత గ్రామమని ఇక్కడ అందరూ చేనేత మీద ఆధారపడి జీవనం సాగిస్తారని, వస్త్ర వ్యాపార కేంద్రం గా ఉందని అయన తెలిపారు. ఇది మారుమూల గ్రామం కాదని కోనసీమ జిల్లా అమలాపురంలో అంతర్భాగమే ఐనప్పటికీ నేటికీ కూడా ఈ గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయకపోవడం తో గ్రామం లో అంధకారంలో ఉంటున్నామని ప్రజలు బాధలు పట్టించుకునే నాథుడే లేరని, చేనేతల ఆకలి కేకలు పట్టించుకోకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా క్షేత్రస్థాయి లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగడం లేదని ఆయన పత్రికా ముఖం గా ఆరోపించారు.

జెడ్పీటీసీ అభ్యర్థి వెంకట కుమారికి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల మద్దతు

చందర్లపాడు, నవంబర్ 1,మనం న్యూస్: జెడ్పీటీసీ అభ్యర్థి శాఖమూరి వెంకట కుమారికి ప్రముఖ సినీ నటి, ప్రముఖ యాంకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్యామల ఒక సందేశం ద్వారా మాట్లాడుతూ శాఖమూరి వెంకట కుమారి విద్యావంతురాలు, సేవా దృక్పథం ఉన్న మహిళా నాయకురాలు అని కొనియాడారు. ఎన్నికలలో ఆమె పోటీ చేయడం అభినందనీయమని, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల బాధ్యత, ప్రజల సమస్యలపై అవగాహన వంటి అంశాలు ఎంతో ముఖ్యమని, వెంకట కుమారి గారిలో ఆ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు.ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. శ్యామల తనకు మద్దతు తెలిపినందుకు జెడ్పీటీసీ అభ్యర్థి శాఖమూరి వెంకట కుమారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



పెంటపాడులో గ్యాస్ సిలిండర్ పేలి దంపతులకు తీవ్ర గాయాలు

పెంటపాడు నవంబర్ 1 (మనం న్యూస్): పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడులోని ఒక కొబ్బరి తోటలో శనివారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలి



ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.పెంటపాడు గ్రామానికి చెందిన కిలపర్తి ఎర్రయ్య , ధనలక్ష్మీ దంపతులకు ఈ ప్రమాదంలో తీవ్ర కాలిన గాయాలయ్యాయి. గ్యాస్ లీకేజీ కారణంగానే ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు తెలిపారు.గాయపడిన దంపతులను తొలుత తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం తణుకు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం చేస్తున్నారు.

జోరందుకున్న గాడిద అలివేలు ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం...

- కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

కుక్కునూరు, నవంబర్ 01(మనం న్యూస్): మండలంలో గల గణపవరం-పెదరావి గూడెం ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటి వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు గాజు గ్లాసు గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థి బొంతు కోమల దేవి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమకు మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు.



గ్రామాల అభివృద్ధికి, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, గ్రామాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా వారు ఓటర్లకు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన,టిడిపి,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరందుకున్న గాడిద అలివేలు ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం

- కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

కుక్కునూరు, నవంబర్ 01(మనం న్యూస్): మండలంలో గల గణపవరం-పెదరావి గూడెం ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటి వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి గాడిద అలివేలు గాజు గ్లాసు గుర్తుపై, జడ్పీటీసీ అభ్యర్థి బొంతు కోమల దేవి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమకు మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు.



గ్రామాల అభివృద్ధికి, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, గ్రామాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా వారు ఓటర్లకు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన,టిడిపి,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్పా పెంటపాడులో జనసేనలోకి వైసీపీ కార్యకర్తలు

పెంటపాడు నవంబర్ 1 (మనం న్యూస్): కస్పా పెంటపాడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ మాజీ ఎంపీటీసీ పోట్ల ఏడుకొండలు , వైసీపీ నాయకులు వీరాబత్తుల దానయ్య, తోట రాజా ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు ఆదివారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన పర్యటనలో ఎమ్మెల్యే బొలిశెట్టి వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నుండి జనసేనలోకి వలసలు పెరుగుతున్నాయన్నారు.



పేదలకు సేవ చేయడమే లక్ష్యం



- డాక్టర్ చైతన్య ఆనంద్

గజ్వేల్, నవంబర్ 1 మనం న్యూస్: పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని గజ్వేల్ పట్టణంలోని లైఫ్ హాస్పిటల్ అధినేత ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చైతన్య ఆనంద్ తెలిపారు. ఆదివారం నాడు కొమురవెల్లి మండలం గురువన్న పేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య ఆనంద్ మాట్లాడుతూ గ్రామాలలో చాలామంది పేదలు వైద్యాన్ని చేయించుకోలేక ఇబ్బంది పడుతూ ఉంటారని వారిని దృష్టిలో ఉంచుకొని గజ్వేల్ పట్టణం నుండి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గురన్నపేటలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని దీనిలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవళి కూడా చిన్న పిల్లలకు చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరిగిందన్నారు. గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన లభించిందని సుమారు 300 మంది కి చికిత్సలు నిర్వహించి వారందరికీ ఉచితంగా మందులను కూడా అందించడం జరిగిందని కొంతమంది ఆపరేషన్ అవసరం ఉండగా వారిని గజ్వేల్ పట్టణంలోని లైఫ్ క్యూర్ ఆసుపత్రికి రావలసిందిగా సూచించడం జరిగిందని వారికి కూడా చాలా తక్కువ ధరలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు డాక్టర్ చైతన్య ఆనంద్ తెలిపారు. తమ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనిక్, జనరల్ ఫిజీషియన్, యూరాలజీ, క్యాన్సర్ తో పాటు సంబంధిత రోగాలకు చెందిన డాక్టర్లు అందుబాటులో ఉంటారని అవసరమున్నవారికి ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ చైతన్య ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఆసుపత్రి సిబ్బంది ఏ ప్రవీణ్, కె ప్రవీణ్ కుమార్, సంగీత, రాజకళ, పల్లవి, సోఫీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన సేవలకు జాతీయ గుర్తింపు

- డాక్టర్ బాలుకు ప్రతిష్టాత్మక పురస్కారం
- న్యూఢిల్లీలో మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్ చేతుల మీదుగా రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ ప్రదానం
- 19 ఏళ్లుగా రక్తదాన రంగంలో విశేష సేవలు
- ఇప్పటివరకు 30 వేల యూనిట్లకు పైగా రక్త సేకరణ.
- తలసేమియా చిన్నారుల కోసం ప్రత్యేకంగా 7 వేల యూనిట్ల రక్త సేకరణ



కామారెడ్డి, నవంబర్ 1 (మనం బ్యూరో): రక్తదాన రంగంలో గత 19 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న డాక్టర్ బాలుకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సమావేశంలో ఆయనకు ప్రతిష్టాత్మకమైన శ్రీ రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ పురస్కారం - 2026ను అందజేశారు. ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ బాలు ఈ పురస్కారాన్ని ఉత్తరప్రదేశ్ వృత్తి విద్య, నైపుణ్య అభివృద్ధి శాఖ మంత్రి కపిల్ దేవ్ అగర్వాల్, ఢిల్లీ బీజేపీ ఎమ్మెల్యే తిలక్ రామ్ గుప్తా, ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బీజేపీ సీనియర్ నాయకుడు శ్యామ్ జాజు చేతుల మీదుగా అందుకున్నారు.

30 వేల యూనిట్లకు పైగా రక్త సేకరణ

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ., 2007 నుంచి నిరంతరంగా రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇప్పటివరకు 30 వేల యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం తక్కువ సమయంలోనే 7 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి అందించినట్లు పేర్కొన్నారు. ఈ సేవలను గుర్తించి తనకు జాతీయ పురస్కారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేయడంలో విశేషంగా సహకరించిన గంజి రాజమౌళి గుప్త, ఉప్పల శ్రీనివాస్ గుప్తతో పాటు తన సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ డాక్టర్ బాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు అనిల్ అగర్వాల్, ఐవీఎఫ్ జాతీయ కోశాధికారి దినేశ్ చాంద్ గుప్తా, ఐవీఎఫ్ సెంట్రల్ కమిటీ సభ్యులు కక్కిరాల రమేశ్, నీల భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

అమీన్ పూర్‌లో 10.50 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

- ఇద్దరు నిందితులను పట్టుకున్న పోలీసులు
- స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.1.26 లక్షలు
- రెండు మొబైల్ ఫోన్లు సీజ్.. మరో నిందితుడి కోసం గాలింపు



అమీన్ పూర్, నవంబర్ 1 (మనం న్యూస్): అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాదక ద్రవ్యాల విక్రయాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10.50 గ్రాముల ఎండీఎంఏ మాదక ద్రవ్యాన్ని, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.1,26,000 ఉంటుందని పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 31న అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడ సోమవారం మార్కెట్ బస్ స్టాప్ సమీపంలో మాదక ద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ దాడి నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని కర్ణాటకకు చెందిన హృతిక్ డి. పాటిల్ (26), పాశమైలారానికి చెందిన సిద్ధార్థ్ (25)గా గుర్తించారు. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా 10.50 గ్రాముల ఎండీఎంఏతో పాటు రెండు మొబైల్ ఫోన్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు బెంగళూరుకు చెందిన సలోజ్ అనే వ్యక్తి వద్ద ఎండీఎంఏ కొనుగోలు చేసినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రధానంగా సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న సలోజ్ ప్రస్తుతం పరారీలో ఉండటంతో అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై అమీన్పూర్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 787/2026, ఎన్డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(ఛి) ట/రీ 22(ఛి), 27 కింద కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించారు.

డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు: అమీన్ పూర్ సీఐ ప్రవీణ్ రెడ్డి

యువత భవిష్యత్తును దెబ్బతీసే మాదక ద్రవ్యాల నిర్మూలనకు సైబరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని అధికారులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైద్య నిపుణుల పోస్టులకు 4న ఇంటర్వ్యూలు



- జాతీయ ఆరోగ్య మిషన్ కింద 10 పోస్టుల భర్తీకి ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు
- వైద్యాధికారికి రూ.52 వేలు.. నిపుణులకు రూ.లక్ష వేతనం

కామారెడ్డి, నవంబర్ 1 (మనం బ్యూరో): జాతీయ ఆరోగ్య మిషన్ కింద కామారెడ్డి జిల్లాలో వైద్యాధికారులు, వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి ఈ నెల 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. తాత్కాలిక ఒప్పంద ప్రాతిపదికన మొత్తం 10 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆదివారం వెల్లడించారు. ఖాళీల్లో మత్తుమందుల వైద్య నిపుణులు రెండు, వైద్యాధికారి ఒకటి, స్త్రీ వైద్య నిపుణులు మూడు, చిన్నపిల్లల వైద్య నిపుణులు ఒకటి, చిన్నపిల్లల వైద్య నిపుణులు/వైద్యాధికారులు రెండు, మానసిక వైద్య నిపుణుల పోస్టు ఒకటి ఉన్నాయి. వైద్యాధికారి పోస్టుకు నెలకు రూ.52 వేలు, వైద్య నిపుణులకు రూ.లక్ష చొప్పున వేతనం చెల్లించనున్నారు.

ఇంటర్వ్యూ ఈ నెల 4న ఉదయం 10.30 నుండి..

ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, గది నంబరు 105లో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి.

అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలు, తెలంగాణ వైద్య మండలి నమోదు పత్రం, ఇతర ధ్రువపత్రాల అసలు ప్రతులతో హాజరుకావాలి. అధికారిక వెబ్సైట్ నుంచి దరఖాస్తును డౌన్లోడ్ చేసుకుని పూర్తిచేసి సమర్పించాలి.

దరఖాస్తు రుసుము రూ.500...

దరఖాస్తు రుసుము రూ.500ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కామారెడ్డి పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. మరిన్ని వివరాలు, దరఖాస్తు కోసం ప్రభుత్వ వెబ్సైట్ను సందర్శించాలని కలెక్టర్ సూచించారు.

భగవద్గీత పారాయణంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు

భారతి నగర్ డివిజన్లోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యక్రమం

పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో 5 వేల మంది మాతృమూర్తులతో సామూహిక పారాయణం

భక్తి, ఆధ్యాత్మికతతో పులకించిన ఆశ్రమ ప్రాంగణం



రామచంద్రాపురం, నవంబర్ 1 (మనం న్యూస్): పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని భారతి నగర్ డివిజన్లో ఉన్న శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక భగవద్గీత పారాయణ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. ఆశ్రమంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సుమారు 5 వేల మంది మాతృమూర్తులు ఒకేచోట చేరి భగవద్గీత పారాయణం చేయడం విశేషంగా నిలిచింది.

ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఒకే వేదికపై భక్తిశ్రద్ధలతో భగవద్గీత శ్లోకాలను పారాయణం చేయడం ఆశ్రమ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. భగవద్గీతలోని ఆధ్యాత్మిక సందేశాలు, జీవన విలువలను స్మరించుకుంటూ మాతృమూర్తులు సామూహిక పారాయణంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా భగవద్గీత బోధనలు, ఆధ్యాత్మిక చింతన, సనాతన ధర్మ విలువలను ప్రజల్లో మరింతగా పెంపొందించే ప్రయత్నం జరిగింది. వేలాది మంది మహిళలు ఒకేసారి పారాయణంలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీలో మంత్రి 'దామన్న' సందడి!

- గురువుతో కలిసి 'ఓట్ బచావ్-దేశ్ బచావ్' నిరసనలో పాల్గొన్నకాట 'శీనన్న'
- రామ్లీలా మైదానంలో కాంగ్రెస్ భారీ నిరసన సభ
- ఓటర్ల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ గళం
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం





రామచంద్రపురం, నవంబర్ 1 (మనం న్యూస్): ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఓట్ బచావ్-దేశ్ బచావ్' మహాసభలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సందడి చేశారు. తన రాజకీయ గురువు, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురు-శిష్యులుగా పేరొందిన వీరిద్దరూ ఒకే వేదికపై కనిపించడం కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగించింది. ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియలో చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న అవకతవకలు, ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్ల తొలగింపు అంశాలను నిరసిస్తూ ఏఐసీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలోని రామ్లీలా మైదానంలో భారీ నిరసన మహాసభ నిర్వహించారు. ఈ సభకు మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి కాట శ్రీనివాస్ గౌడ్ హాజరై ఓటర్ల హక్కుల పరిరక్షణకు మద్దతుగా గళమెత్తారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన విధానం అమలు కావాలని కోరారు. ఓటు హక్కుకు భంగం కలిగితే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి రక్షణగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటర్ల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటమే లక్ష్యంగా తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని కాట శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ మహాసభలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొనడం పటాన్చెరు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది.

ఇవి ఎన్నికలా?

- ఓటు వేయని జగన్
- ప్రభుత్వ కనుసన్నల్లో ఈసీ
- పులివెందులలో ఈ-పోలింగ్ నిర్వహించాలి
- పోలింగ్ నాడు స్వేచ్ఛాయుత వాతావరణం లేదు
- ప్రజాస్వామ్యం చచ్చిపోయింది
- ఏపీ మాజీసీఎం, ఏపీ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి



విజయవాడ, మనం ప్రత్యేకప్రతినిధిః పులివెందుల నియోజకవర్గంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, పోలింగ్ సరళి తీవ్ర ఉద్రిక్తతలకు, వివాదాలకు కేంద్ర బిందువుగా మారాయి. ఎన్నికలలో అధికార పక్షం భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడిందని, ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అపహాస్యం చేశారని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను స్వయంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లినప్పటికీ, అక్కడ జరుగుతున్న అక్రమాలను చూసి తీవ్ర మనస్తాపానికి గురై ఓటు వేయకుండానే వెనుదిరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పులివెందులలో జరుగుతున్న తతంగం చూస్తుంటే, ఒక ఓటరుగా తాను కూడా ఇప్పుడు ఓటు వేస్తే అది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తన ఓటు వేసి వెళ్లిపోవడం కంటే, అక్కడ జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమే ముఖ్యమని భావించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం పూర్తిగా ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తోందని, ఎస్ఈసీ తీరు చూస్తుంటే చంద్రబాబు మనిషిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అలాగే అధికారులు సైతం అధికార పార్టీ చేతిలో తోలుబొమ్మలుగా మారి నిబంధనలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు.

పోలింగ్ నాడు స్వేచ్ఛాయుత వాతావరణం లేదు..

పోలింగ్ నాడు స్వేచ్ఛాయుత వాతావరణం లేదని వైఎస్ జగన్ అన్నారు. కనీసం వైసీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్లను కూడా పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించడం లేదన్నారు. బయటే టీడీపీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీ కార్యకర్తలకు పోలీసులు సహకరిస్తున్నారని అన్నారు. పులివెందులలో 80 పోలింగ్ కేంద్రాలుంటే 70 పోలింగ్ కేంద్రాల్లో తమ పార్టీ ఏజెంట్లను రానివ్వకుండా రిగ్గింగ్ చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. అక్రమాలకు అండగా నిలబడతారనే వెయ్యి మంది పోలీసులను పులివెందులకు రప్పించారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తన హెలికాప్టర్ ల్యాండింగ్ కు అనుమతిచ్చారని జగన్ అన్నారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కుంటున్నారని జగన్ అన్నారు.

దొంగ ఓట్ల నమోదు, రిగ్గింగ్...

పులివెందులలో జరిగిన దాడులు, దొంగ ఓట్ల నమోదు, రిగ్గింగ్ తాము ఇప్పటికే అధికారులకు, రిటర్నింగ్ ఆఫీసర్కు స్పష్టమైన ఫిర్యాదులు అందజేసినట్లు జగన్ గుర్తుచేశారు. ఎన్నికల అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో పాటు అక్రమాలు నిరాటంకంగా కొనసాగినందునే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాము ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఎన్నికల సంఘం స్పందించి పులివెందులలో తక్షణమే రీ-పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రీ-పోలింగ్ తేదీని ప్రకటించిన తర్వాతే తాను వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకుంటానని స్పష్టం చేశారు. పాలనపై నమ్మకం ఉందా? ప్రభుత్వానికి పాలనపై నమ్మకం ఉంటే, మంచిగా చేశామని విశ్వసిస్తే ఎన్నికలను సజావుగా జరగనిచ్చి చూడండని అన్నారు. పులివెందులలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కు ఆదేశాలు ఇవ్వాలని జగన్ కోరారు. తాము ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని, అవసరమనుకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని జగన్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని జగన్ ఆవేదన చెందారు. ఈ సంస్కృతికి నాంది పలికిన చంద్రబాబు భావి తరాలకు ఏం సందేశాన్ని ఇస్తున్నారని ప్రశ్నించారు. అందుకే నక్సలిజం దేశంలో ప్రబలిపోతుందన్నారు. అనేక మందిని ఉసిగొల్పుతూ తమను పోలింగ్ కేంద్రాల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని, అలాగే ప్రజలు కూడా స్వేచ్ఛాయుతంగా ఓట్లు వేసే పరిస్థితి లేనప్పుడు ఈ ఎన్నికలను నిర్వహించడం ఎందుకని జగన్ ప్రశ్నించారు.

ఘనంగా శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



గజ్వేల్ నవంబర్1 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు కట్టపై వెలసిన శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయ మూడవ వార్షికోత్సవాన్ని భక్తుల జయజయధ్వానాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా స్వామివారికి పవిత్ర అభిషేకాలు, విశేష హోమ కార్యక్రమాలను అర్చకులు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ, ప్లాస్టిక్కు బదులుగా స్టీల్ ప్లేట్లు, స్టీలు గ్లాసులను మాత్రమే ఉపయోగించి పర్యావరణ హితంగా కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు గుంటుకు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, కోశాధికారి దూబకుంట రుక్మయ్యలు మాట్లాడుతూ... గత మూడేళ్లుగా ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ, స్వామివారిని దర్శించుకునే భక్తుల కోరిన కోరికలు తీర్చే దివ్య క్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని హర్షం వ్యక్తం చేశారు. ఆలయ భవిష్యత్ అభివృద్ధికి ప్రతి ఒక్క భక్తుడు, గ్రామస్థుడు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అలాగే, వార్షికోత్సవ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా నిర్వహించిన ఆలయ అర్చకులు సాయి పంతులు, గజ్వేల్ పట్టణ ప్రముఖ పురోహితులు నంద బాల శర్మలకు ఆలయ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు, గోలి మమత సంతోష్, గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, బొగ్గుల స్వప్న సురేష్, ఆలయ ఉపాధ్యక్షులు జంగం వెంకట్ గౌడ్, గంగిశెట్టి రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిశెట్టి కృష్ణ, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, మాజీ అధ్యక్షులు మామిడి రాములు, నాయకులు బుక్క రమేష్, నాగరాజు నేత, ఆర్ కే శ్రీనివాస్,బలకుమార్ సుంకరి,బొమ్మ రమణ, హనుమంతు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోలింగ్.. ముగిసింది

- మందకొడిగా సాగిన పోలింగ్
- అత్యధికంగా కర్నూల్, అత్యల్పంగా విశాఖ

అమరావతి, మనంప్రత్యేకప్రతినిధిః ఆంధ్రప్రదేశ్ లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయిన పోలింగ్ సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగింది. క్యూ లైన్ లో ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు స్థానిక ఎన్నికల అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.

అత్యల్పంగా విశాఖలో 39 శాతం పోలింగ్ మాత్రమే జరిగింది. కొన్ని చోట్ల రీపోలింగ్ జరపాలని అభ్యర్థనలు వచ్చాయని, ఎన్నికల అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.


ఐదు గంటలకు క్యూ లైన్ లో ఉన్న వారికి... మధ్యాహ్నం మూడు గంటల వరకు 48.03 శాతం పోలింగ్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నానికి కొంత పుంజుకుంది. అత్యధికంగా కర్నూలు, అత్యల్పంగా విశాఖ పట్నం మున్సిపాలిటీల్లో పోలింగ్ శాతం నమోదయింది. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు జరిగాయని, మిగిలిన చోట్లంతా ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు.

ఢిల్లీ గడ్డపై ఎంపీ రఘురాంరెడ్డి

నిరసన గర్జన

సీఈసీ రాజీనామా డిమాండ్‌తో ఇండియా కూటమి భారీ ర్యాలీ

తోటి ఎంపీలతో కలిసి రాంలీలా మైదానానికి ప్రదర్శనగా తరలివెళ్లిన ఖమ్మం ఎంపీ



ఖమ్మం , నవంబర్ 1(మనం న్యూస్): ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా.. ఎన్నికల సంఘం తీరుపై నిరసన గళం వినిపించేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఢిల్లీ వీధుల్లో సాగిన ఇండియా కూటమి పోరాటంలో భాగస్వాములయ్యారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను నిరసిస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీలో తోటి ఎంపీలతో కలిసి పాల్గొన్నారు. ఢిల్లీలోని బీకేఎస్ మార్గ్‌లో ఉన్న ఎంపీ క్వార్టర్స్ నుంచి బయలుదేరిన రఘురాంరెడ్డి.. ఇతర ఎంపీలతో కలిసి మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి మీదుగా రామ్లీలా మైదానానికి భారీ ప్రదర్శనగా తరలివెళ్లారు. ఇండియా కూటమికి చెందిన వివిధ పార్టీల నేతలు, ఎంపీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ, సీఈసీ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, ఓటర్ల జాబితాల సవరణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని స్పష్టం చేశారు. అనంతరం రామ్లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం

- సామినేని రామారావు అసలైన హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలి
- కరవు నివారణ చర్యలు తీసుకోవాలి
- సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



ఖమ్మం నవంబర్ 1(మనం బ్యూరో): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు దేశాన్ని అభివృద్ధి పరంగా తీవ్ర అధోగతి పాలు చేస్తున్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు విమర్శించారు. ఆదివారం ఖమ్మం మంచికంటి భవన్లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య, ప్రజా వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. అంతర్జాతీయంగా కార్పొరేట్ వ్యవస్థకు నాయకుడిగా ఉన్న ట్రంప్ అనుసరిస్తున్న విధానాలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గి, భారతదేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతోందని దుయ్యబట్టారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తూ, వారి ఏకఛత్రాధిపత్యాన్ని ప్రోత్సహిస్తూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాల నడ్డి విరిచే చర్యలను సమర్థిస్తోందన్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై దౌర్జన్యంగా అణచివేతకు పాల్పడుతోందని, ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని మొదటగా ప్రశ్నించిందని గుర్తుచేశారు.

ఓట్ల నమోదు ప్రక్రియ (సర్)ను దేశంలోని ఓటర్ల తొలగింపునకు కుట్రగా వాడారని, ఈ క్రమంలో దేశంలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లను, తెలంగాణ రాష్ట్రంలో 70 లక్షల వరకు ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సిపిఐ(ఎం) ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన, ఓటర్ల తొలగింపుపై మొదటగా సిపిఐ(ఎం) పార్టీయే అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలను సమాయత్తం చేసి, అఖిల పక్షాల ఆధ్వర్యంలో కేంద్రానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించిందని గుర్తుచేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలబడి ఆందోళనలు చేయడంలో పార్టీ సఫలీకృతమైందన్నారు. రాబోవు పట్టభద్రుల ఎన్నికల్లో మద్దతిస్తున్న అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉద్ఘాటించారు. త్వరలో నల్గొండలో జరగనున్న రైతు మహాసభలకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి, సభను ఘన విజయం చేయాలని పిలుపునిచ్చారు.

హత్యా రాజకీయాలపై రాజీలేని పోరాటం

సిపిఐ(ఎం) పార్టీ నాయకుడు సామినేని రామారావు దారుణ హత్యా ఉదంతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి అనుసరిస్తున్న హత్యా రాజకీయాలపై తమ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని పోతినేని సుదర్శన్ రావు స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, ఇటువంటి హత్యా రాజకీయాలను నిలదీస్తూ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

కరవు నివారణ చర్యలు చేపట్టాలి : నున్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నీ నో పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు తీవ్రంగా వున్నాయని పేర్కొన్నారు. కరువు మండలాల్లోని రైతాంగాన్ని. వ్యవసాయ కూలీలను, ప్రజలను అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల కి నష్టపరిహారం చెల్లించాలని. కరవు పేరుతో బియ్యం, నిత్యవసర వస్తువుల ధరలు తీవ్రంగా పెంచుతూ,బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని చెప్పారు. అధిక ధరల తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, ఈ కరువు పరిస్థితిలో ధరల నియంత్రణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు.అన్ని రకాల వస్తువుల ధరలు ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రేషన్ షాపుల ద్వారా ప్రతి కుటుంబానికి 50 కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 15వ తేదీన నల్లగొండ పట్టణంలో జరుగుతున్న అఖిలభారత కిసాన్ మహాసభ ఆల్ ఇండియా మహాసభ సందర్భంగా లక్ష మందితో జరుగు బహిరంగ సభలో ఖమ్మం జిల్లా నుండి పదివేల మంది పాల్గొంటున్నారని చెప్పారు. రైతు సభను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సామినేని రామారావు హత్యపై సరైన దర్యాప్తు చేయకుండా, అసలైన దోషులను శిక్షించకుండా జిల్లా పోలీస్ కమిషనర్, కొంతమంది పోలీస్ యంత్రాంగం కట్టుకథ అల్లి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ హత్యను ఆర్థిక హత్యలుగా సృష్టిస్తున్నారని,ఇది పోలీస్ యంత్రాంగానికి సరైన పద్ధతి కాదన్నారు. ఇలా చేస్తే ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల రాజ్యాంగం పట్ల నమ్మకం కోల్పోతారని, రాష్ట్ర ముఖ్యమంత్రి వాగ్దానం చేసినట్టుగా సరైన దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సిట్ ను వెంటనే రంగంలోకి దింపి, హత్య పాల్పడిన అసలైన దోషులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఈ హత్య ప్లాన్ వెనుక కాంగ్రెస్ ఆది నాయకత్వం పక్కాగా ఉందని ఆరోపించారు. హత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలని, రామారావు భార్య పెట్టిన కేసు నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిని విచారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర పోలీస్ అధికారులను, రాష్ట్ర ముఖ్యమంత్రిని నున్నా నాగేశ్వరరావు కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి. బుగ్గ వీటి సరళ బండి పద్మ. బండి రమేష్, వై విక్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు. భూక్య వీరభద్రం బొంతు రాంబాబు, మడుపల్లి గోపాల్ రావు, మెరుగు సత్యనారాయణ,పిట్టల రవి, పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్రావు. ఎం సుబ్బారావు. చింతల చెరువు కోటేశ్వరరావు.. పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురు వ్యక్తుల గుర్తింపు

- మరో ఇద్దరి వద్ద పావు కిలో గంజాయి స్వాధీనం
- గంజాయి సేవించిన ఆరుగురిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు గంజాయి కలిగి ఉన్న ఇద్దరికి రిమాండ్



దమ్మపేట, నవంబర్ 01 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, సూచనల మేరకు దమ్మపేట పోలీసులు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

తేదీ 31.10.2026న దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై బి. రాజేష్ కుమార్ ,తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఆర్లపెంట గ్రామ శివారులోని స్మశాన వాటిక వద్ద గంజాయి సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ నిర్వహించిన యూరిన్ డ్రగ్ పరీక్షల్లో టిహెచ్సి పాజిటివ్గా నిర్ధారణ అయింది. అనంతరం విచారణలో లంకాలపల్లికి చెందిన పొట్ట సాయికుమార్ సాయి, నాగుపల్లికి చెందిన లవుడియా చైతన్య ,వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి మొత్తం పావు కిలో గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12,500 ఉంటుందని తెలిపారు. ఈ కేసులో గంజాయి సేవించిన ఆరుగురిని, గంజాయితో పట్టుబడిన ఇద్దరిని దమ్మపేట కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు గంజాయి సేవించిన ఆరుగురిని డీ-అడిక్షన్ సెంటర్కు తరలించగా, గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్కు తరలించడం జరిగింది. గంజాయి సరఫరా, విక్రయాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి, భవిష్యత్తుకు హానికరమని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వ మరియు వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై బి. రాజేష్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం

- ప్రారంభించిన తుమ్మల యుగంధర్

ఖమ్మం, నవంబర్ 1 (మనం న్యూస్): స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, డాక్టర్ తుమ్మల యుగంధర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఆటలలో గెలుపు, ఓటములు సర్వసాధారణమని పునరుద్ఘాటించారు. అనంతరం టాస్ వేసి ఆటను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అజాతశత్రువు మన్నేపల్లి వెంకటేశ్వరరావు

నామ, పువ్వాడ ఘన నివాళి

ఖమ్మం, నవంబర్ 1(మనం న్యూస్): ఖమ్మం వీడియోస్ కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి, మన్నేపల్లి వెంకటేశ్వరరావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మన్నేపల్లి వెంకటేశ్వరరావు అజాతశత్రువని, అందరితో కలుపుగోలుగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కొనియాడారు. నామకు వెంకటేశ్వరరావుతో



తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

వైద్యులు, ఆసుపత్రులపై అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు

ఐఎంఏ ఖమ్మం జిల్లా శాఖ హెచ్చరిక

ఖమ్మం, నవంబర్ 1 (మనం న్యూస్): వైద్యులు , ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు , నిరాధార ఆరోపణలు , బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ , సివిల్ , పరువునష్టం కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఖమ్మం జిల్లా శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని అన్నారు . వైద్య నిర్లక్ష్యం నిర్ధారణ కాకముందే ఆరోపణలు చేయడం , ఆసుపత్రుల్లో గొడవలు సృష్టించడం , సిబ్బందిని బెదిరించడం , సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం ఆందోళనకరమన్నారు . ఇలాంటి ఘటనల వల్ల అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు . వైద్యులు , సిబ్బంది , ఆసుపత్రులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ , డీఎంహెచ్ఓ , ఏసీపీలకు ఐఎంఏ ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు . ఐఎంఏ లీగల్ సెల్ , జిల్లా కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ, వైద్యులపై అసత్య ఆరోపణలు , బెదిరింపులు , పరువుకు భంగం కలిగించే ప్రచారాలపై ఇకపై చట్టపరంగా పోరాడతామని వెల్లడించారు .



బాధిత వైద్యులు , ఆసుపత్రులకు లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహకారం అందిస్తామని తెలిపారు . వైద్య సేవలపై రోగులకు అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను , వైద్య నియంత్రణ సంస్థలను లేదా న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు ఉందని , నిజమైన ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణకు ఐఎంఏ సహకరిస్తుందని స్పష్టం చేశారు .

అంతర్రాష్ట్ర అండాల సేకరణ రాకెట్ గుట్టురట్టు

హైదరాబాద్‌లో నిందితుల చెర నుంచి 43 మంది మహిళలకు విముక్తి

ప్రధాన నిర్వాహకులతో సహా మొత్తం 9 మంది అరెస్ట్



హైదరాబాద్, నవంబర్ 1, మనం ప్రతినిధి : హైదరాబాద్ నగరంలో భారీ ఎత్తున సాగుతున్న అంతర్రాష్ట్ర అండాల అక్రమ సేకరణ రాకెట్ను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే. పేద మహిళలే లక్ష్యంగా చేసుకున్న ముఠా.. వారి నుంచి అండాలను సేకరించి ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు అమ్ముకుంటున్నట్లు బయటకు పొక్కడంతో పక్కా వ్యూహంతో వలపన్నిన పోలీసులు కేటుగాళ్లను అరెస్ట్ చేశారు. అయితే, ఈ ఆపరేషన్‌లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది మహిళలకు విముక్తి కల్పించారు. ముఠాకు చెందిన 9 మందిని అదుపులోకి తీసుకున్నారు.

బేగంపేట్, సరూర్‌నగర్, మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ప్రకాశ్ నగర్, బేగంపేట్, ఎర్రగడ్డ, సరూర్ నగర్, గోపాలపురం ప్రాంతాల్లోని పలు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్,మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి పేద మహిళలను ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే, ఒక్కో అండం సేకరణకు రూ.20,000 నుంచి రూ.30,000 వరకు ఇస్తామని ఆశ చూపి వారిని హైదరాబాద్‌కు రప్పిస్తున్నారు. ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంచి, ఫెర్టిలిటీ సెంటర్లకు అనుసంధానం చేస్తున్నారు. అండాల సేకరణ కోసం మహిళలకు బలవంతంగా హార్మోన్ల ఇంజెక్షన్లు, మందులు ఇస్తున్నట్లు బాధిత మహిళలు పోలీసులతో వాపోయారు. ఇక, దాడుల సమయంలో పోలీసులు హార్మోన్ల ఇంజెక్షన్లు, సిరంజిలు, మాత్రలతో పాటు కీలకమైన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాకెట్ ప్రధాన నిర్వాహకుడిగా అమిత్ శర్మ (44), మహిళలను రిక్రూట్ చేసే సహ నిర్వాహకురాలిగా నిక్కత్ పర్వీన్ (31)తో పాటు ఏజెంట్లు, ఏఆర్‌టీ బ్యాంక్ మేనేజర్ సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అమిత్ శర్మ ప్రకాశ్ నగర్‌లో రూ.50,000 అద్దె చెల్లిస్తూ రెండేళ్లుగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించారు.

పలు రాష్ట్రాల నుంచి పిలిపించి, ఆ మహిళల పేరుతో స్థానికంగా నకిలీ ఆధార్ కార్డులు, అఫిడవిట్లు, అంగీకార పత్రాలు సృష్టించి ఈ దందా నడుపుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, భారీ రాకెట్ వెనుక ఉన్న పలు పేరొందిన ఐవీఎఫ్ సెంటర్లు, ఏఆర్‌టీ బ్యాంకుల పాత్రపై కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై బేగంపేట్, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్లలో మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. అయితే, ఈ రాకెట్‌లో పట్టవడండ నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) రెగ్యులేషన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగినట్లు అపరేషన్ జరిపిన పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు.

కర్నూలులో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తీర్పే అంతిమం: మంత్రి టీజీ భరత్



కర్నూలు, నవంబర్ 1 (మనం న్యూస్): కర్నూలు నగరంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతోందని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆదివారం కర్నూలులోని టంగుటూరి ప్రకాశం పంతులు పాఠశాలలో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సరళిపై పలు వ్యాఖ్యలు చేశారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణతో వ్యవహరిస్తున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకుంటున్న చిన్నచిన్న ఘటనలకు వైఎస్సార్సీపీ నాయకులే కారణమని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలను పాటించకుండా, కార్ల పాస్లు లేకుండానే కొందరు వైఎస్సార్సీపీ నాయకులు తిరుగుతున్నారని విమర్శించారు.

ఎన్నికల నిబంధనలు పార్టీలకు అతీతంగా అందరికీ సమానమని, ప్రతి ఒక్కరూ వాటిని తప్పనిసరిగా పాటించాలని మంత్రి సూచించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రౌడీషీటర్లను ఏజెంట్లుగా కూర్చోబెట్టి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైఎస్సార్సీపీ నాయకుల రెచ్చగొట్టే చర్యలను కూటమి కార్యకర్తలు ఎంతో సహనంతో ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. కర్నూలులో ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

కర్నూలులో 55 నుంచి 60 శాతం వరకు పోలింగ్ నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఎన్నికల సరళిని ఆసక్తిగా గమనిస్తున్నారని, ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ప్రజలు ఇచ్చే తీర్పే అంతిమమని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- గ్రామాల అభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యం
- ఏడీసీసీ చైర్మన్ కేశవరెడ్డి
- ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- జడ్పీ చైర్మన్ అభ్యర్థి గంజే నాగరాజు
- కోటంక, మర్తాడులో కూటమి అభ్యర్థుల విస్తృత ఎన్నికల ప్రచారం



గార్లదిన్నె నవంబర్ 1 మనం న్యూస్ : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి చంద్రన్న నాయకత్వం తోడ్పడుతుందని ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. తనకు ఒక్క అవకాశం కల్పిస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి చేసి చూపిస్తానని జడ్పీ చైర్మన్ అభ్యర్థి గంజే నాగరాజు ప్రజలను కోరారు.

గార్లదిన్నె మండల పరిధిలోని కోటంక, మర్తాడు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కూటమి పార్టీ అభ్యర్థుల తరఫున విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి హాజరయ్యారు. జడ్పీ చైర్మన్ అభ్యర్థి గంజే నాగరాజుతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయవచ్చని పేర్కొంటూ కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు కోరారు.

ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి చంద్రన్న నాయకత్వంతోనే సాధ్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, గ్రామాల అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జడ్పీ చైర్మన్ అభ్యర్థి గంజే నాగరాజు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో తనకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. పదవి కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో ముందుకు సాగుతున్నానని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తనకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

కోటంక, మర్తాడు గ్రామాల్లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కూటమి అభ్యర్థుల తరఫున మద్దతు కోరారు.ఈ సందర్భంగా బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాండు , బ్యాళ్ల నాగేంద్ర, గోరుకాటి వెంకటేష్ నారాయణస్వామి, శేఖర ,, సీనా , చల్ల నాగరాజు, సుబ్బయ్య మాదమంచి శ్రీధర్ , ఎంపీటీసీ అభ్యర్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఓటమి భయంతోనే ఏకగ్రీవాలు

- ఏడు స్థానాల్లోనే నీళ్లు తాపించాలి
- జడ్పిటిసి ఎంపీపీ లు మావే
- వైసీపీ నాయకులు యుద్ధ సైనికుల పనిచేయడం హర్షినియం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు నవంబరు 01 మనం న్యూస్ : స్థానిక ఎన్నికలలో వైసిపి పార్టీ విజయం సాధిస్తుందన్న భయంతో పరిటాల కుటుంబం అడ్డదారిలో ఏకగ్రీవాలకు పాల్పడిందని రాప్తాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి విమర్శించారు ఆదివారం మండల పరిధిలోని బి యాలేరు గ్రామంలో వైసిపి పార్టీ ఇంటింట ప్రచారం నిర్వహించారు తోపుదుర్తి బ్రదర్స్ చంద్రశేఖర్ రెడ్డి ప్రకాష్ రెడ్డిలు హాజరై వైసీపీ నాయకుల తో కలిసి ఓటర్లను అభ్యర్థించారు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జడ్పిటిసి అభ్యర్థి బిల్లే భారతి గెలిపించాలని కోరారు ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో ఇప్పటికీ మించిపోలేదు జడ్పిటిసి ఎంపీపీ స్థానం మనవే ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు 11 స్థానాల్లో ఎన్నికలు జరిగి ఉంటే వైసిపిదే శాసనం అని ధైర్యం చెప్పారు ప్రస్తుత ఈ ఏడు ఎంపీటీసీ స్థానాల్లో కూడా ఆయా గ్రామాల్లోని వైసీపీ నాయకులు పి యాలేరులో పొన్నపాటి ప్రకాష్ రెడ్డి పి సిద్ధరాంపురం తలుపూరు వడ్డిపల్లి తోపుదుర్తి గోరు దిండ్ల సనప బి యాలేరు గ్రామాలలోని వైసీపీ నాయకులు యుద్ధ సైనికుల పనిచేస్తు టిడిపి నాయకులకు నిద్ర పట్టకుండా ఏడు చెరువుల నీళ్లు తాగిస్తున్న విషయం టిడిపి నాయకులు మరవకూడదన్నారు ప్రతి గ్రామంలో వైసీపీ నాయకులు సమన్వయంతో ప్రతి ఇంట సందర్శించి వైసీపీ పాలనలో చేసిన సంక్షేమం తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లకు తెలియజేయాలన్నారు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్వతమ్మ నాయకులు బిల్లే ముత్యాలప్ప వాసు దేవ రెడ్డి చిన్న నరసింహారెడ్డి మల్లికార్జున రెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి బాల పోతున్న స్థానిక నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు పాల్గొన్నారు.

గొల్లపల్లి రిజర్వాయర్‌కు పర్యాటక శోభ తీసుకొస్తాం

- రూ.4.60 కోట్లతో కోన మల్లికార్జున స్వామి ఆలయానికి సీసీ రోడ్డు
- గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద 45 అడుగుల ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు
- కూటమి పాలనలో అభివృద్ధి పనులకు పెద్దపీట
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో మంత్రి సవిత



పెనుకొండ నవంబర్ 1 మనం న్యూస్ : గొల్లపల్లి రిజర్వాయర్ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, ఆ ప్రాంతానికి పర్యాటక శోభ తీసుకొస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.పెనుకొండ మండలంలోని గొల్లపల్లి, చంద్రగిరి, దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం గ్రామాల్లో మంత్రి సవిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుకొండ జడ్పీటీసీ అభ్యర్థి యశోద కేశవయ్య, ఎంపీటీసీ అభ్యర్థి శాంతి రామకృష్ణ, గుట్టూరు ఎంపీటీసీ అభ్యర్థి ఆదిశేషును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెనుకొండ నియోజకవర్గంతో పాటు దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం పంచాయతీల పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, త్వరలోనే అక్కడ 45 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.అలాగే కోన మల్లికార్జున స్వామి దేవాలయానికి రూ.4.60 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధిలో కియా పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని వివరించారు.గత పాలకులు ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి సవిత పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

కరవు మండలంగా రాయదుర్గం!

సీఎం.కు కాలవ కృతజ్ఞతలు

రాయదుర్గం నవంబర్ 1 మనం న్యూస్: రాయదుర్గం రూరల్,మండలాన్ని తీవ్ర కరువు మండలంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాయదుర్గం రూరల్ మండలం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.



అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల మొదటి విడతలో ఈ మండలాన్ని అధికారులు ప్రకటించలేకపోయారని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, విత్తనం వేసిన అనంతరం తాజా పరిస్థితులకు సంబంధించిన వివరాలను అధికారుల ద్వారా సేకరించి ముఖ్యమంత్రికి వివరించామన్నారు.

తన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి కార్యాలయం, వ్యవసాయ విపత్తుల శాఖ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశాయని తెలిపారు. రెండో విడత ప్రతిపాదనల కింద తాజాగా జీవో నంబర్ 5 ద్వారా శనివారం రాయదుర్గం రూరల్ మండలాన్ని తీవ్ర కరువు మండలంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమని పేర్కొన్నారు.

రైతుల కష్టాలను గుర్తించి ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఇందుకు సహకరించిన జిల్లా కలెక్టర్కు, వ్యవసాయ శాఖ అధికారులకు రాయదుర్గం మండల ప్రజలు, రైతుల తరఫున కాలవ శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగాతోనే సాధ్యం



మహానంది,నవంబర్1,మనంన్యూస్: ఆరోగ్యమే మహాభాగ్యమని అది యోగాతోనే సాధ్యం అవుతుందని ఫారెస్ట్ రేయింజ్ అధికారి ఉదయ్ దీప్అన్నారు. ఆదివారం మహానందిలోని అటవీ పర్యావరణ కేంద్రంలో విద్యార్థులకు, గిరిజనులకు యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు ప్రతి ఒక్కరు ఉదయం లేదా సాయంత్రం యోగ చేయాలని సూచించారు. యోగా ఆసనాల వల్ల ఆరోగ్యం అభివృద్ధి చెందడంతో పాటు, శరీర దారుఢ్యం అభివృద్ధి చెందడం, మానసిక ఒత్తిడిల నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడం వల్ల ఆయువు, ఆరోగ్యం, ఆనందం పెరగడం వల్ల మనిషి యొక్క జీవన పరిణామాల్లో పెను మార్పులు సంభవిస్తాయన్నారు. యోగ కార్యక్రమం తో పాటు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద, పొలాల గట్ల , రోడ్ల వెంట మొక్కలను పెంచాలని సూచించారు. చెట్లను నరకవద్దని, వన్యప్రాణులను రక్షించాలని కోరారు. పర్యావరణాన్ని రక్షించడం వల్ల ప్రకృతిలో కాలుష్యం తగ్గడంతో పాటు వర్షాలు సకాలంలో పడి పాడి పంటలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.వృక్షో రక్షతి రక్షితః. వృక్షాలను మనం కాపాడడం వల్ల వృక్షాలు తర్వాత మనలను, జీవకోటిని కాపాడుతాయని విద్యార్థులకు అటవీశాఖ రేంజర్ ఉదయ దీప్ తెలియజేశారు. అటవీ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ ఇతర నిషేధిత వస్తువులు వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున అలాంటి వాటిపై నిషేధం ఉందని అలాంటి వాటిని వినియోగించవద్దని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఫారెస్ట్ రేంజర్ కోరారు ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యాలు అటవీ శాఖ సెక్షన్ అధికారులు నాగేంద్రయ్య, రామకృష్ణ, తేజ ఎఫ్ బి ఓ లు ప్రతాప్, పరమేశ్వరి గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగుకు అదనపు భద్రత కల్పించండి



కాట్రేనికోన, నవంబర్ 1 మనం ప్రతినిధి: రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో కాట్రేనికోన మండలంలోని తీర ప్రాంత, సమస్యాత్మక గ్రామాలలో పోలింగ్ రోజున అదనపు పోలీసు భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల నిఘా ఉంచాలని పల్లం గ్రామస్తులు కాట్రేనికోన మండల సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాట్రేనికోన ఎంపీడీవో బి.రాజేశ్వరరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నవంబరు 5న జరగనున్న ఈ ఎన్నికల్లో పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, చిర్రయానం, కుండలేశ్వరం వంటి గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే అవకాశం ఉందని, ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకుంటూ రిగ్గింగ్కు పాల్పడేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే పల్లం గ్రామంలో అధికార పార్టీకి చెందిన దోమ మణికంఠ, బొమ్మిడి ప్రసాద్ అను ఇద్దరు రౌడీ షీటర్లు తనపై భౌతిక దాడికి దిగి గాయపరిచారని, దీనిపై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదైందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఓటర్లు ఎటువంటి భయాందోళనలు లేకుండా, స్వచ్ఛందంగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, ముఖ్యంగా సున్నితమైన తీర ప్రాంత పోలింగ్ కేంద్రాల వద్ద ముందస్తు రక్షణ చర్యలు చేపట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన కాట్రేనికోన మండల ఎన్నికల అధికారులను ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

తునిలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

పురపాలక ఎన్నికల్లో 65.24 శాతం ఓటింగ్ నమోదు



తుని, నవంబర్ 1 ,మనం న్యూస్ : తుని పురపాలక సంఘ ఎన్నికల పోలింగ్ ఆదివారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన ఈ పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పట్టణంలోని 36 వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన 56 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సందడి కనిపించింది. దీంతో పోలింగ్ శాతం వేగంగా పెరిగింది. అయితే మధ్యాహ్నం నుంచి ఓటింగ్ ప్రక్రియ కొంత మందకొడిగా సాగింది. చివరకు సాయంత్రం 5 గంటలకు పోలింగ్ సమయం ముగిసే సమయానికి తుని పురపాలక సంఘ పరిధిలో 65.24 శాతం పోలింగ్ నమోదైంది. పురపాలక సంఘ పరిధిలో మొత్తం 43,036 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 20,489 మంది పురుషులు, 22,585 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 28,078 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 14,771 మంది మహిళలు, 13,294 మంది పురుషులు, 13 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసుల పర్యవేక్షణలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బ్యాలెట్ బాక్సులకు సీలు.. స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన అధికారులు

ఈ నెల 3న ఓట్ల లెక్కింపు.. అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠ

తుని, నవంబర్ 1, మనం న్యూస్ : కాకినాడ జిల్లా తుని పురపాలక సంఘం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల అధికారులు తదుపరి ప్రక్రియను చేపట్టారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులకు నిబంధనల ప్రకారం సీలు వేశారు. అనంతరం పటిష్ట పోలీసు భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను తుని మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపరిచారు.

బ్యాలెట్ బాక్సుల భద్రతకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పోలీసు నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎవరికి విజయం దక్కుతుందోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాలతో పాటు పట్టణ ప్రజల్లోనూ నెలకొంది.

నగర పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు ఎన్నికల అధికారులు ప్రేక్షక పాత్ర

బేతంచేర్ల నవంబర్ 1 (మనం న్యూస్): పట్టణంలో నగర పంచాయతీ స్థానిక ఎన్నికలు చైర్మన్ 28 వార్డుల కౌన్సిల్ కు ఎన్నికలు 56 పోలింగ్ ఏర్పాటు ఎన్నికల



కొన్ని పోలింగ్ కేంద్రాలలో గుర్తుతెలియని వ్యక్తులు ఓట్లు వేశారని వైఎస్ఆర్సిపి చైర్మన్ కౌన్సిల్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తపరిచారు పట్టణం లో శేషారెడ్డి హై స్కూల్ సరస్వతి శిశుమందిర్ ఏర్పాటుచేసిన 8 వార్డుల లో గుర్తుతెలియమి వ్యక్తులు ఓట్లు వేశారని వారిని అడ్డుకున్న పోలీస్ సిబ్బంది ఎన్నికల అధికారి ప్రేక్షక పాత్ర పోషించారు వారు ఆవేదన వ్యక్తంచేశారు అభ్యర్థులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వేయడానికి ప్రతి ఒక్కరికి హక్కు కానీ చట్టానికి విరుద్ధంగా స్థానిక ఎన్నికలు నిర్వహించారు పోలీసులు ఎన్నికల అధికారులు ఎన్నికల లో పోటీ చేస్తున్న అభ్యర్థులను ఏజెంట్లను చైర్మన్ అభ్యర్థి పూర్తిగా ఇబ్బందులకు గురిచేసి అధికారం ఉంది అని అధికారులతో ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల వద్ద గుర్తు తెలియని వ్యక్తులతో ఓట్లు వేయించారని చైర్మన్ అభ్యర్థి దూదేకుల దస్తగిరి మూడో వార్డు కౌన్సిల్ అభ్యర్థి చింత నాగిరెడ్డి ఆవేదన వ్యక్తపరిచారు.

గూడూరులో ప్రశాంతంగా ముసిన పోలింగ్

83.6 శాతం పోలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడి

గూడూరు నవంబర్ 1 (మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గూడ నగర పంచాయతీకి జరిగిన ఎన్నికల పోలింగ్ సరళి ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల పోలింగ్లో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు.



సంబంధిత ఎన్నికల అధికారులు ఓటర్లకు ఇలాంటి ఇబ్బంది కలవకుండా ఏర్పాట్లు కల్పించారు. గూడూరు నగర పంచాయతీలో భారీగా 83.6% ఎన్నికల పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల సదలిని జిల్లా కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలో పరిశీలించారు. అలాగే కూటమియతలను కలిసి ఓటింగ్ సరళి ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల పోలింగ్ ను పోలీసు ఉన్నతాధికారులు కూడా పరిశీలించారు. అలాగే భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. భారీగా ఓట్లు పోల్ కావడంతో ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి వైకాపా అభ్యర్థి గెలుపు ఓటములపై గూడూరు పట్టణ ప్రజలు అప్పుడే బెట్టింగులు ప్రారంభించారు జరిగిన 23 కౌన్సిలర్లు కూడా తర్జనభజన పడుతున్నారు. ఏది ఏమైనా మూడవ తేదీ మంగళవారం అభ్యర్థుల బవితవ్యం తెలియనుంది.

స్థానిక ఎన్నికల పోలింగ్ 31,285 ఓటర్లు

పోలింగ్ లో పాల్గొన్న ప్రజలు 24,570

బేతంచేర్ల నవంబర్ 1 (మనం న్యూస్): పట్టణంలో నగర పంచాయతీలో ఓటర్లు 31 285 ఓటర్లు ఉన్నారు స్థానిక ఎన్నికలు ఎన్నికల అధికారి హరి ప్రసాద్ స్పెషల్ అధికారి నాగమణి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు పట్టణంలో 28 వార్డుల కౌన్సిల్ అభ్యర్థులు చైర్మన్ అభ్యర్థులు ఎన్నికల పోటీలో నిలిచారు 28 వార్డుల ఎన్నికలు 56 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలు



నిర్వహించారు 56 పోలింగ్ కేంద్రాలలో 31,285 ఓటర్లు ఉండగా 24,570 ఓట్లు పోలింగ్ లో ప్రజలు పాల్గొన్నారు పోలింగ్ పర్సంటేజ్ 78.54 శాతం పోలింగ్ నమోదైంది అని ఎన్నికల అధికారులు తెలిపారు.

టీమిండియాను చిత్తు చేసిన న్యూజిలాండ్



సీఫెర్ట్, ఫిలిప్స్ మెరుపులు..

న్యూజిలాండ్ తో ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను భారత్ ఓటమితో ముగించింది. హామిల్టన్ వేదికగా జరిగిన ఐదో టీ20లో కివీస్ చేతిలో 7 వికెట్ల తేడాతో టీమిండియా పరాజయం పాలైంది. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది.

భారత ఇన్నింగ్స్ లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50), వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (61) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో పేసర్ ఆడమ్ మిల్నే 4 వికెట్లు పడగొట్టగా.. నాథన్ స్మిత్, బ్లెయిర్ టిక్నెర్ తలా 2 వికెట్లు సాధించారు.

సీఫెర్ట్, ఫిలిప్స్ విధ్వంసం

అనంతరం 192 పరుగుల భారీ లక్ష్యాన్ని కివీస్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 17.2 ఓవర్లలో చేధించింది. కివీస్ ఇన్నింగ్స్ ఆరంభంలోనే డేంజరస్ బ్యాటర్ ఫిన్ అలెన్ ను అర్షీప్ అద్భుతమైన బంతితో కోల్తా కొట్టించాడు. ఆ తర్వాత అర్షీప్ బౌలింగ్ లోనే మరో కివీస్ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ ఇచ్చిన ఈజీ క్యాచ్ ను జారవిడిచింది. ఇందుకు భారత జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది.

13 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న సీఫెర్ట్.. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 50 బంతుల్లోనే 11 ఫోర్లు, 5 సిక్స్ లతో 93 పరుగులు చేసి మ్యాచ్ ను భారత్ నుంచి లాగేసుకున్నాడు. అతడితో పాటు గ్లెన్ ఫిలిప్స్(38 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్ లతో 65) మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు.

భారత బౌలర్లలో అర్ష్ దీప్ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, వరుణ్ చక్రవర్తి తలా వికెట్ సాధించారు. అయితే తొలి మూడు టీ20ల్లో భారత్ విజయం సాధించడంతో ఐదు మ్యాచ్ ల సిరీస్ ను 3-2 తేడాతో సొంతం చేసుకుంది.



హైలో ఓపెన్ వి జేతగా పీవీ సింధు..

భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మరోసారి సత్తా చాటింది. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్-2026 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్ ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ లో డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ కేజర్స్ ఫెల్ పై ఘన విజయం సాధించింది. వరుస గేముల్లో 21-12, 21-14 స్కోరుతో ప్రత్యర్థిని ఓడించింది. ఈ విజయంతో సింధు ఖాతాలో ఈ ఏడాది రెండో టైటిల్ చేరింది. అంతకుముందు జులైలో జరిగిన జపాన్ ఓపెన్ లోనూ ఆమె విజేతగా నిలవడం తెలిసిందే.

అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్ఇండియా మరో రికార్డు




అంతర్జాతీయ టీ20లో ఒకే క్యాలండర్ ఇయర్ లో 400 సిక్స్ లు బాదిన తొలి టీమ్ గా భారత్ ఘనత సాధించింది. 40 టీ20 మ్యాచ్ ల్లో భారత్ 400 సిక్సు కొట్టింది. ఆస్ట్రేలియా 24 మ్యాచ్ ల్లో 224 సిక్స్ లు, విండీస్ 21 మ్యాచ్లో 224 సిక్స్ లు బాది తరువాత రెండు,మూడు స్థానాల్లో ఉన్నాయి.ఇందులో భారత్ తరపున అభిషేక్ శర్మ 86 సిక్స్ లతో మొదటి స్థానంలో ఉండగా ఇషాన్ కిషన్ 60, సంజు శాంసన్ 50 సిక్స్ లతో తరువాత స్థానాల్లో ఉన్నారు.

మోక్షజ్ఞ డెబ్యూ మూవీలో ఇద్దరు బాలీవుడ్ భామలు?



నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోక్షజ్ఞ డెబ్యూ మూవీపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో మోక్షజ్ఞ తన మొదటి సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే వచ్చిన అధికారిక ప్రకటనతో ఈ ప్రాజెక్ట్ పై ప్రేక్షకుల్లో విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన వార్త తెగ వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజోల్ ను తీసుకోబోతున్నట్లు సమాచారం. అంతేకాకుండా, మోక్షజ్ఞ సరసన హీరోయిన్ గాబాలీవుడ్ భామ రాషా తడానీ నటించనుందని సమాచారం.భారీ సోషియో-ఫాంటసీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో హై-లెవెల్ విఎఫ్ఎక్స్ హంగులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు తెలుస్తోంది.



'సీన్' డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమా..

ఈఏడాది ఇప్పటికే కరుప్పు(వీరభద్రుడు), విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలతో హిట్స్ అందుకున్న సూర్య.. నెలల గ్యాప్ లోనే మరొకటి రెడీ చేశాడు. అదే 'సీన్'. ఈ శుక్రవారమే(నవంబర్ 06) థియేటర్లలోకి రానుంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. 'సీన్' ట్రైలర్ కాస్త వెరైటీగా ఉంది. ఓ కేసు విషయమై తన ఉద్యోగానికి రాజీనామా చేసే హీరో, అతడి దగ్గర పనిమనిషిగా చేరిన హీరోయిన్.. వీళ్లు కాకుండా ఓ సైకో కిల్లర్. అసలు వీళ్ల ముగ్గురికి కనెక్షన్ ఏంటి? అనేది ఈ హైపర్ యాక్టివ్ ఎంటర్ టైనర్ చూసి తెలుసుకోవాలి. జీతూ మాధవన్ దర్శకుడు కాగా సుశీన్ శ్యామ్ సంగీతమందించాడు. జ్యోతిక-సూర్యనే నిర్మించారు. ఇకపోతే ఈ సినిమా 06న రిలీజ్ కానుండగా.. అదే తేదీన నయనతార మూకుతి అమ్మన్ 2 (తెలుగులో 'మహాశక్తి') రానుంది. వీటికి ఒకరోజు ముందు 'రామాయణ'.. ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ డబ్బింగులకు తోడుగా తెలుగులో 'సమ్మర్ హాలీడేస్' అనే చిత్రం ప్రేక్షకులని పలకరించనుంది.

చిరంజీవి క్లాప్‌తో అట్టహాసంగా ప్రారంభమైన

సుకుమార్-రామ్ చరణ్ సినిమా

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించిన 'రంగస్థలం' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఆఆ17'. మెగా ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న.. పూజా కార్యక్రమాలు నేడు సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా క్లాప్ కొట్టి ఈ క్రేజీ ప్రాజెక్ట్ను లాంఛనంగా ప్రారంభించారు.



ఆఆ17 ప్రయాణం 'మెగా క్లాప్'తో మొదలైందంటూ మేకర్స్ ఓ వీడియోను కూడా షేర్ చేశారు. అయితే ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా అత్యుత్తమ నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నాయి. పూజా కార్యక్రమాలు పూర్తి కావడంతో, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలుకానుంది. అయితే చిత్రంలో రామ్ చరణ్ సరసన నటించే హీరోయిన్ ఎవరనే దానిపై మేకర్స్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయకుండా సస్పెన్స్ మెయింటైన్ చేస్తున్నారు. దీంతో ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది.

డ్రీమ్ రోల్ కోసం ఇంట్లో కూర్చోలేను

– మానుషి చిల్లర్

చిన్న వయసులోనే 'మిస్ వరల్డ్' కిరీటాన్ని గెలుచుకుని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ మానుషి చిల్లర్. ప్రస్తుతం ఈ అమ్మడు బాలీవుడ్ లో నటిగా, ఫ్యాషన్ ఐకాన్ గా, ఎంటర్ ప్రెన్యూర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ ను రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినీ కెరీర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సినీ పరిశ్రమలో తాను నేర్చుకున్న పాఠాల గురించి మాట్లాడుతూ.. ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చినప్పుడు అందరి సలహాలు వినేదాన్ని, కానీ అనుభవం పెరిగే కొద్దీ సొంత నిర్ణయాలు తీసుకోవడమే ఎక్కువ సంతోషాన్ని ఇస్తుందని మానుషి తెలిపింది.

వెనకల ఎలాంటి సినిమా బ్యాక్ గ్రౌండ్ లేనప్పుడు మన కోసం ప్రత్యేకంగా రోల్స్ రాసేవారు ఉండరని, అందుకే ప ర్ఫెక్ట్ డ్రీమ్ రోల్ కోసం ఇంట్లో కూర్చుని ఎదురుచూడటం కంటే, మనల్ని ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఉపయోగించుకోవడమే తెలివైన పని అని స్పష్టం చేసింది. అలాగే మిస్ వరల్ విజయం అందించిన ఆర్థిక స్వేచ్ఛ వల్ల నటనపై ఎలాంటి ప్రెజర్ లేకుండా స్వేచ్ఛగా సినిమాలు ఎంచుకోగలుగుతున్నానని వివరించింది. ఇక విక్రాంత్ మస్సేతో కలిసి నటించిన తన రాబోయే రొమాంటిక్ థ్రిల్లర్ 'స్నాప్' గురించి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ కోసం తాను చాలా ఉత్సాహంగా ఉన్నానని తెలిపింది. ముంబైలో తాను విన్న అత్యంత ఆసక్తికరమైన స్క్రిప్ట్ లలో ఇది ఒకటని, చివరి నిమిషం వరకు సస్పెన్స్ కొనసాగుతూ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందని ఆమె చెప్పుకొచ్చింది.




లవ్ బ్రేకప్‌పై రెజీన షాకింగ్ కామెంట్స్



ప్రేమ, నమ్మకద్రోహం అండ్ మానసిక వేదన గురించి తాజా ఇంటర్వ్యూలో హీరోయిన్ రెజీనా కసాండ్రా చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి. ఆమె నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మూకుత్తి అమ్మన్-2'. నయనతార అమ్మవారుగా, సుందర్ సి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రిలీజ్ కు ఉండగా.. వరుస ప్రమోషన్స్లో పాల్గొంటున్నారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటి రెజీనాకసాండ్రా.. తన వ్యక్తిగత జీవితం, బాధాకరమైన బంధం, తన అనుభవాల గురించి బహిరంగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా తన గత ప్రేమబంధం 2020లో ముగిసిందని రెజీనా వెల్లడించారు. ఆ సమయంలో తాను తీవ్రమైన నమ్మకద్రోహానికి గురయ్యానని, అది తనను మానసికంగా పూర్తిగా కుంగదీసిందని ఆమె పేర్కొన్నారు. ఆ బాధ నుంచి కోలుకునే క్రమంలో తాను ఎంతో తీవ్రమైన మానసిక సంఘర్షణ ఎదుర్కొన్నట్లు వివరించింది. ఆ కష్టకాలం తర్వాత, కొంతకాలం పాటు ప్రేమబంధాలకు దూరంగా ఉండి, తనపై తాను దృష్టి పెట్టాలని రెజీనా నిర్ణయించుకున్నట్లు తెలిపిన ఈమె.. ఇప్పుడు తన పూర్తి దృష్టి మొత్తం సినిమాలపైనే ఉందని చెప్పుకొచ్చింది.

రానా నిర్మాణంలో రవిబాబు కంగనా రనౌత్ హారర్ మూవీ



టాలీవుడ్ స్టార్ రానా దగ్గుబాటి ఒక క్రేజీ స్పుజ్ అనౌన్స్మెంట్ ఇచ్చారు. డిఫరెంట్, హారర్ సినిమాలతో పేరుగాంచిన తెలుగు నటుడు, దర్శకుడు రవిబాబు దర్శకత్వంలో తాను 'స్కేరీ పిక్చర్' అనే హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించనున్నట్లు తెలిపారు. ఇక ఈ విషయాన్ని కంగనా రనౌత్ స్వయంగా తన ఇన్ స్టా గ్రామ్ ద్వారా అధికారికంగా వెల్లడించింది. హారర్కాన్ ఈవెంట్ లో రానా మాట్లాడిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



తెలుగులో ఎన్నో విజయవంతమైన హారర్ సినిమాలను అందించిన రవిబాబుకి హిందీలో ఇది తొలి చిత్రమని రానా తెలిపారు. ఈ వేదికపైనే సినిమా టైటిల్ ను మొదటిసారిగా రివీల్ చేస్తున్నామని, హిందీ మీడియాకు కూడా ఈ సమాచారం ముందుగా ఇవ్వలేదని రానా పేర్కొన్నారు. రానా దగ్గుబాటి ప్రొడక్షన్ వాల్యూస్, రవిబాబు మేకింగ్ స్టైల్, కంగనా రనౌత్ పవర్ఫుల్ పెర్ఫార్మెన్స్ కాంబినేషన్ లో రాబోతున్న ఈ 'స్కేరీ పిక్చర్' బాలీవుడ్ తో పాటు సౌత్ ఆడియన్స్లోనూ భారీ అంచనాలను పెంచేసింది.

మనం Manam Nalgonda నల్గొండ

నిరాశ్రయులకు ఉచిత వైద్య శిబిరం



సూర్యాపేట, నవంబర్ 01 (మనం ప్రతినిధి): ఆదరణకు గురైన నిరాశ్రయులను గుర్తించి వారి అనారోగ్య సమస్యలను నివారించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 42వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున అన్నారు. ఆదివారం వార్డులోని నిరశ్రయుల కేంద్రంలో ఓం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అతుల్ రాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... నిరాశ్రయుల కేంద్రంలో నిరశ్రయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని బాత్రూం, వంటగదుల్లో బండలు పగిలాయన్నారు. అలాగే వర్షం వస్తే భవనం నీరు కారడంతో పాటు కిటికీలకు అద్దాలు కూడా సరిగా లేక పోవడంతో దోమల బారిన పడుతున్నారని అన్నారు. దీంతో వారు అనేక రకాల వ్యాధులకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమీషనర్ వెంటనే స్పందించి నిరాశ్రయుల కేంద్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 70మంది నిరాశ్రయులకు రక్త, బిపి, షుగర్, కామెర్లు, జ్వరం, ఒంటి నొప్పులు, గజ్జి తామర, గ్యాస్ సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సయోద్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ సంస్థ మేనేజర్ అనపర్తి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, రుద్రంగి రవి, మేనేజర్ సూరం రేణుక పాల్గొన్నారు.

బీఆర్ఏఓయూ ద్వారా ఉన్నత విద్యకు విస్తృత అవకాశాలు

- డాక్టర్ బి. ధర్మ నాయక్
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందించే నూతన కోర్సులు
- విద్యార్థులు బోధనా తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలి



నల్లగొండ, నవంబర్ 1(మనం ప్రతినిధి): దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ) ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఎక్స్టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ అన్నారు. విద్యార్థుల అవసరాలు, ప్రస్తుత ఉద్యోగ, ఉపాధి రంగాల డిమాండ్ కు అనుగుణంగా యూనివర్సిటీలో నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఆదివారం నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల కోసం నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో డాక్టర్ బి. ధర్మ నాయక్ పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి బాధ్యతలు స్వీకరించిన అనంతరం దూరవిద్యా విధానంలో అనేక మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు బోధనా విధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఏఓయూ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, అడ్మిషన్ల పరంగా అత్యధిక సంఖ్యలో విద్యార్థులు చేరడం సంతోషకరమని అన్నారు. దూరవిద్యను అభ్యసించే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రతి ఆదివారం నిర్వహించే బోధనా తరగతులకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, అధ్యాపకులు అందించే సూచనలు, సలహాలను పాటిస్తూ పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా అభ్యసించాలని కోరారు. తరగతులకు హాజరవుతూ సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

దూరవిద్యను కేవలం డిగ్రీలు పొందే మార్గంగా కాకుండా, వ్యక్తిగత అభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు ఒక చక్కని వేదికగా విద్యార్థులు ఉపయోగించుకోవాలని డాక్టర్ ధర్మ నాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్, మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ భూక్యా వీరన్న, కౌన్సిలర్లు కృష్ణ రెడ్డి, మహేశ్వరీ, పద్మ హరిత, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు పెట్టని గెజిటెడ్ అధికారులు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవడంలో గెజిటెడ్ సంతకంతో ఇబ్బందులు

గ్రాడ్యుయేట్స్ గెస్టెడ్ సైన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడి కాపులు

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటు అప్లై చేయాలంటే రెండు రోజులు పని మానుకోవాల్సిందే


కోదాడ,నవంబర్ 011(మనం న్యూస్): ఫాం-18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ,లేదా దానికి సమానమైన డిప్లమా పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.చివరి తేదీ నవంబర్ 06 అభ్యర్థి కచ్చితంగా వరంగల్,ఖమ్మం,నల్గొండ పరిధిలోని పౌరుడై ఉండాలి.

కావలసిన సర్టిఫికెట్లు...

ఓటర్ ఐడి కార్డు (ఈపిఐసి), ఆధార్ కార్డు, డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నంబర్ తో ఆన్ లైన్ లో అప్లయ్ చేసుకోవాలి. అప్లై చేసుకున్న తర్వాత సంతకాల కోసం గ్రాడ్యుయేట్స్ పడికాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడదని గ్రాడ్యుయేట్స్ వాపోతున్నారు. ఎమ్మెల్సీ ఓటుకు అప్లై చేయాలంటే రెండు రోజులు పని మానుకోవలసిన పరిస్థితి ఏర్పడదని పలువురు వాపోయారు.

తహసిల్దారుని వివరణ అడగగా...

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్నాక సంబంధిత పత్రాలపై గెజిటెడ్ సంతకం కొరకు ఎక్కడికి వెళ్ళనవసరం లేదు.



సంబంధిత పత్రాల ఒరిజినల్సు తీసుకోని వచ్చి మా కార్యాలయంలో చూయించి గెజిటెడ్ సంతకం పెట్టించుకోని కార్యాలయంలో సమర్పించవచ్చని అన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిందే



సూర్యాపేట టౌన్, నవంబర్ 01 మనం న్యూస్: మారుతున్న జీవన శైలితో పాటు ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లుతో పాటు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ప్రముఖ వైద్యులు ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఇటీవల హృద్రోగంతో ఆకస్మికంగా మృతి చెందిన వెలుగు కరుణాకర్ జ్ఞాపకార్థం ఆర్వీ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో ఉచిత గుండె సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు ఈసీజీ, టూడీ ఇకో పరీక్షలను ఉచితంగా షటిల్ క్రీడాకారులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, ప్రజల కొరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... గుండె సంబంధిత పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదనీ తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. జంక్ ఫుడ్ ను తీసుకోకూడదని, వీలైనంత వరకు ఇంటి ఆహారమే తీసుకోవాలన్నారు. అనంతరం గుండె వైద్య నిపుణులు డా. అలక ప్రేమ్ కుమార్ క్రీడాకారులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిపై తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు రమేష్ నాయక్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యకులు నల్లకుంట్ల అయోధ్య, కొమ్మల వెంకన్న, డాక్టర్ భట్టు గోపి, బండారు రాజా, సిహెచ్ లింగయ్య, ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతా జగన్ వల్లే

- శాంతిభద్రతలకు కారణం ఆయనే
- ఎన్నికల ఘర్షణలకు జగనే కారణమని ఆరోపణ
- గత ఏకగ్రీవాలపై జగన్‌కు ప్రశ్నలు
- ఏపీ మంత్రి లోకేశ్



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, స్థానిక ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా జరుగుతుంటే, ఒక్క పులివెందులలో మాత్రమే గొడవలు జరగడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డే ప్రధాన కారణమని ఆరోపించారు. పులివెందులలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అక్రమాలు జరిగిపోతున్నాయంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ఆరోపణలను మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు.. ప్రతిపక్షాల భాగస్వామ్యం లేకుండా అప్పట్లో ఎన్నికలు ఎలా జరిగాయో వివరించాలని సూటిగా ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పులివెందులలో వైఎస్సార్సీపీ ఏకగ్రీవ విజయాలను ఎలా సాధించిందో చెప్పాలని ఆయన సవాలు విసిరారు. ఎన్నికల సమయంలో రాష్ట్రం జరిగిన ఘటనలకు జగనే బాధ్యత వహించాలని వెల్లడించారు. పులివెందులలో చోటుచేసుకున్న ఘర్షణలు, రాజకీయ ఉద్రిక్తతలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ వ్యవహారశైలి వల్లే అక్కడ శాంతిభద్రతల సమస్య తలెత్తుతోందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తోందని, ఎవరూ నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం లేదని లోకేశ్ స్పష్టం చేశారు. నామినేషన్లు దాఖలు చేయాలనుకునే అభ్యర్థులకు పోలీసు రక్షణ కూడా కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. వైఎస్సార్సీపీ నాయకులే శాంతిభద్రతల సమస్యలను సృష్టిస్తున్నారని, వాహనాలకు నిప్పు పెట్టడం, ప్రజలపై దాడులు చేయడం వంటి పనులు చేసి, ఆ నిందను టీడీపీపై వేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్ఛాపురం నుండి కుప్పం వరకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుంటే, కేవలం పులివెందులలోనే ఎందుకు ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని లోకేశ్ ప్రశ్నించారు. బెంగళూరు నుండి వచ్చి గొడవలు సృష్టించి, ఆపై తానే బాధితుడినని చెప్పుకుంటూ జాతీయ మీడియా ముందు జగన్ నాటకాలు ఆడుతున్నారని లోకేష్ విమర్శించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ, అనుమతించిన పరిమితులకు మించి రోడ్షోలు నిర్వహించి, ప్రజలతో మాట్లాడటం ద్వారా జగన్ నిబంధనలను అతిక్రమించారని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద వినతిపత్రం సమర్పించేందుకు జగన్కు అవకాశం కల్పించినప్పటికీ, ఆయన ఆ అవకాశాన్ని ఉపయోగించుకోలేదని లోకేశ్ పేర్కొన్నారు. గతంలో వైఎస్సార్సీపీ హయాంలో ఏకగ్రీవ విజయాల సమయంలో ప్రజాస్వామ్యం అస్సలు లేదని, కానీ ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

పల్నాటియుద్ధం.. అనేకప్రాంతాల్లో పరస్పరం దాడులు

- స్వల్ప లాఠీ ఛార్జి
- ఎవరి వాదనలు వారివే
- పోలీస్ పహారాలోనే ఉద్రిక్త ప్రాంతాలు
- వైసీపీ నేతల హౌస్ అరెస్ట్ లు

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః ఆంధ్రప్రదేశ్లోని పల్నాడు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనేక ప్రాంతాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద బాహాబాహీకి దిగడంతో సామాన్య ఓటర్లు భయభ్రాంతులకు లోనవుతున్నారు. మాచర్ల, వినుకొండ, గురజాల వంటి చోట టెన్షన్ వాతావరణం నెలకొంది. కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటుండటంతో పోలీసులు ఇరువర్గాలను స్వల్ప లాఠీ ఛార్జి చేసి చెదరగొట్టేందుకు ప్రయత్నించారు.

దొంగ ఓట్లు నమోదువుతున్నాయని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. తమ పార్టీ ఏజెంట్ల ను కూడా బయటకు తరిమి కొడుతున్నారని, పోలీసులు చోద్యం చూస్తున్నారని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే టీడీపీ నేతల వాదన మరోలా ఉంది. గతంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగేవి కావని, ప్రస్తుతం ఎన్నికలు స్వేచ్ఛయుత వాతావరణం జరిపించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే వైసీపీ నేతలే అరాచకాలు సృష్టిస్తూ బీభత్సం సృష్టిస్తున్నారంటున్నారు. ఇలా ఎవరికి వారే తమ వాదనలు వినిపిస్తున్నా పోలింగ్ కేంద్రాల వద్ద మాత్రం ప్రశాంత వాతావరణం లేదు.

వైసీపీ నేతల హౌస్ అరెస్టలు ...

మరోవైపు వైసీపీ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు తదితర ప్రముఖ వైఎస్సార్సీపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల బైండోవర్ కేసులు కూడా నమోదు చేశారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా పలువురు వైసీపీ నేతలను బైండోవర్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద హైఅలర్ట్ ప్రకటించారు. మాచర్ల, వినుకొండ మున్సిపాలిటీల్లో తీవ్రమైన ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసులు భారీగా మోహరించారు.

లోపాన్ని గుర్తించి.. సత్వరమే సరిదిద్ది

- విజయవాడ 55వ వార్డులో విజయవంతంగా ముగిసిన పోలింగ్
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చొరవతో అప్రమత్తమైన యంత్రాంగం



విజయవాడ,నవంబర్,1,(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7.00 గంటలకు పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రారంభమై ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ) పరిధిలోని 86 వార్డుల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే 55వ వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లలో ఎన్నికల గుర్తులు తారుమారైనట్లు గుర్తించారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ దృష్టికి వచ్చిన వెంటనే ఆయన తక్షణమే స్పందించి, సంబంధిత ఎన్నికల అధికారులను అప్రమత్తం చేశారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడేలా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 55వ వార్డుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను తిరిగి ముద్రించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టి, కొద్ది గంటల్లోనే పూర్తి చేశారు. అనంతరం సరిచేసిన బ్యాలెట్ పేపర్లతో 55వ వార్డులో పోలింగ్ ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. పోలింగ్లో ఏర్పడిన అంతరాయాన్ని అధిగమించి, ఓటర్లందరికీ తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపారు. ఈ మేరకు 55వ వార్డులో ఓటర్లు రాత్రి 7.30 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తూ చర్యలు తీసుకున్నారు.

సమస్యను గుర్తించిన వెంటనే జిల్లా కలెక్టర్ అప్రమత్తమై, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల తక్కువ సమయంలోనే బ్యాలెట్ పేపర్ల పునర్ముద్రణ పూర్తి చేసి పోలింగ్ను తిరిగి ప్రారంభించడం సాధ్యమైంది. దీంతో 55వ వార్డులో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

ఎన్నికల నిర్వహణలో తలెత్తిన సమస్యను సత్వరమే పరిష్కరించి, ఓటర్ల ఓటు హక్కుకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టడం ద్వారా జిల్లా ఎన్నికల యంత్రాంగం ఎన్నికల ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు కృషి చేసింది.

పోలింగ్ సామగ్రి స్వీకరణలో నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి



- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

పెడన, నవంబరు 1,(మనం న్యూస్): రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా పెడన పురపాలక సంఘానికి నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, సెయింట్ విన్సెంట్ పల్లోట్టి హైస్కూల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ డీకే బాలాజీ మరియు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ ఆదివారం సందర్శించి, పోలింగ్ సామగ్రి స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రిసెప్షన్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగించుకొని పోలింగ్ అధికారులు బ్యాలెట్ బాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రిని రిసెప్షన్ కేంద్రానికి తీసుకువచ్చే సమయంలో త్వరగా అప్పగించి వెళ్లాలనే ఆత్రుతలో ఉంటారని, అయితే అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపడకుండా ప్రతి అంశాన్ని అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ అధికారుల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర సామగ్రిని స్వీకరించే ముందు వాటి వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాలని, ప్రతి కవరు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ను పరిశీలించిన కలెక్టర్, అక్కడ ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్లు భద్రపరిచిన నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్ను తెరిచే ప్రక్రియను సంబంధిత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలోనే నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని నిర్దేశిత విధానంలో స్ట్రాంగ్ రూమ్లో భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ఇన్చార్జితో మాట్లాడుతూ, ముందుగా రూపొందించిన లేఅవుట్ ప్రకారం ప్రతి బ్యాలెట్ బాక్స్ను నిర్దేశించిన ప్రదేశంలోనే ఉంచాలని, బ్యాలెట్ బాక్సుల అమరిక, భద్రత, పర్యవేక్షణ తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు), మున్సిపల్ కమిషనర్ మరియు ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు నిందితుడిపై పోలీసుల కాల్పులు

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః రాప్తాడు కేసులో నిందితుడిగా ఉన్న హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో హేమంత్ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అతడిని పట్టుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో నిందితుడు పోలీసులపై తిరగబడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు అతడిపై కాల్పులు జరిపారు. రాప్తాడు ఘటనకు సంబంధించి నిందితుడు హేమంత్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అతడు ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని హేమంత్ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులను ప్రతిఘటిస్తూ హేమంత్ తిరగబడినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు అతడిపై కాల్పులు జరిపారు. మొత్తం ఆరు రౌండ్ల కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో హేమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. హేమంత్ పోలీసులపై తిరగబడటానికి గల కారణాలు, కాల్పులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసుల అధికారిక ప్రకటన వెలువడితే ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది

ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



- జిల్లా కలెక్టర్ధ్ బోర్ధడే హేమంత్ సహదేవరావు
- జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం.

ములుగు, నవంబర్01, మనం ప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ములుగు ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహించాలని ఈ ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అయోడిన్ వినియోగంపై మహిళలకు ఏఎస్ఐపీ అవగాహన కార్యక్రమం

- 32 జిల్లాల్లో రెండేళ్ల పాటు
- ఏఎస్ఐపీ కమ్యూనిటీ ప్రోగ్రామ్

మహబూబ్ నగర్,నవంబర్,1,(మనం న్యూస్): అయోడిన్ ఆరోగ్యానికి ముఖ్యమని తెలుసుకోవడం ఒక విషయం, ఇంట్లో సరైన అయోడిన్ కలిగిన ఉప్పును ఎలా గుర్తించాలి, ఎలా నిల్వ చేయాలి, ఎలా ఉపయోగించాలి అనే విషయాలపై ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రామ్ (ఏఎస్ఐపీ) రెండేళ్ల పాటు విజయవంతంగా నిర్వహించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 32 జిల్లాల్లో 13 లక్షలకు పైగా మహిళలు, యువతులను చేరుకున్న ఈ రెండేళ్ల కమ్యూనిటీ కార్యక్రమం, పోషకాహార అవగాహనను ఒకసారి చెప్పడంతో ఆపకుండా పాఠశాలలు, కుటుంబాలు, సమాజాల్లో నిరంతరంగా కొనసాగిస్తే ఎలాంటి మార్పు తీసుకురావచ్చో చూపించిందన్నారు. ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రామ్ (ఏఎస్ఐపీ) 2025-26 తుది అధ్యయనంలో మొత్తం అవగాహన స్కోరు 37 శాతం పాయింట్లు పెరగగా, అయోడిన్కు సంబంధించిన ప్రాథమిక అవగాహనలో 26 శాతం పాయింట్ల మెరుగుదల నమోదైంది. అని చెప్పారు. ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ విభాగ బిజినెస్ యూనిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అనుజ్ రుస్తగి మాట్లాడుతూ: ప్రజారోగ్యానికి సంబంధించిన సవాళ్లను నిరంతరమైన, సమాజ ఆధారిత కార్యక్రమాల ద్వారా పరిష్కరించాలనే మా నిబద్ధతను ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రామ్ ప్రతిబింబిస్తుందన్నారు. శాస్త్రీయ సమాచారాన్ని సులభమైన సందేశాల రూపంలో, స్థానిక ప్రజలకు అర్థమయ్యే విధంగా అందించినప్పుడు అది అవగాహనను పెంచడమే కాకుండా, కుటుంబాలు సరైన పద్ధతులను పాటించేలా ప్రోత్సహిస్తుందని తుది అధ్యయనం చూపిస్తోంది అని చెప్పారు. మహిళలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫ్రంట్లైన్ వర్కర్లు ఈ సందేశాలను సమాజంలో మరింత లోతుగా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. కార్యక్రమం తుది అధ్యయనంలో అవగాహన స్కోర్లలో గణాంకపరంగా గణనీయమైన మెరుగుదల కనిపించింది.

నిరంతర అవగాహన కార్యక్రమాలు, ప్రత్యక్ష ప్రదర్శనలు, స్థానికంగా సులభంగా అర్థమయ్యే సమాచారంతో ఈ మార్పు సాధ్యమైనట్లు విడుదల పేర్కొందన్నారు. ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ శంతను మాట్లాడుతూ అయోడిన్ లోపం ఎదుగుదల, మేధో వికాసంపై తిరిగి సరిచేయలేని ప్రభావాలను కలిగించవచ్చు. ముఖ్యంగా గర్భధారణ సమయంలో, చిన్నపిల్లల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే అయోడైజ్డ్ ఉప్పు ప్రాముఖ్యతను చెప్పడమే కాకుండా, దాన్ని ఎలా గుర్తించాలి, ఎలా నిల్వ చేయాలి, వంటలో ఎలా సరిగ్గా ఉపయోగించాలి అనే విషయాలను కూడా కుటుంబాలకు తెలియజేయాలి. పద్ధతిగా చేపట్టే కమ్యూనిటీ కార్యక్రమాలు ఈ అవగాహనను పెంచడంలో ఎలా సహాయపడతాయో ఈ ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నాయన్నారు.

పబ్లిక్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎక్స్పర్ట్ డాక్టర్ రంజన్ శంకర్ మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో సరైన స్థాయిలో అయోడిన్ వినియోగం ఇప్పటికీ తక్కువగా ఉందని పేర్కొన్నారు.

ఉప్పును తక్కువగా తీసుకోవాలని, అయితే తీసుకునే ఉప్పు అయోడైజ్డ్ అయి ఉండాలని సూచిస్తూ రోజుకు గరిష్టంగా 5 గ్రాముల వరకు ఉప్పు తీసుకోవాలని చెప్పారు. ఏఎస్ఐపీ, ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్తో కలిసి నిర్వహించిన బిల్డింగ్ స్ట్రాంగర్ మైండ్స్ అండ్ హెల్త్ కమ్యూనిటీస్ విత్ అయోడైజ్డ్ సాల్ట్ వెబినార్లో ఈ ఫలితాలను వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో అయోడిన్ సభలు, వీధి నాటకాలు, పాఠశాల కార్యక్రమాలు, కమ్యూనిటీ ప్రదర్శనలు నిర్వహించారు. అయోడిన్ సభల్లో 10 లక్షలకు పైగా మంది పాల్గొనగా, వీధి నాటకాల ద్వారా 3.22 లక్షలకు పైగా మందిని చేరుకున్నారు. వినియోగదారులతో నేరుగా మాట్లాడటంతో పాటు, అయోడిన్కు సంబంధించిన సందేశాలను మరింత మందికి చేరవేసేందుకు 1,712 మంది ఫ్రంట్లైన్ వర్కర్లు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన 178 మంది పాఠశాల ఉపాధ్యాయుల్లో 92 శాతం మంది, కార్యక్రమం అనంతరం అయోడిన్, దాని వనరులు, ప్రయోజనాలపై సరైన అవగాహన చూపించారు.



నా పేరు పరిటాల శ్రీరామ్.. నల్లచెరువు అభివృద్ధికి నేనున్నా..!

- పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు..!
- కే.పూలకుంటలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం..!
- మంగళహారతులతో టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం.. మండల అభివృద్ధే లక్ష్యంగా రాజకీయ అడుగులు..!

నల్లచెరువు నవంబర్ 01 మనం న్యూస్: నా పేరు పరిటాల శ్రీరామ్.. పరిటాల రవీంద్ర తనయుడిగా, పరిటాల సునీతమ్మ కుమారుడిగా మాత్రమే కాదు.. నల్లచెరువు ప్రజల అభిమానం పొందే నాయకుడిగా మీ ముందుకు వచ్చాను. మీ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, మీ సమస్యలకు పరిష్కారం చూపడం, మన మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం నా లక్ష్యం అనే రాజకీయ సందేశంతో నల్లచెరువు జడ్పీటీసీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్ మండలంలో తన ప్రచారాన్ని ప్రారంభించారు.మొదట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాలపాటి దిన్నె ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, కే.పూలకుంట గ్రామంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి వెళ్లే దారిపొడవునా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళహారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం, నాయకుల ఆత్మీయ పలకరింపుల మధ్య సాగిన ఈ పర్యటన మండల రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

రాజకీయ వారసత్వం.. ప్రజాసేవే లక్ష్యం..!

తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన పరిటాల కుటుంబం నుంచి వచ్చిన శ్రీరామ్కు రాజకీయ నేపథ్యం బలంగా ఉంది. దివంగత పరిటాల రవీంద్ర వారసుడిగా, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత కుమారుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగుతోంది. 2019లో రాప్తాడు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన, అనంతరం ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.ఇప్పుడు నల్లచెరువు జడ్పీటీసీ స్థానం నుంచి బరిలోకి దిగడంతో ఆయన రాజకీయ ప్రయాణం మరో కీలక మలుపు తిరిగింది.

తన కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని ప్రజలకు పరిచయం చేస్తూనే, స్థానిక సమస్యలపై దృష్టి సారించి మండల అభివృద్ధికి కృషి చేస్తాననే భరోసా కల్పించడం ఆయన ప్రచారంలో ప్రధాన అంశంగా మారింది.

నల్లచెరువుకు జిల్లా స్థాయిలో బలమైన గొంతుక కావాలి..!

జడ్పీటీసీ ఎన్నికలు కేవలం ఒక అభ్యర్థి గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదు.. మండలంలోని గ్రామాల సమస్యలను జిల్లా పరిషత్ స్థాయిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశమని టీడీపీ శ్రేణులు ప్రచారంలో వివరిస్తున్నాయి.నల్లచెరువు మండలానికి సాగునీటి సమస్యలు, గ్రామీణ రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి అంశాల్లో అవసరమైన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడం, మంజూరైన అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా పర్యవేక్షించడం వంటి అంశాలను తన కార్యాచరణలో భాగంగా తీసుకోవాలనే సందేశాన్ని ఆయన ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

పదవి కోసం కాదు.. ప్రజల పక్షాన నిలిచేందుకు పోటీ..!

నల్లచెరువు ప్రజలకు నా నమస్కారం. నేను మీ ముందుకు ఒక అభ్యర్థిగా మాత్రమే రాలేదు.. మీ సమస్యలను తెలుసుకోవడానికి, మీ ఆకాంక్షలను అర్థం చేసుకోవడానికి, మీకు అందుబాటులో ఉండే నాయకుడిగా నిలవాలనే సంకల్పంతో వచ్చానని పేర్కొన్నారు. పరిటాల రవీంద్ర గారి రాజకీయ వారసత్వం నాకు బాధ్యతను గుర్తుచేస్తుందని తెలిపారు.పరిటాల సునీతమ్మ ప్రజాజీవితం నాకు ప్రజలతో ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తుందన్నారు. ఆ రాజకీయ నేపథ్యాన్ని గౌరవిస్తూ, నా పని ద్వారా మీ ఆదరాభిమానాలను సంపాదించుకోవాలనుకుంటున్నానన్నారు. మన నల్లచెరువు మండలంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందాలని రహదారుల సమస్యలు పరిష్కారం కావాలని. తాగునీటి ఇబ్బందులు తగ్గాలని రైతులకు అవసరమైన సదుపాయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని,విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడాలనే సంకల్పంతో మీ ముందుకొచ్చానని తెలిపారు.గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని జిల్లా పరిషత్ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలపై నిరంతరం ప్రయత్నిస్తానని ఏ పని ఎక్కడ ఆగిపోయింది? ఎందుకు ఆలస్యమవుతోంది? ప్రజలకు అందాల్సిన ప్రయోజనం ఎందుకు అందడం లేదు? అనే అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలనుకుంటున్నానన్నారు. మీరు నాపై ఉంచే నమ్మకమే నా బలం. మీ సమస్యలను నా సమస్యలుగా భావించి ముందుకు సాగడమే నా లక్ష్యం. మన మండల అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని కోరారు.

కుటుంబ నేపథ్యం ఒకవైపు.. ప్రజల తీర్పు మరోవైపు..!

పరిటాల కుటుంబానికి ఉన్న రాజకీయ గుర్తింపు శ్రీరామ్కు ప్రచారంలో ఒక ముఖ్యమైన బలం కావచ్చు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థి ప్రజలకు ఎంత చేరువయ్యారు? గ్రామాల సమస్యలపై ఆయనకు ఎంత అవగాహన ఉంది? ఎన్నికల అనంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారా? అభివృద్ధి పనుల కోసం ఎంతవరకు ప్రయత్నిస్తారు? అనే అంశాలు కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశముంది.

ఈ నేపథ్యంలో నల్లచెరువు నుంచి జడ్పీటీసీగా ఎన్నికైతే మండల సమస్యలను జిల్లా స్థాయిలో బలంగా వినిపించే అవకాశం ఉంటుందనే అంశాన్ని టీడీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. పరిటాల శ్రీరామ్కు లభిస్తున్న ఆతిథ్యం, పార్టీ నాయకులు, కార్యకర్తల ఉత్సాహం ఎన్నికల ప్రచారానికి కొత్త ఊపునిస్తున్నాయి.

ఇది కేవలం ప్రచారం కాదు.. రాజకీయ పరిచయానికి వేదిక..!

కే.పూలకుంటలో ప్రారంభమైన ప్రచారం ద్వారా పరిటాల శ్రీరామ్ తన రాజకీయ నేపథ్యాన్ని ప్రజలకు పరిచయం చేసుకోవడంతోపాటు, నల్లచెరువు మండల అభివృద్ధిపై తన వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ప్రజాసేవతో అనుసంధానించగలిగితేనే స్థానికంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఏర్పడుతుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

నా పేరు పరిటాల శ్రీరామ్.. నా లక్ష్యం నల్లచెరువు అభివృద్ధి అనే నినాదంతో ఆయన సాగిస్తున్న రాజకీయ ప్రయాణం ఎలాంటి ప్రజా స్పందనను సొంతం చేసుకుంటుందో, ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి.

మరో తుపాను ముప్పు.. యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి!

- భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో గ్రామస్థాయి వరకు జాగ్రత్తలు
- కలెక్టరేట్లో 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం
- డివిజన్లు, మండలస్థాయిలోనూ సీసీసీల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



పశుసంవర్ధక, ఐసీడీఎస్ తదితర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండి, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్లు:

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా అధికారులు చేసే సూచనలు పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ప్రత్యేక కమాండ్ కంట్రోల్ కేంద్రాలకు సమాచారమివ్వాలని సూచించారు. ముందుజాగ్రత్తగా విజయవాడ డివిజన్ (75690 08425), తిరువూరు డివిజన్ (08673-251235), నందిగామ డివిజన్ (78930 53534)తో పాటు అన్ని మండలాల్లోనూ కమాండ్ కంట్రోల్ కేంద్రాల నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టరేట్లో 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఇందులో వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

విజయవాడ,నవంబర్,1,(మనం న్యూస్) మరో తుపాను ముప్పు పొంచిఉందని, వచ్చే రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం స్పష్టమైన లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. రెవెన్యూ అధికారులు ప్రమాదకర భవనాలు, చెట్లను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పోలీస్ శాఖ శాంతిభద్రతలు, సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖ మొబైల్ ఆసుపత్రులు, మందులు తదితరాలను సిద్ధం చేయాలని, పౌర సరఫరాల శాఖ సహాయక శిబిరాలకు అవసరమైన ఆహార పదార్థాలను సమకూర్చాలని సూచించారు. విద్యుత్, రోడ్లు-భవనాలు, అగ్నిమాపక, నీటిపారుదల, పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యానవన, సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలింగ్ నిర్వహణలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, పరస్పర సమన్వయంతో పనిచేయడం వల్ల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో 1,000 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం పోలింగ్ కేంద్రాల వద్ద దాదాపు 1,000 మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు సేవలందించారని తెలిపారు. ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం, క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, రద్దీని నియంత్రించడం వంటి విధుల్లో వాలంటీర్లు చూపిన చొరవ, సేవా దృక్పథం అభినందనీయమని పేర్కొన్నారు. సమష్టి కృషి, సమన్వయంతో ప్రశాంతంగా పోలింగ్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం, శాఖల మధ్య నిరంతర సమన్వయం, క్షేత్రస్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణతో పోలింగ్ ప్రక్రియ విజయవంతమైందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో అన్ని శాఖలు సమర్థవంతంగా పనిచేశాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విజయవంతంగా ముగిసేందుకు విశేష కృషి చేసిన పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ తదితర అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ప్రత్యేక అభినందనలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



- ఎన్నికల కమిషన్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి
- ఒత్తిళ్లు, ప్రలోభాలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నవంబర్,1,(మనం న్యూస్): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేస్తూ, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందన్నారు.

ఆదివారం విజయవాడ నగరపాలక సంస్థతో పాటు కొండపల్లి, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మున్సిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఉదయం నుంచి కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పోలింగ్ సరళిని పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లో పోలింగ్ కొనసాగుతున్న తీరును, పోలింగ్ కేంద్రాల పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ప్రక్రియలో ఎక్కడా అంతరాయం కలగకుండా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విజయవాడ అర్బన్ పరిధిలోని కేబీఎన్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలు తీరును పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమం



- పారేపల్లి సాయి,ఆర్యవైశ్య సంఘం నాయకులు.

నందిగామ,నవంబర్ 1,మనం న్యూస్: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కారణజన్ముడు,తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ప్రతిన బూని, 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి,అంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు,కేంద్రం మెడలు వంచి తన ప్రాణ త్యాగంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ధీరో ధాత్తుడు,భవిష్యత్ తరాలవారికి మార్గదర్శకుడు,నేటి యువత కు స్ఫూర్తిదాయకుడు అయిన అమరజీవి పొట్టి శ్రీరాములుని తలుచుకుంటూ ఆదివారం నవంబర్ 1వ తారీకూనా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వారికి నందిగామ ఆర్యవైశ్య సంఘం తరపున పారేపల్లి సాయిబాబు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్యవైశ్య సంఘం నాయకులు పారేపల్లి సాయిబాబు,పబ్బతి జనార్దనరావు, తూములూరి నరసింహారావు, వందనపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 29న దీక్షా దివస్.. 50 వేల మందితో భారీ సభ



హైదరాబాద్, నవంబర్ 1(మనంన్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ 2009 నవంబర్ 29న అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ అలుగునూర్ వద్ద అరెస్టయిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ దీక్షా దివస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నది. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రధానంగా ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజులపాటు ప్రత్యేక బస్సు యాత్ర నిర్వహించనున్నారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా కొనసాగుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించనున్నది.

ఈ కార్యక్రమాల నిర్వహణపై కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్వేతా హోటల్లో నేడు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. దీక్షా దివస్ ఉత్సవాల నిర్వహణ, కేటీఆర్ బస్సు యాత్ర, రైతుల సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.

మేడిగడ్డ నుంచి బస్సు యాత్ర

రైతుల సాగునీటి సమస్యలను ప్రధాన అంశంగా చేసుకొని కేటీఆర్ నేతృత్వంలో రెండు రోజులపాటు బస్సు యాత్ర నిర్వహించనున్నారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య అనువైన రెండు రోజులను ఖరారు చేయనున్నారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన ప్రాజెక్టుల మీదుగా కొనసాగుతుంది. ఆయా ప్రాజెక్టుల పరిస్థితి, రైతులకు అందుతున్న సాగునీరు, నీటి పంపిణీ, ప్రాజెక్టుల ద్వారా కలగాల్సిన ప్రయోజనాలు, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలిస్తూ ప్రజలకు వివరించనున్నారు.

గతంలో రైతులకు అందిన సాగునీరు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆధారాలతో ప్రజల ముందుంచాలని సమావేశంలో చర్చించారు. సాగునీటితోపాటు తాగునీరు, విద్యుత్ సమస్యలు, గ్రామీణ ప్రాంతాల ఇబ్బందులను కూడా ప్రజాక్షేత్రంలో ప్రస్తావించనున్నారు.

అలుగునూర్లో దీక్షా దివస్ సభ

నవంబర్ 29న దీక్షా దివస్ సందర్భంగా మానకొండూరు నియోజకవర్గంలోని అలుగునూర్ లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ అరెస్టు జరిగిన అలుగునూర్ చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేస్తూ దీక్షా దివస్ ప్రాధాన్యతను ప్రజలకు వివరించనున్నారు. రైతు సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రభుత్వ వైఖరి, రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్ ఈ సభలో ప్రధానంగా ప్రస్తావించనున్నారు. సభ నిర్వహణకు సంబంధించి ప్రాంత ఎంపిక, జన సమీకరణ, ఇతర ఏర్పాట్లపై నాయకులు చర్చించారు.


రైతుల సమస్యలే ప్రధాన ఎజెండా

ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన నిలబడటం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం రాజకీయ పార్టీల బాధ్యత అని సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రైతులు సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. గతంలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అందిన ప్రయోజనాలను, ప్రస్తుత పరిస్థితులను పోల్చి ప్రజలకు వివరించనున్నారు.బస్సు యాత్రతోపాటు గ్రామస్థాయిలో కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా, స్థానిక సమావేశాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కార్యాచరణ రూపొందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి దీక్షా దివస్ కార్యక్రమాలను నిర్వహించాలని చర్చించారు.

సమావేశంలో పాల్గొన్నప్రముఖులు

ఈ సమావేశంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్తోపాటు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి, పార్టీ జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, విద్యాసాగర్ రావు, పుట్ట మధు

పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ,నవంబర్,1,(మనం న్యూస్): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఉదయం రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026 నేపథ్యంలో నగరంలోని సింగ్ నగర్, రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళి, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ, ఓటర్లకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు.

విధుల నిర్వహణలో వివిధ శాఖల మధ్య చక్కటి సమన్వయం



- ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల పోలింగ్ విజయవంతం
- కావడానికి సమష్టి కృషి చేసిన అధికార యంత్రాంగం, సిబ్బంది, వాలంటీర్లకు ప్రత్యేక అభినందనలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు

విజయవాడ: నవంబర్ 1,(మనం న్యూస్) ఎన్టీఆర్ జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో విధులు నిర్వర్తించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు సంయుక్తంగా ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ

మనం ముద్ర
సోమవారం 2 నవంబర్ 2026



15,000 మరణాలు?!

రానున్న మూడునెలల్లో ఎల్ నినో మృత్యుపాశం

వీక్షణం

ప్రస్తుతం కొనసాగుతున్న 'సూపర్' ఎల్ నినో వల్ల ఏర్పడుతున్న తీవ్రమైన వేడి కారణంగా, ప్రపంచవ్యాప్తంగా కొన్ని నెలల్లోనే సుమారు 4,50,000 మరణాలు సంభవించవచ్చని చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ ఇటీవల ప్రచురించిన ఒక నివేదిక వెల్లడించింది. భారతదేశానికి కూడా ఈ గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. కేవలం సెప్టెంబర్, ఫిబ్రవరి మధ్యనే సుమారు 15,000 మరణాలు సంభవించవచ్చు. ఈ మరణాలలో దాదాపు సగం, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే.., అంటే కేవలం మూడు నెలల్లోనే సంభవించే అవకాశం ఉంది. భారతదేశంలో వేడి సంబంధిత సమస్యలపై పనిచేసే నిపుణులు, దేశం దీనిని ఒక ముఖ్యమైన అంచనాగా పరిగణించి, హెచ్చరికలకు మించి తక్షణ ప్రతిస్పందన చర్యలను చేపట్టాలని అంటున్నారు.

లక్షలాది ప్రాణాలను బలిగొనే సూపర్ ఎల్ నినో

వాతావరణంలోను, వర్షపాతంలోను మార్పులను తీసుకువచ్చే సూపర్ ఎల్ నినో ప్రపంచాన్ని పట్టిపీడిస్తోందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు, సెప్టెంబర్ 16న, దాదాపు 200 మంది భారతీయ పర్యావరణవేత్తలు ఒక బహిరంగ లేఖను ప్రచురించారు. పర్యావరణ వ్యవస్థలపై ఎల్ నినో ప్రభావాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడానికి, రాబోయే నెలల్లో పర్యవేక్షణ డేటాను బలోపేతం చేయాలని వారు తమ తోటి పర్యావరణవేత్తలను కోరారు. దానికి కొన్ని రోజుల ముందు, ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ, ఎల్ నినో 'దృఢంగా స్థిరపడిందని, రాబోయే నెలల్లో చాలా బలమైన సంఘటనగా తీవ్రతరం అవుతుందని, వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై పెద్ద ప్రభావాలను చూపుతుందని, అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా ఉంటాయని' ప్రకటించింది. అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయంలోని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్‌కు చెందిన శాస్త్రవేత్తలు, ఈ సంవత్సరం సూపర్ ఎల్ నినో కారణంగా సంభవించే తీవ్రమైన వేడి సంబంధిత మరణాలను అంచనా వేశారు. స్థానిక వాతావరణం, దుర్బలత్వం, అనుకూల సామర్థ్యంలోని వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుని, ఉష్ణోగ్రత, అధిక మరణాల మధ్య సంబంధాన్ని పరిమాణాత్మకంగా నిర్ధారించే మునుపటి పరిశోధనల నుండి పొందిన ఆధారాలను ఉపయోగించి వారు కాలానుగుణ మరణాల అంచనాలను విశ్లేషించారు. ఈ పరిశోధన ఫలితాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఎల్ నినో కాలంలోని మొదటి అర్ధభాగంలోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు 4,51,000 మరణాలు సంభవిస్తాయని ఈ నివేదిక అంచనా వేస్తోంది.

దేశంలో సుమారు 15,000 మరణాలు

నివేదిక ప్రకారం, ఎల్ నినో వేడి ప్రభావ మరణాలు ప్రధానంగా భౌగోళికంగా దక్షిణాది ప్రాంతాల్లోనే కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. రాబోయే ఆరు నెలల్లో, ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతమంతటా అదనంగా 66,800 మరణాలు సంభవిస్తాయని నివేదిక అంచనా వేస్తోంది. వేడి సంబంధిత మరణాల పరంగా అత్యధికంగా ప్రభావితమైన మొదటి పది దేశాల్లో భారతదేశం నాల్గవ స్థానంలో ఉంది. గత సెప్టెంబర్, ఫిబ్రవరి మధ్య సూపర్ ఎల్ నినో వల్ల ఏర్పడే తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా ఒక్క భారతదేశంలోనే అదనంగా సుమారు 15,800 మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ విషయంలో భారతదేశం నాలుగవ అత్యంత ప్రభావిత దేశంగా ఉంటుంది. ఆ మరణాలలో దాదాపు సగం (7,400) డిసెంబర్, ఫిబ్రవరి నెలల మధ్య సంభవించే అవకాశం ఉంది. మొత్తం 15,800 మరణాలలో దాదాపు 2,600 మరణాలు ఒక్క మహారాష్ట్రలోనే కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్లో కూడా వేడి సంబంధిత కారణాలతో అదనంగా సుమారు 1,500 మరణాలు సంభవించే అవకాశం ఉంది. అంతేకాకుండా, తమిళనాడులో 1,600, ఒడిశాలో 1,000, కర్ణాటకలో 1,900, ఆంధ్రప్రదేశ్‌లో1,700, కేరళలో 1,700, తెలంగాణలో 1,100 మరణాలు సంభవిస్తాయని నివేదిక అంచనా వేసింది. అందువల్ల, భారతదేశం దీనిని (దేశంలో వేడి సంబంధిత మరణాల మొత్తం అంచనాను) ఒక ముఖ్యమైన స్థూల అంచనాగా పరిగణించాలి అని, తీవ్రమైన వేడిపై అవగాహన, ఆధారాలు, మార్పు కోసం ఒత్తిడిని పెంచడానికి భారతదేశం అంతటా పనిచేసే 'హీట్‌వాచ్' అనే బృందం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపేక్షిత వర్మ్నీ అన్నారు. వేడి సంబంధిత అనారోగ్యాలు, మరణాలను గుర్తించి, నమోదు చేయడానికి జిల్లా అధికారులకు పటిష్టమైన, ప్రామాణికమైన శిక్షణ లేదు. అలాగే, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుండి జిల్లా, రాష్ట్ర నిఘా వ్యవస్థల వరకు నిరంతరాయంగా సమాచారం అందించే వ్యవస్థ కూడా లేదు. వేడి తరచుగా గుండె, శ్వాసకోశ, మూత్రపిండాల సంబంధిత వ్యాధులను తీవ్రతరం చేస్తుంది. అందుకే మరణాలను కేవలం 'వేడి సంబంధిత మరణాలు'గా నమోదు చేయడం చాలా అరుదు. నిఘా, మరణ ధృవీకరణ, సమాచార మార్పిడి మెరుగుపడే వరకు, ఈ ప్రజారోగ్య సంక్షోభం తాలూకు తీవ్రతను అంచనా వేయడానికి ఇలాంటి అధ్యయనాలే ఉత్తమమైన సూచనలను అందిస్తాయి,'అని ఆమె అంటున్నారు. భారతదేశం తీవ్రమైన వేడిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా, అలాగే వృత్తి, కార్మిక హక్కుల సంక్షోభంగా పరిగణించడం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె అన్నారు.




తక్షణ చర్యలు

నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, చెత్త ఏరుకునేవారు, వ్యవసాయ కూలీలు, డెలివరీ కార్మికులు, గృహ కార్మికులు వంటి అసంఘటిత రంగ కార్మికులు అత్యంత ఎక్కువగా ప్రమాదానికి గురవుతున్నారు. దీనికి సంబంధించి సరైన సమాచారం కూడా లభ్యం కావడం లేదు. అయినప్పటికీ, వారు ఎప్పుడు, ఎక్కడ, ఎంతసేపు పని చేయాలనే దానిపై వారికే అతి తక్కువ నియంత్రణ ఉంటుంది. ఒక రోజు పని మానేస్తే అత్యవసర ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నందున, కార్మికులు నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లోనే పని కొనసాగిస్తున్నారు. అందువల్ల, కేవలం వేడి హెచ్చరికలకు మించి స్పందన ఉండాలి. దీనిలో అధికారిక, అనధికారిక, ప్లాట్‌ఫారమ్ పనులన్నింటిలో అమలు చేయదగిన వేడి-భద్రతా ప్రమాణాలు ఉన్నాయి: వేతనంతో కూడిన విశ్రాంతి విరామాలు, నీడ, సురక్షితమైన తాగునీరు, శీతలీకరణ, ప్రథమ చికిత్స, సౌకర్యవంతమైన పని గంటలు, తీవ్రమైన వేడి సమయంలో తప్పనిసరిగా పనిని నిలిపివేయడం లేదా పునఃప్రణాళిక చేయడం, ఈ చర్యలు అమలు అవుతున్నాయని నిర్ధారించడానికి పటిష్టమైన తనిఖీ వ్యవస్థలు. అదనంగా, వేడి కారణంగా పని చేయడం అసురక్షితంగా మారినప్పుడు వేతన జరిమానాల నుండి కార్మికులను రక్షించాలి. యజమానులు, కాంట్రాక్టర్లు, ప్లాట్‌ఫారమ్‌లను జవాబుదారీగా చేయాలి. అదే సమయంలో, మనకు అందుబాటులో ఉండే శీతలీకరణ కేంద్రాలు, నమ్మకమైన నీరు, విద్యుత్ సరఫరా, అల్ప ఆదాయ నివాస ప్రాంతాలకు లక్షిత మద్దతు, అలాగే వడదెబ్బ అనారోగ్యాలను గుర్తించి, చికిత్స చేసి, నమోదు చేయడానికి సిద్ధంగా ఉన్న జిల్లా స్థాయి ఆరోగ్య వ్యవస్థలు అవసరం. ఈ చర్యలన్నీ సత్వరం అమల్లోకి రావాలి.

- కల్కి

రెండు సవాళ్ళు

ఎల్ నినో భారతదేశంలో విద్యుత్ డిమాండ్‌లో పెరుగుదలకు కారణం కానుంది, కానీ పవన, జల విద్యుత్ ఉత్పత్తిని తగ్గిస్తుంది.సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (**CREA**) ఇటీవల జరిపిన విశ్లేషణ ప్రకారం, ఒక ఎల్ నినో నమూనా దృష్టాంతంలో భారతదేశానికి అదనంగా 17.7 టెరావాట్-గంటల శిలాజ ఇంధన విద్యుత్ ఉత్పత్తి అవసరం కావచ్చు. **CREA** చేసిన ఒక కొత్త విశ్లేషణ ప్రకారం, రాబోయే ఎల్ నినో భారతదేశాన్ని రెండు విధాలుగా దెబ్బ తీయనుంది. ఈ వాతావరణ పరిణామంతో ముడిపడి ఉన్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా భారతదేశంలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉండగా, వర్షపాతం, గాలులు తగ్గడం వల్ల దేశంలో పవన, జల విద్యుత్ ఉత్పత్తిలో తగ్గుదల ఏర్పడవచ్చు. మోడల్ సిమ్యులేషన్లను ఉపయోగించి, **CREA**లోని పరిశోధకులు జూలై 2026 నుండి జూన్ 2027 వరకు 110 దేశాల్లోని విద్యుత్ రంగంపై, లా నినా (కొంతకాలం పాటు భారతదేశంలో అమలులో ఉన్న చల్లని ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతం ఉండే కాలం) నుండి ఎల్ నినో (సాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతంతో ముడిపడి ఉండే కాలం)కు అంచనా వేయబడిన పరివర్తన ప్రభావాన్ని విశ్లేషించారు.



దేశం ముందు రెండు సవాళ్లు

విశ్లేషణ ప్రకారం, 2026-27లో లా నినా నుండి ఎల్ నినోకు మారడం వల్ల 110 దేశాలలో శిలాజ ఇంధనాల వినియోగం పెరుగుతుంది, జూలై 2026 నుండి జూన్ 2027 వరకు పెరిగిన శిలాజ ఇంధన డిమాండ్ మొత్తం సుమారు 80 టెరావాట్-గంటలు (**TWh**) ఉంటుంది. 'జలవిద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడిన లేదా ఉష్ణోగ్రతల కారణంగా భారీ డిమాండ్ పెరుగుదలను ఎదుర్కొంటున్న దేశాలు అత్యధిక ప్రమాదంలో ఉన్నాయి: భారతదేశం (+17.7 **TWh**), వియత్నాం (+8.0 **TWh**), దక్షిణాఫ్రికా (+7.7 **TWh**), చిలీ (+5.0 **TWh**), మెక్సికో (+4.7 **TWh**),' అని ఒకానొక విశ్లేషణ పేర్కొంది. ఆ విశ్లేషణ ప్రకారం, భారతదేశం రెండు సవాళ్లను ఎదుర్కొంటుంది.

ఒక సవాలు ఏమిటంటే, ఎల్ నినో వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదలకు కారణమవుతాయి. దీని ఫలితంగా, ఒక సంవత్సరంలో అదనపు శీతలీకరణ డిమాండ్ 9.9 టెరావాట్-గంటల (**TWh**) వరకు ఉండవచ్చని, ఇది ఢిల్లీ వార్షిక విద్యుత్ వినియోగంలో నాలుగో వంతుకు సమానమని విశ్లేషణ పేర్కొంది.

మరొకటి ఏమిటంటే, ఎల్ నినో తక్కువ వర్షపాతాన్ని, గాలులలో తగ్గుదలను తీసుకువస్తుంది. ఇది జల విద్యుత్ ఉత్పత్తిని, పవన విద్యుత్ ఉత్పత్తిని రెండింటినీ ప్రభావితం చేస్తుంది. ఈ నష్టాలను భర్తీ చేయడానికి భారతదేశం 4.9 **TWh** శిలాజ ఇంధన ఉత్పత్తిని (తగ్గిన పవన విద్యుత్ ఉత్పత్తిని భర్తీ చేయడానికి), 2.9 **TWh** జల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే, భారతదేశం ఒక సంవత్సరంలో 17.7 **TWh** విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి శిలాజ ఇంధనాలను ఉపయోగించాల్సి ఉంటుంది. మరింత తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులలో, శిలాజ ఇంధన ఉత్పత్తి దాదాపు 24 **TWh** వరకు పెరగవచ్చు.

రాష్ట్రాలపై వేర్వేరు ప్రభావాలు

అయితే, రాష్ట్రాలవారీగా దీని ప్రభావాలు వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. **CREA** విశ్లేషణ ప్రకారం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి నష్టాల కంటే ఎక్కువగా, శీతలీకరణకు అవసరమైన విద్యుత్ కొరత కారణంగా, కేంద్ర దృష్టాంతంలో కర్ణాటకలో శిలాజ ఇంధన ఉత్పత్తి అత్యధికంగా పెరుగుతుంది. ఈ ధోరణి తమిళనాడు, ఉత్తర ప్రదేశ్‌లలో కూడా కొనసాగుతుంది, అక్కడ అధిక ఉష్ణోగ్రతల కారణంగా శీతలీకరణకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడం వల్ల శిలాజ ఇంధన ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. ఎల్ నినో కారణంగా రుతుపవన వర్షపాతం తగ్గడంతో, బలహీనమైన రుతుపవన పరిస్థితుల వల్ల జలాశయాల్లోకి నీటి ప్రవాహం తగ్గడమే దీనికి కారణం కావచ్చు. తన విద్యుత్ అవసరాల కోసం పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువగా ఆధారపడే గుజరాత్, ఎల్ నినో కారణంగా పవన విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్ వైపు మళ్లాల్సి ఉంటుంది. అయితే, అన్ని రాష్ట్రాలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవు. **CREA** విశ్లేషణ ప్రకారం, ఈశాన్యంలోని అనేక రాష్ట్రాలు జలవిద్యుత్ ఉత్పత్తిలో స్వల్ప పెరుగుదలను చూపవచ్చు, దీనివల్ల శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్ అవసరాలలో చిన్న తగ్గుదల ఏర్పడుతుంది.

ఆశావహంగా సౌర విద్యుత్

విశ్లేషణ ప్రకారం, ఇలాంటి పరిస్థితులలో సౌర విద్యుత్ ఉత్పత్తి భారతదేశానికి ఒక రక్షగా నిలవగలదు. ఇది బహుశా ఇప్పటికే ప్రభావం చూపి ఉండవచ్చు: 2026లో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ, అధిక సౌర విద్యుత్ ఉత్పత్తి కారణంగా ఈ ఏడాది జనవరి నుండి మే వరకు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, 2024 జనవరి-మే స్థాయిల కంటే తక్కువగా ఉంది. కానీ బ్యాటరీ నిల్వ ఇప్పటికీ ఒక పెద్ద ఆందోళనగా ఉంది.

'భారతదేశం ఇటీవలే తీవ్రమైన వడగాలులను, రికార్డు స్థాయిలో అత్యంత వేడి వేసవిని ఎదుర్కొంది. దీంతో విద్యుత్ డిమాండ్ 270 గిగావాట్ల సర్వకాలిక గరిష్ట స్థాయికి చేరింది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర విద్యుత్ లక్ష్య దిశగా భారతదేశం పయనించడమే కాకుండా, బ్యాటరీలు, గ్రిడ్ అప్‌గ్రేడ్‌ల విషయంలో కూడా మరింత వేగంగా ముందుకు సాగాలి. తద్వారా భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను స్వచ్ఛ ఇంధనం విశ్వసనీయంగా, సరసమైన ధరలకు తీర్చగలదు' అని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (**CREA**) డైరెక్టర్ నందికేష్ శివలింగం ఒక ప్రకటనలో తెలిపారు.

- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.